1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 7
సంచిక : 8
పుటలు : 52
రు. 25 లు
ISSN NO: 2582-8738

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

జనవరి 2022

యు.జీ.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in











**అమ్మనుడి** లో ధారావాహికగా వచ్చిన 'జగమునేలిన తెలుగు– గోదావరి నుండి జావాదాకా...' పుస్తకంగా విడుదలైంది. రచయిత్రి అనురాధకు తాపీధర్మారావు పురస్కారాన్ని అందించడానికై న్యాయమూర్తులు, జర్నలిస్టులు, రచయితలు, సామాజికవేత్తలతో డిసెంబరు 12న హైదరాబాదులో చిరస్మరణీయమైన సభ జరిగింది.

అమ్మనుడులతోనే మానవ వికాసం

# 32వ 'విజయవాడ పుస్తక మహోత్సవం'

## 2022 జనవరి 1 నుండి 11 వరకు, స్వరాజ్య మైదానంలో












# తెలుగుజాతి (ట్రస్టు) • 'అమ్మనుడి' పత్రిక

# స్టాల్ 78 దర్శించండి

## అమ్మనుడి చందాదారులుగా చేరండి

## స్టాల్‌లో చందా చెల్లించి రశీదు తీసుకోండి

4 సం॥ చందా : రూ. 1000; 1 సం॥ చందా : రూ 300

జీవిత చందా: రూ 5000

## ఈ క్రింది పుస్తకములు 10 శాతం రాయితీతో స్టాల్‌లో అమ్మబడును




రు.200



రు.100




రు.300



రు.99

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



జనవరి 2022

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరు నామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

**4. రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

**5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను,వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపి సహకరించండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని పరిశీలించడం ఇబ్బంది అవుతుందని గమనించండి.**

## సంక్రాంతి శుభాకాంక్షలు

### లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **సంపాదక హృదయం:** | అమ్మనుడులతోనే మానవ వికాసం | | **07** |
| **అమ్మనుడి ఆర్థికాభివృద్ధి:** | సంపద సృష్టిలో... | **గారపాటి ఉమామహేశ్వరరావు** | **09** |
| **తెలుగునుడి-బోధన:** | మాతృభాషలు-విద్యాబోధన | **పరిమి రామనరసింహం** | **11** |
| **తెలుగునుడి-లిపి:** | అక్షరాభ్యాసం-కొత్త పద్ధతి | **అల్లంసెట్టి చంద్రశేఖరరావు** | **17** |
| **మన చదువుల కథలు:** | బడి కష్టాలు | **సి.వి.క్రిష్ణయ్య** | **23** |
| **వారసత్వ సంపద:** | అడుగంటిపోతున్న అమ్మనుడి... | **పి.శివరామకృష్ణ'శక్తి'** | **26** |
| **పొరుగుతెలుగుల కతలు:** | తెన్నాటి తెమ్మెర(తెలుగువారి తమిళ... | **స.వెం.రమేశ్** | **32** |
| **పురస్కారం:** | తాపీధర్మారావు పురస్కారసభ ప్రసంగాలు | | **37** |
| **సాహిత్యరంగం:** | తొండనాడు భారతం మిట్టలు | **మధురాంతకం నరేంద్ర** | **47** |
| **రచనా రంగం** | రచనా, రచయితా-ఏది... | **బి. లలితానంద ప్రసాద్** | **49** |
| **ధారావాహిక:** | అడుగుజాడలు-ఆనవాళ్లు-14 | **ఈమని శివనాగిరెడ్డి** | **29** |
| **కవితలు:** | శ్వాస | **డా.సి.భవానీదేవి** | **16** |
| | పొలిమేర ఆవల | **కరణం కళ్యాణకృష్ణకుమార్** | **22** |


| కార్టూన్లు | రేఖాచిత్రాలు | ఫోటోలు | కంప్యూటర్ |
|---|---|---|---|
| **సరసి** | **చిదంబరేశ్వరరావు** | **అనుమల్ల గంగాధర్** | **బండారు రఘురాం** |

ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదవగలరు

రచనలను, వార్తలను, వాట్స్‌యాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి,** జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

**రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.**

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000

4 సం॥: రూ.1000, 1 సం॥ :రూ.300

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

## బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

గూగుల్ పే/ ఫోన్ పే ద్వారా **'అమ్మనుడి'** పత్రిక చందా పంపవచ్చు

**నెం. '94929 80244'తో**

బిజినెస్ ఆప్షన్‌లోకి వెళ్ళి

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

ఎంట్రీ చేసి పంపవచ్చు

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమ పూర్తి చిరునామాను, ఫోన్ నెంబరు, మెయిల్ ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు. **94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94929 80244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

'అమ్మనుడి' పత్రికను నడపడం ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. చందాలే ముఖ్య ఆధారంగా ఉన్నది గనుక - మీరు చందాదారులుగా చేరడంతో పాటు, మీ మిత్రులను, సంస్థలను ప్రోత్సహించి వారిని చందా దారులుగా చేర్పించగోరుతున్నాము.

-ప్రచురణకర్త

## ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

**తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ**

# తెలుగు భాషోద్యమ సమాఖ్య

(ప్రభుత్వ నమోదు సంఖ్య 1288/2003)

కార్యాలయం : జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కాలేజీ వీధి, మాచవరం, విజయవాడ-520 004.

గౌరవాధ్యక్షుడు
డా॥ చుక్కా రామయ్య
ఫోన్: 9490300716

అధ్యక్షుడు
డా॥ సామల రమేష్‌బాబు
ఫోన్: 9848016136

## విస్తృత సమావేశానికి ఆహ్వానం

తెలుగు భాషోద్యమ సమాఖ్యను 2003 ఫిబ్రవరి 21న స్థాపించినప్పటి నుండి తెలుగు భాష రక్షణకోసం, అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను తెలుగు రాష్ట్రాలలోను, ఇతర ప్రాంతాలలోను నిర్వహించుకొన్నాము. మిత్ర సంఘాలను కూడా ప్రోత్సహించాం. పాలన, బోధన రంగాల్లో తెలుగు అమలు కోసం ఉద్యమాలను నడిపి, న్యాయస్థానాలను కదిలించి అనేక సానుకూల ఉత్తర్వులను సాధించాం. తెలుగుకు ప్రాచీన భాషగా గుర్తింపుకై ముందుగా జాతిని మేల్కొల్పి ప్రభుత్వాలను కదిలించి గుర్తింపును తెచ్చుకున్నాం. తెలుగుకు ప్రత్యేక మంత్రిత్వశాఖ కోసమూ, తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థ కోసమూ పోరాడి, వాటికై ప్రభుత్వ ఉత్తర్వులను సాధించుకోగలిగాం. అయినా పాలకుల్లో నిజాయితీ లేకపోవడంతో అదంతా అమలులో నీరుగారిపోయింది. ఇంతేగాక గత రెండు దశాబ్దాలకు పైగా విద్యారంగంలో విపరీతంగా చోటుచేసుకున్న కార్పొరేటీకరణ విధానాల వల్లా, పాలక పార్టీలు బోధనామాధ్యమంగా తెలుగును అణిచివేసినందువల్లా మాతృభాష ప్రగతికి ఎంతో నష్టం వాటిల్లింది. ఈ అనేక పరిణామాల ఫలితంగా భాషోద్యమంలో ప్రాథమ్యాలను, విధివిధానాలను తిరిగి నిర్ణయించుకోవలసివుంది. ఇందుకోసం తెలుగు భాషోద్యమసమాఖ్యలోకి అనుభవజ్ఞులైన వారినీ, యువతరాన్నీ, విద్యార్థి ఉపాధ్యాయ ప్రతినిధులను, వివిధ రంగాల నిపుణులను మరికొందరిని స్వాగతించి, సంస్థను మరింత చైతన్యవంతంగా, ప్రయోజనకరంగా తీర్చిదిద్దుకోవాలని నిర్ణయించాము. ఒక కేంద్ర విధాననిర్ణయ మండలిని కూడా మనం ఏర్పాటు చేసుకోవలసియున్నది.

**ఇందుకోసం సమాఖ్య విస్తృత సమావేశం 2022 జనవరి 23 ఆదివారం నాడు జరుగుతుంది.**

**వేదిక :** బిషప్ ఇగ్నేషియస్ ముమ్మడి హాల్ (ఓల్డ్ సెమినార్ హాల్), ప్రధాన లైబ్రరీ వెనుక

**ఆంధ్ర లొయోలా కళాశాల, గుణదల, విజయవాడ -520008**

సమాఖ్య అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సమాఖ్య అధ్యక్షుడిని కొత్తగా ఎన్నుకోవలసియున్నది. ఇందుకోసం ఈ విస్తృత సమావేశాన్ని ఏర్పాటు చేసుకొంటున్నాం. సమాఖ్య సభ్యులతో పాటు, ఇంతవరకు సమాఖ్యతో కలసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నవారూ, ఇకపై పాల్గొనాలనే ఆసక్తి కలిగినవారూ ఈ సమావేశంలో పాల్గొనగోరుతున్నాము.

ఈ సమావేశంలో పాల్గొనదలచేవారు జనవరి 15లోపుగా 98480 16136 / 92994 56678 లకు వాట్సాప్ ద్వారా గానీ మెసేజ్ ద్వారాగానీ మీ చిరునామాను, ఫోన్ నెం., మెయిల్ ఐడిలను తెలుపగోరుతున్నాము. ఇంకా వివరాల కోసం సంప్రదించ కోరుతున్నాము.

**కార్యక్రమం:** ఉదయం గం.9.30 నుండి ప్రతినిధులు నమోదు

మొదటి సభ: 10.30 గం. నుండి మధ్యాహ్నం 1 గం. వరకు:

అధ్యక్షుని ప్రసంగం, నివేదిక సమర్పణ, ప్రతినిధుల ప్రసంగాలు, కొత్త అధ్యక్షుని ఎన్నిక, అభినందనలు.

గం 1 నుండి గం 2.30 వరకు భోజనవిరామం.

రెండవ సభ: మధ్యాహ్నం 2.30 గం. నుండి 5 గం. వరకు తీర్మానముల ప్రతిపాదన, చర్చ, ఆమోదం.

తెలుగు భాషోద్యమ సమాఖ్య సభ్యులు తప్పకుండా ఈ సమావేశంలో పాల్గొనవలసిందిగా కోరుతున్నాము.

– డా॥ వెన్నిసెట్టి సింగారావు సమావేశకర్త సెల్: 93930 15584

◆తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆశయ లక్ష్యాలను, విధివిధానాలను ఆమోదించేవారు మాత్రమే సభలో పాల్గొనగోరుచున్నాము.

◆కరోనా వైరస్ నుండి రక్షణకొరకై 'మూతిగుడ్డ'(మాస్క్)ను తప్పనిసరిగాధరించాలి. వ్యాక్సిన్‌చేయించుకున్నవారు మాత్రమే పాల్గొనాలి.

# ‘మాతృభాషను విద్యా మాధ్యమంగా ఉపయోగించండి’

## 43వ అంతర్జాతీయ భాషాశాస్త్రజ్ఞుల సదస్సులో నిపుణుల ప్రసంగాలు

మైసూరులోని కేంద్ర భారతీయ భాషల సంస్థ (CIIL) ఇంకా లింగ్విస్టిక్ సొసైటీ ఆఫ్ ఇండియా (LSI), పూణే, సహ-నిర్వహణలో డిసెంబర్ 21-23, 2021 మధ్య 43వ అంతర్జాతీయ సదస్సు పరోక్షపద్ధతిలో మూడు రోజులపాటు జరిగింది.

భారతీయ భాషాశాస్త్రజ్ఞుల సంఘ అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు సదస్సును ప్రారంభిస్తూ ‘భారతీయ భాషలూ వాటి ఆర్థిక తోడ్పాటు’ అనే అంశంపై ప్రారంభోపన్యాసం చేశారు.

భాషలు మానవ జాతుల వారసత్వపు ఆనవాళ్లు అనీ, అవి మానవ జీవన విధానాన్నీ, ఆలోచనలనూ ప్రతిబింబిస్తాయనీ, మానవ నాగరికతలోని వైవిధ్యాన్ని కూడా పరిరక్షిస్తాయనీ అన్నారు. భాషా వైవిధ్యం వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయనీ, విద్యా మాధ్యమంగా మాతృభాష ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ప్రొఫెసర్ రావు మాతృభాషలో విద్య యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెపుతూ అభివృద్ధి చెందిన ఇంకా చెందుతున్న దేశాలు సామాజిక, పౌర న్యాయ సూత్రాలకు అనుగుణంగా మాతృభాషలను విద్యా మాధ్యమంగా ఉపయోగించడం కొనసాగించాలని అన్నారు. మాతృభాషా బోధనకు చోటు లేని చోట తరగతి గది అసంబద్ధంగా మారుతుందనీ, ప్రజల భాషలో బోధించాలనే భావన ప్రజాస్వామ్యానికి మూలమని ప్రొఫెసర్ రావు అన్నారు.

జర్మనీలోని మ్యాక్స్-ప్లాంక్ మానవ చరిత్ర విజ్ఞాన శాస్త్రాల సంస్థకు (మ్యాక్స్-ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది సైన్స్ ఆఫ్ హ్యూమన్ హిస్టరీ) చెందిన మార్టిన్ హాస్పెల్‌మత్ ‘భాషా వర్ణనలూ భాషా వైశ్విక-లక్షణాలు’ అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. వివిధభాషల వర్ణనాత్మక వ్యాకరణాలూ వాటి సంవర్గ లక్షణాల ద్వారానే మానవులలో భాషా వికాసం అర్థం చేసుకోవడానికి వీలవుతుందని తేల్చిచెప్పారు.

భారతీయ భాషల కేంద్ర సంస్థ నిర్దేశకులు శైలేంద్ర మోహన్ తన అధ్యక్ష ఉపన్యాసంలో భాషావేత్తల సామాజిక పాత్రను నొక్కి చెప్పుతూ ‘ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్’ దార్శనికతను సాకారం చేసుకోవడానికి వివిధ సంస్కృతులూ సంప్రదాయాల ప్రజల మధ్య పరస్పర అవగాహనతోపాటు వారి విద్యాపరమైన ప్రయత్నాలూ కార్యక్రమాలూ ద్వారా పరస్పర అవగాహనను పెంపొందించే అదనపు బాధ్యత భాషావేత్తలపై ఉందని అన్నారు.

భారతీయ భాషల కేంద్ర సంస్థ పరిశోధన కార్యకలాపాల గురించి ప్రొఫెసర్ మోహన్ మాట్లాడుతూ, సంస్థ భారతీయ భాషల కోసం భారతీయ భాషా భాండాగార జాలస్థలిని నిర్ణీత సమయంలో విడుదల చేస్తుందని, ఇందులో ప్రధానమైన మరియు అల్పసంఖ్యాక భాషలతోపాటు ముఖ్యంగా ఈశాన్య భాషలకు చెందినది కూడా ఉంటుందని చెప్పారు. ప్రాంతీయంగానూ మరియు ఇతర స్థానిక సంఘాలద్వారా భారతీయ భాషల కేంద్ర సంస్థ భాషాశాస్త్రజ్ఞుల, భాషాబోధకుల మరియు విద్యా పరిశోధకుల అవసరాల కోసం భాషాభాండారాలూ బాల సాహిత్య డేటాబ్యాంక్‌ను విడుదల చేయాలని కూడా యోచిస్తోందని ఆయన తెలిపారు.

**తెలుగు అధికార భాషా చట్టం అమలు పరచాలంటూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిల్ దాఖలు.**

1966 అధికార భాషా చట్టం, ఆ తరువాత వచ్చిన సంబంధిత ప్రభుత్వ ఉత్తరువులు ఎన్నో ప్రభుత్వ కార్యకలాపాలు, ఉత్తరప్రత్యుత్తరాలు తెలుగులో అమలు జరిగేలా నిర్దిష్టమైన ఆదేశాలను చేసాయి. వీటిని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయటం లేదని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో పిల్ దాఖలు చేసారు గుంటుపల్లి శ్రీనివాస్. ఆయన ఆరోపణ ప్రకారం రాష్ట్ర జనాభాలోని కేవలం 13 శాతం ప్రజలకు అర్థమయ్యేలా ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు, జీఓలు ఆంగ్లంలో ఉంటున్నాయని. మెజారిటీ ప్రజలకు అర్ధమయ్యేలా వీటిని తెలుగులో అందించాలని, లేని పక్షంలో ప్రజలను నిర్లక్ష్యం చేస్తూ ప్రజలకు అన్యాయం చేస్తున్నారని, ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలకు ఇది విరుద్ధమని ఆయన అన్నారు.

హైకోర్టు అధికార భాషా చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ కోరారు. ప్రభుత్వ వలగూడులేవీ తెలుగులో లేవని, తెలుగు పట్ల ఎంత నిర్లక్ష్యం ప్రభుత్వంలో ఉందో తద్వారా తెలుస్తోందని అన్నారు.

**కేరళలో పాఠశాలల ప్రధానోపాధ్యాయుల మాతృభాష, పాఠశాల మాధ్యమ భాష ఒకటై ఉండాలి.**

కేరళ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ వారు మాతృభాషా మాధ్యమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆ భాష వారే అయి ఉండాలని ఉత్తరువులు జారీ చేసింది. రాష్ట్రంలోని తమిళ-కన్నడ పాఠశాలల హెడ్‌మాస్టర్లు తమిళ, కన్నడ భాషల వారై ఉండాలని ఈ ఉత్తరువు తెలుపుతోంది.

ఈ విధానం వలన బోధనలో, చదువుల్లో చాలా మేలైన ఫలితాలు వస్తాయని. విద్యార్థులకు, బోధనా సిబ్బందికీ ఇవ్వవలసిన ఉత్తర్వులలో అయోమయం ఉండదని కమిషన్ తెలిపింది.

మలయాళం మాధ్యమ పాఠశాలకు తమిళ ప్రధానోపాధ్యాయుడు ఉన్నా, కన్నడ పాఠశాలకు మలయాళ ప్రధానోపాధ్యాయురాలున్నా వచ్చే సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించిన తరువాత కమిషన్ ఈ ఉత్తరువు ఇవ్వటం జరిగింది.

విద్యాహక్కు చట్టం ప్రకారం బాలల సర్వతోముఖాభివృద్ధికి బోధనా మాధ్యమం మాతృభాషలోనే ఉండాలని ఉంది. విద్యార్థి మాతృభాషలో కాకుండా వేరే భాషకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులను నియమించడం ఆ విద్యార్థి హక్కులను హరించడమే అని కమిషన్ అభిప్రాయపడింది.

సంపుటి : 7 సంచిక : 8
అమ్మనుడి
జనవరి 2022

సంపాదక హృదయం

# అమ్మనుడులతోనే మానవ వికాసం

కనీసం ప్రాథమిక విద్య వరకు మాతృభాషామాధ్యమంలో బోధన ఉండేట్లు చట్టం తెమ్మంటూ 2003లోనే ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఒక ప్రయివేట్ బిల్లును నాటి శాసనసభ ప్రతిపక్ష సభ్యులు, తెలుగు భాషోద్యమ సమాఖ్య స్థాపకుల్లో ఒకరైన మండలి బుద్ధప్రసాద్ ప్రవేశపెట్టారు. 2 రోజుల చర్చ తర్వాత, అది తమవల్ల కాని పని అని నాటి విద్యాశాఖా మంత్రి తేల్చిచెప్పారు. బిల్లును ఉపసంహరించుకొంటే, తెలుగును ఒక తప్పనిసరి పాఠ్యాంశంగా(ఒక సబ్జెక్టుగా) ప్రభుత్వ ఉత్తర్వులిస్తామని, లేకుంటే ఓటింగుకు పెట్టి ఓడిపోవడానికి సిద్ధం కావచ్చునని సూచించారు కూడా. దానితో ఇస్తామన్నదానికి ఒప్పుకొని, బిల్లును వెనక్కు తీసుకోవడం జరిగింది. ఆ తర్వాత, నాలుగైదేళ్లకు ఈ అంశంపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని వేసింది తెలుగు భాషోద్యమ సమాఖ్య. ఇది విధానపరమైన నిర్ణయం గనుక తాము జోక్యంచేసుకోజాలమని చెబుతూ వ్యాజ్యాన్ని న్యాయస్థానం అనుమతించలేదు. ఈ విషయంపై నడుస్తున్న చరిత్ర / అమ్మనుడి పత్రికలో ఎన్నోసార్లు మనం చర్చించుకొన్నాం. ఆ తర్వాత ఇది మెల్లమెల్లగా దేశంలో వివిధ రాష్ట్రశాసన సభల్లో, మాతృభాషలో ప్రాథమిక విద్య అనే అంశం న్యాయస్థానాల్లో నానుతూనే ఉంది. రాజ్యాంగంలో ఉన్న అస్పష్టత వల్లా ప్రాథమిక హక్కుల అంశాలు ఇమిడినున్నందు వల్లా ఇదంతా ఒక అపరిష్కృత సమస్యగా మిగిలిపోయింది. రాష్ట్రాలకూ కేంద్రానికీ మధ్య పాలనాంశాల విభజనలో విద్య ఉమ్మడి అంశంగా ఉండటం వల్లా, భాషారాష్ట్రాల ఏర్పాటుతోపాటు, స్పష్టమైన భాషావిధానాన్ని కేంద్రం రూపొందించుకోవడంలో విఫలమైనందువల్లా ఈ పరిస్థితి ఏర్పడింది. రాజ్యాంగం ఏర్పడకముందు రాజ్యాంగ నిర్ణయ సభలో విస్తృతంగా చర్చించిన అంశం భాషా సమస్య. ఐనా ఈ విషయంలో స్పష్టమైన విధానాన్ని చేపట్టడంలో విఫలం అయ్యారు. కొత్తగా స్వతంత్ర రాజ్యం ఏర్పడిన పరిస్థితుల్లో భాషాసమస్య దేశంలో అనైక్యతను తెచ్చి విభజనకు దారి తీస్తుందేమోనన్న శంకతో, అందుకు అవకాశమివ్వకూడదన్న జాగ్రతలో సమస్యను 15 ఏళ్ల తర్వాత చూద్దామన్నట్లు తీర్మానించారు. ఈ లోపుగా పరిపాలనలో విద్యలో, కోర్టుల్లో ఆంగ్లం బాగా కుదురుకొంది. హిందీ ఆధిపత్యవాదుల నేతృత్వంలోని పాలక, ప్రతిపక్ష పార్టీల విధానాలు ఇందుకు దోహదపడ్డాయి. 75 ఏళ్ల తర్వాత ఇప్పటికీ ఈ సమస్య వల్ల దేశంలో 80 శాతం మంది ప్రజలు భాషాపరమైన దోపిడీకి గురి అవుతూనే ఉన్నారు. సరళంగా చెప్పాలంటే తమ భాషాహక్కును పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నారు.

భారతదేశం అనేక భాషల కలపోతగా ఉన్న ఒక భౌగోళిక సమూహం. భాషాజాతులనే మాటను వాడితే కొందరు జాతీయతా తీవ్రవాద వర్గాలకు బాధ కలుగుతుంది. నిజానికి, మాట్లాడే భాషవల్లనే ప్రజాసమూహాల గుర్తింపు జరుగుతుంది. అలాకాకపోతే మానవులంతా ఒకే జాతి. దాన్ని విభజించి చూడాలంటే ఆడవారనీ మగవారనీ అనుకోవచ్చు. అనేక వందల ప్రాణిసమూహాల నుండి మనుషుల్ని విడమరిచిచూడాలంటే భాషను బట్టి జాతులుగా గుర్తించడమే సరైన పద్ధతి. అంతేగాని రంగునుబట్టో, తిండినిబట్టో వారిని విభిన్నజాతులుగా చూడలేము. హిందీవారు, తమిళులూ'జాతి' అనే మాటను కులం అనే అర్థంలో వాడతారట. అది వేరేసంగతి.

ఇప్పుడు సాంకేతికంగా కూడా భాషల ప్రయోజనం విస్తరించింది. అన్ని మానవసమూహాలు సాంకేతికతను వినియోగించుకొని తమ భాషల వినియోగంతోనే అంతర్జాతీయ సంబంధాలను పొందగలిగేవిధంగా సాంకేతికత అందుబాటులోకి వస్తున్నది. ఇటువంటి పరిస్థితుల్లో – భాషాపరంగా రాజకీయ ఘర్షణలకు అవకాశమే లేదు, కావాలని కెలికితే తప్ప! కాని, ఎంత అధిక సంఖ్యాక భాషీయులైనా ఆధిపత్య ధోరణులను అవలంబిస్తే మాత్రం అనేక విధాలుగా సమాజంలో అసంతృప్తి ఏర్పడి అనైక్యతకు బీజాలుపడే అవకాశం ఉంది. కనుక అన్ని రాజ్యాంగ వ్యవస్థల్లో, కనీసం రాజ్యాంగ గుర్తింపు పొందిన భాషలవారికైనా, తమ భాషలో తమ భావాలను వెల్లడించడానికీ తమ పనులను నెరవేర్చుకోవడానికీ అవకాశాలుండాలి. కేంద్ర చట్టసభల్లో, న్యాయస్థానాల్లో, పాలనా వ్యవహారాల్లో తమ భాషలతో తాము పూర్తిగా వ్యవహరించగలిగాలి. ఆధునిక సాంకేతికతను శ్రద్ధగా ఉపయోగించుకొంటే అతి త్వరగానే యీ పరిస్థితిని

మనం సాధించుకోవచ్చు. అంతేగాని, ఇంగ్లీష్ అంతర్జాతీయ భాష అనే మోసపూరిత కుట్రకు బలికావడం వల్లనో, జాతీయ భాష అనే తప్పుడు అవగాహనతో హిందీ జాతీయవాదుల ఎత్తుగడలకు తలవంచడం వల్లనో భాషాపరమైన సమస్యలను ఏ స్థాయిలోనూ పరిష్కరించుకోవడం జరగదు. దీనిని అతివాదంగానో, మరోకటిగానో తోసి వేయవచ్చుగాని, నిజంగా జరుగవలసిందీ, జరుబోయేదీ ఇదే. సమాజాల సంఘటనకు, అభివృద్ధికీ ఇదే దారి.

భాషా సమస్యలతో మొదలుపెట్టి ఎక్కడెక్కడో సుదూర సమస్యల గురించి మాట్లాడుతున్నామని అనుకోనక్కరలేదు. సుదూరంగా, లోతుగా ఆలోచించినప్పుడిదే సరైన ఆలోచన. మానవుడికి అన్ని విధాలా పరిపుర్ణ న్యాయం జరగాలంటే అతని భాషను గుర్తించాలి. ఆ భాషా సమూహాల / జాతుల వికాసాన్ని మనం కోరుతుంటే సమస్యల పరిష్కారానికి ఇదే దారి. ఇందుకోసం ఆయా భాషలవారికి వారి భాషల్లోనే చదువులు చెప్పాలి. తమ సొంత భాషలోనే సర్వవిజ్ఞానాన్ని పొందడానికి అతనికి అవకాశముండాలి. తమ భాషను ఆధునిక జ్ఞాన సాధనకు, జీవనావసరాలకు వినియోగించుకోగల అవకాశం ఉంటే క్రమంగా అవసరమైన ఇతర భాషలను నేర్చుకోవడమూ, వాటిద్వారా పొందగల జ్ఞానాన్ని పొందడమూ అతనికి ఒక సమస్యేకాదు. ఇందుకు విరుద్ధంగా ఇంగ్లీషుతోనే నీ అభివృద్ధి అని చెప్పడం, నీ భాషచాలా చిన్నదనో, సమర్థవంతమైనది కాదనో చెప్పడం పెద్ద అబద్ధం, అశాస్త్రీయం, దగా, కుట్ర! భాషాజాతులనూ ఆవిధంగా సమస్త మానవాళినీ మోసగించడం!

మరి– ఇప్పుడు చెప్పండి. భారతదేశానికి ఒకే ఒక జాతీయభాష ఉండాలా? ఇంగ్లీషును చదవకపోతే అభివృద్ధి ఉండదా? ఆ భాషే గొప్పదా? మీ భాష, నా భాష మనం ఎదగడానికి పనికిరావా? మనదేశ స్వాతంత్ర్యం అన్ని భాషాసమూహాల అభివృద్ధికోసం కాదా? ఇలా ఆలోచించాలనీ ఇలా మనల్ని మనమే ప్రశ్నించుకోవాలనీ ప్రజల బుర్రల్లోకెక్కిస్తే తప్ప మన సమాజాలు కళ్లు తెరువవు.

ఇదే సమయంలో – మన ప్రభుత్వాల్ని, వాటి నేతలనూ ఈ అంశంపై స్పష్టత ఇవ్వకుండా దోబూచులాడుతూ అవకాశవాదంతో విర్రవీగుతున్న మన రాజకీయపార్టీలనూ నిలదియ్యాలి. ఈ దిశగా భాషోద్యమాలు సాగాలి.

భాషోద్యమాలంటే సాహిత్యోద్యమాలనేది తప్పుడు అవగాహన. తెలుగుతల్లిని కీర్తిస్తూ పాడుకుంటే, ఉపన్యాసాలు దంచితే తాము భాషాసేవకులమని గుర్తించబడతామనుకోవడం ఊహాలోకంలో తేలిపోవడం మాత్రమే. భాషోద్యమాల పేరుతో పండిత సత్కారాలతో కాలక్షేపం చేస్తే అది అమాయకత్వమో, గడుసుతనమో అవుతుంది!

మాతృభాష అనే మాట ఎక్కువగా వినబడుతోంది. ఆ మాటనే 'అమ్మనుడి' అని కూడా అంటాం. అమ్మ లేకుండా మన పుట్టుక ఉండనట్లే, భాషలేకుండా మన మనుగడా ఉండదు, మనుషులుగా మన భవితా ఉండదు.

ఇప్పుడు తెలుగుభాషోద్యమ సమాఖ్య ఏర్పడి ఫిబ్రవరి 21 నాటికి 19 ఏళ్లు పూర్తిచేసుకొని, 20వ పడిలోకి అడుగుపెట్టబోతున్నది. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఇంతకాలంగా చేసిన కృషి చరిత్రాత్మకమైనదే. అయితే జరిగింది కొంతే. జరుగవలసింది ఎంతైనా ఉంది. ఇప్పుడు తెలుగుజాతి జనులు ఆలోచిస్తున్నారు. యువతరం నిద్రపోతున్నదని అనుకోకూడదు. వారిలో స్ఫూర్తిని నింపుతూ ముందుకు సాగడమే మన కర్తవ్యం.

మాతృభాషల్ని రక్షించుకోవాలనే తపన ప్రపంచంలోని అన్ని భాషాజాతుల్లో క్రమక్రమంగా వికసిస్తున్నది. ఇందులో మన దేశం, మన తెలుగుభాషాజాతి వెనుకపడాల్సిన అగత్యం ఏమీలేదు. ఎవరి అమ్మనుడితో వారు ఎదగడానికి అన్ని అవకాశాలను సమకూర్చడమే ప్రభుత్వాల, వ్యవస్థల బాధ్యత. ఆ బాధ్యతను విస్మరించినవారిని పాలనావ్యవస్థలో కొనసాగనీయరాదు. అటువంటి వారిని పాలనావ్యవస్థల్లోకి పంపకూడదు. ఈ దిశగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విస్తృత ప్రచారం జరగాలి. పరిపాలన, బోధన తెలుగులోకి తేవడమనే తక్షణ లక్ష్యంతో పనిచెయ్యడమే భాషోద్యమకారుల కార్యక్రమం కావాలి.

అమ్మనుడితోనే చైతన్యం, అమ్మనుడితోనే అభివృద్ధి, అమ్మనుడితోనే అందలం. విద్యారంగంలో తొలి చదువుల నుంచి మలి చదువుల వరకు అమ్మనుడిదే అగ్రపీఠం అయితేనే ఇది సాధ్యం అవుతుంది.

అంతేకాదు, పరిపాలన ప్రజల భాషలో జరిపితేనే అది ప్రజాస్వామ్య ప్రభుత్వం. అలా కానప్పుడు అది ప్రజా వ్యతిరేక ప్రభుత్వం అవుతుంది.

తేదీ : 30-12-2021

సామల రమేష్ బాబు

గారపాటి ఉమామహేశ్వరరావు
98661 28846

# సంపద సృష్టిలో జనభాషలు

**రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ మాతృభాషను విద్యామాధ్యమం నుంచి తొలగించి ఆ స్థానంలో ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టడం ఒక చారిత్రక తప్పిదం.**

**ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధన- అక్షరాస్యతకు అడ్డుగోడ**

1986 నుంచే ఇంగ్లీషు మాధ్యమం మొదలై అంచెలంచెలుగా తెలుగు మాధ్యమాన్ని కబళిస్తూ ఈ రోజుకు ఇలా పూర్తిగా మింగివేసే స్థాయికి చేరింది. తెలుగువారికి అందరికీ ఇది అంతులేని అవమానాన్నీ ఆక్రోశాన్నీ ఆవేదననూ మిగిల్చింది. అయితే అందరికీ అర్థం అవ్వాల్సింది ఒకటి ఉంది. దీనికి కావాల్సింది ప్రజా ఉద్యమం. దీనిగురించి మనందరికీ కనీస అవగాహన ఉండాలి. అందరికీ ఆ అవగాహన కలిగించాలి. ఏమిటి ఈ అవగాహన.

ఇంగ్లీషు మాధ్యమంతో మన ఉద్యోగ ఉపాధి సమస్య తీరదు. మాతృభాషా మాధ్యమం లక్షలాది మందికి ఉపాధి కలిగిస్తుంది. ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో మాతృ భాషా మాధ్యమమే నడుస్తోంది. ఆంగ్ల భాషా మాధ్యమంతో మనం మళ్ళీ బహుళజాతి సంస్థల అధికారం కిందికి తలవంచుకొని ఉండిపోయే పరిస్థితి కల్పిస్తుంది.

**మన కనీస కార్యాచరణ**

1. మనకు ఈ సమస్యపై కనీసం అవగాహన ఉండాలి.
2. ఉపాధ్యాయులకూ, విద్యార్థులకూ మాతృ భాషా మాధ్యమంపై అవగాహన కలిగించాలి.
3. ఉద్యోగస్తులకూ, తల్లిదండ్రులకూ తెలుగు మాధ్యమంలో చదువులు ఉండవలసిన అవసరాన్ని వివరించాలి.
4. ఇంగ్లీషు మాధ్యమంతో మన సమాజం నాశనం అవుతుంది అని తెలియజెప్పాలి.

ఎందుకంటే, కోట్లాది మందిగా ఉన్న భారతీయులకు ఇంగ్లీష్ ద్వారా వచ్చే వేలాది ఉద్యోగాలు ఏ మూలకూ సరిపోవు. ఇప్పటికీ లక్షలాదిమంది జనం భారతీయ భాషల ద్వారానే ఉపాధి పొందుతున్నారు. 2011-12 ఆర్థిక గణాంకాల ప్రకారం తెలుగు రాష్ట్రాల స్థూల జాతీయోత్పత్తి 4,64,184 కోట్ల రూపాయలు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ రాష్ట్రాలలో ఉన్న మొత్తం శ్రామిక శక్తి 1,07,77,950 మంది. వీరిలో అన్నిరకాల ఉద్యోగులూ, వ్యాపారులూ, రైతులూ, కూలీలూ ఉన్నారు. వీరందరూ 4,64,184 కోట్ల రూపాయల సంపదను సృష్టించారు. ఇంత సంపద సృష్టించినవారిలో 32.50% మంది నిరక్షరాస్యులే. ఇక మిగిలినవారిలో 52.02% మంది అక్షరాస్యులేగానీ ఇంటర్మీడియట్ దాటనివారు. ఇకపోతే, చివరకు మిగిలిన 15.48 శాతంమంది మాత్రమే గ్రాడ్యుయేట్లు. మన గ్రాడ్యుయేట్లందరికీ ఇంగ్లీష్ వచ్చనుకుంటే, కొద్దోగొప్పో తాము చేసే పనిలో ఇంగ్లీషును వాడి సంపద సృష్టించగలిగినవాళ్ళు 15 శాతం మాత్రమే. అంటే తెలుగు రాష్ట్రాలలో సంపదను సృష్టించేవారిలో 85% మంది తెలుగూ తదితర మాతృభాషల వాడకం ద్వారా జరుపుతున్నవారే. ఇంగ్లీషును ఒక భాషగా నేర్చుకోవడం వేరు దానిని విద్యామాధ్యమంగా అమలుపరచటంవేరు.

ఇంగ్లీషు మాధ్యమంతో దేశీయ స్థానిక భాషల ఆధారంగా నడిచే వందలాది పరిశ్రమలూ మూలబడతాయి. దాంతో లక్షలాది ఉద్యోగాలు పోయి కోట్లాదిమంది ఉపాధి కోల్పోతారు. ఒకటి రెండు తరాలలో తెలుగు రాయగలిగినవాళ్ళూ చదవగలిగినవాళ్ళూ మిగలరు. తెలుగు సినిమాలూ తెలుగు టీవీ చానెళ్ళూ ఉండవు. దేశంలోనే అత్యధిక సినిమాహాళ్లున్న రాష్ట్రాలుగా తెలుగు రాష్ట్రాలు ప్రసిద్ధి. పదిలక్షలకు పైగా జనానికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న సినీ పరిశ్రమ దాని అనుబంధ పరిశ్రమలూ మూలబడతాయి. తెలుగు రచనలూ ఉండవు రచయితలూ ఉండరు. లక్షల్లో ఉన్న తెలుగు రచయితలూ, గ్రంథకర్తలూ, పాత్రికేయులూ, కథకులూ, గేయరచయితలూ, గాయకులూ వీరిపై ఆధారపడ్డ తెలుగు పత్రికలూ తెలుగు ప్రచురణలూ ఇంకెక్కడ ఉంటాయి. లక్షలమందికి జీవనాధారమైన తెలుగు ముద్రణా పరిశ్రమ కుదేలవుతుంది. లక్షల్లో ఉన్న తెలుగు భాషాబోధకులూ ఉపాధ్యాయులూ ఇంగ్లీషు బోధకులుగా అవతరిస్తారా. అప్పుడు వేల యేండ్ల అస్థిత్వం గలిగిన తెలుగు ఎక్కడ ఉంటుందో తెలుగు చదవగలిగినవాళ్ళు ఎక్కడ ఉంటారో వెతుక్కోవాలి. ఈ పరిస్థితుల్లో మనం వేల యేండ్లుగా సృష్టించిన సాహిత్యం ఏమవుతుంది? ఎవరు చదువుతారు?

ఈ నేలమీద పుట్టిన ఏ మాత్రం తెలివిగలవాళ్ళైనా ఈ నేల తల్లి భాషలో చదువుకోవాలనే అనుకుంటారు. దాన్నే భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పారు. అందుకనే భారత రాజ్యాంగంలో భారతీయ భాషలకు ఒక అధికరణాన్నే ప్రత్యేకించారు. ఐనా అది కాదని పరాయి భాషను ప్రజలమీద రుద్దటం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయటమే. రాజ్యాంగ నిర్మాతలనూ వారు నిర్మించిన ప్రజాస్వామ్య వ్యవస్థలనూ పరిహసించటమే. ఈ నేలతల్లినీ కన్నతల్లినీ అవమానించడమే.

ఇంగ్లీషు మనకు ఒక సమస్య కావచ్చు. కానీ మాధ్యమం సమస్య కారాదు. ఇంగ్లీషు ఒక విషయంగా నేర్చుకోవద్దని ఎవరూ చెప్పటం లేదు. ఇంగ్లీషు కౌశలం పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలి. అదికూడా జరగక, ఇక మాధ్యమమే ఇంగ్లీషు అయితే ఏమవుతుందో ఆలోచించగలమా.

పోతే మనకు చదువుకోవటానికి ఈ నేలతల్లి భాష ఎందుకు పనికిరాదు అనే అడుగుతున్నాం. అర్థం కాని ఇంగ్లీషులో చెబుతున్న ఉపాధ్యాయులూ ఇంగ్లీషు అర్థం కాకుండా వింటున్న విద్యార్థులూ ఇలా ఎంతకాలం. ఇంకా ఎన్ని వందలూ వేల ఆత్మహత్యలు జరగాలి. మన పరిశోధనలు మన జన భాషలలో ఉండొద్దా?

పన్నెండు కోట్లమంది ఉన్న తెలుగువాళ్ళు వాళ్ళ భాషలో చదువుకొనకూడదా? ఇంగ్లీషులోనే చదివితే ఉద్యోగాలు వస్తాయనే ఈ తప్పుడు ఆలోచన మనలో ఎలా కలిగిందో కలిగింది. దీన్ని ఏ

తర్కంతో, ఏ హేతుబద్ధతతో సమర్థిస్తారు? దేశంలో ప్రతి ఏటా కోటిన్నర మంది గ్రాడ్యుయేట్లు తయారవుతున్నారు, ఇరవై లక్షలమంది ఇంజనీర్లు తయారవుతున్నారు. వీళ్ళల్లో ఇరవై శాతానికి కూడా ఉద్యోగాలు లేని పరిస్థితి. వీళ్ళు ఇంగ్లీషులో చదువుకున్నవాళ్ళే. నేటి రాజకీయనాయకులు ధనంతో అధికారాన్ని సంపాదించి మళ్ళీ అధికారంతో ధనం సంపాదించడం అనే అదే పనిలో మునిగిపోయారు. అంతేగానీ సంపద సృష్టికి మన వనరులతో పరిశ్రమల స్థాపనకూ వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికీ ఉద్యోగ ఉపాధి అవకాశాలకూ ఎలాంటి ప్రణాళికలూ లేవు. అన్నీ ఎన్నికల శుష్క వాగ్దానాలే.

మనకు కావలసిన ఉద్యోగాలు కోట్లలో, ప్రతిఏటా విదేశాల్లో మనకు వచ్చేవి వేలల్లో. మనకందరికీ ఉద్యోగాలు కావాలంటే ఇక్కడి వనరులతోనే సాధ్యం.

అందరికీ ఉద్యోగాలు కావాలి. అంతేగానీ ఏ కొద్దిమందికో విదేశాల్లో ఉద్యోగాలు వస్తే ఏం ప్రయోజనం. కార్పోరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో కూడా రిజర్వేషన్లను అమలు చేయమనండి. ప్రభుత్వ, ప్రభుత్వేతర విద్యాసంస్థల్లోనూ తెలుగూ ఇంగ్లీషు మాధ్యమాలను నడపాలి. అంతేగానీ ఇంగ్లీషు మాధ్యమాన్ని ఒక ఫ్యాషనుగా తీసుకుని రాకూడదు.

ఇది భాషా సమస్య. దీనికి సంబంధించిన శాస్త్ర విషయం తెలిసినవారు పరిష్కరించ వలసిన సమస్య. ఇది అధికారులూ, రాజకీయ నాయకులూ తీర్చగలిగిన సమస్య కాదు.

నిరుద్యోగ సమస్య రోజు రోజుకూ చక్రవడ్డీలా పెరుగుతోంది. గత రెండుమూడు దశాబ్దాలుగా ఐటీ, కంప్యూటరేతర కొత్త పరిశ్రమలు ఏవీ రాలేదు. ఇప్పుడు ఉన్నవీ వస్తున్నవీ అన్నీ ఉన్నవాటిలో కొద్దిగా పెరుగుతున్నవే. ఇంగ్లీషు మీడియంతో రెండు దశాబ్దాలలో ఇవి గూడా పోయే ప్రమాదం ఉంది.

ఇంగ్లీషు ఒక ఆధిపత్య భాషే. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నాడు చెప్పినవి నేటి ఈ రోజు పరిస్థితులకు సరిపడవా? ప్రజాస్వామ్యంలో జనభాషలు పనికి రావా? ఏ భాషా శాస్త్రజ్ఞుడు చెప్పాడు? మన భాషలు అభివృద్ధి చెందలేదా? పాతికేళ్ళకిందటే తెలుగు అకాడమీ గ్రాడ్యుయేట్ చదువులకు పాఠ్యగ్రంథాలు తెచ్చింది. తెలుగులో విజ్ఞాన శాస్త్రాలలో వందలాది రష్యా ప్రచురణలు వచ్చాయి. అవి చదువుకొని పాసైనవే గడిచిన రెండు తరాలు. ఈరోజు ఆధునిక సాంకేతిక భాషాశాస్త్రం ఎంతో అభివృద్ధిచెంది యంత్రానువాదం వాడుకలోకి వస్తున్న సమయంలో వేలాది ఏండ్ల వారసత్వంలో ఈ నేలతల్లి అమ్మ ఒడిలో నేర్చిన అమ్మ భాష చదువుకోడానికి పనికి రాదా! గతంలో వలస పాలన భౌతిక బలంతో సాగింది. ఇప్పుడు వలస పాలకుల ఆధిపత్యం ఆర్థిక బలంతో అధికారాన్ని సాగిస్తోంది. దీనికి భాషే ఆలంబన. ఇంగ్లీషు ఒక ప్రధాన ప్రాతిపదిక. ఇంగ్లీషుతో లక్షలాది స్థానిక ఉద్యోగ-ఉపాధి అవకాశాలు పోతాయి. ప్రపంచీకరణ అంటే ప్రపంచ వ్యాప్తంగా తయారైన ఉత్పత్తులను స్థానికభాషలలో అందించటం. ఎవరికి వచ్చిన భాషలో వారు రాస్తే ఎవరికి నచ్చిన భాషలో వారు చదువుకుంటారు. ప్రజాస్వామ్యంలో జనభాషలదే అధికారం. అ

## ఆంగ్ల మాధ్యమం బోధనతో
# భాషా సమస్య

- ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య పెరుగుతున్న అంతరం
- పాఠ్యప్రణాళిక రూపకల్పన, బోధన అమల్లో వ్యత్యాసం
- ఎన్‌సీఈఆర్టీ వార్షిక నివేదికలో వెల్లడి



ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధించాలన్న నిబంధన కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య భాషా సమస్య ఏర్పడుతోందని జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) 2019-20 వార్షిక నివేదికలో పేర్కొంది. 'ఈ కారణంగా ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను పిల్లలు అర్థం చేసుకోవడంలోనూ లోపం కనిపిస్తోంది. పిల్లలు, ఉపాధ్యాయుల మధ్య అంతరం పెరుగుతోంది' అని వెల్లడించింది. ఎన్‌సీఈఆర్టీ 2019-20 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశంలోని వివిధ ప్రాంతాల్లో పలు అంశాలపై చేసిన అధ్యయనాల ఫలితాలతో వార్షిక నివేదికను రూపొందించింది. ఈ పరిశోధనలో భాగంగా ఉపాధ్యాయులు సైన్సు పాఠ్యాంశాల బోధన, విషయ పరిజ్ఞానాన్ని ఎలా సమన్వయం చేసుకుంటున్నారో పరిశీలించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో అధ్యయనం నిర్వహించింది. మూడు జిల్లాల్లో 30 మంది ఉపాధ్యాయులతో (మిగతా 2లో)

(మొదటి పేజీ తరువాయి)

సమూహాలుగా ఎంపిక చేసుకుంది. బోధన సమయంలో వారు ఎలాంటి సవాళ్లను ఎదుర్కొంటున్నారో దగ్గర నుంచి పరిశీలించింది. [illegible]

### ఉపన్యాసాలుగా పాఠాల బోధన

- ఉపాధ్యాయులు ఉపన్యాస ధోరణిలో పాఠాలు చెబుతున్నారు. [illegible]
- [illegible]
- [illegible]
- [illegible]

[illegible]

- [illegible]

### పెరిగిన హాజరు శాతం

[illegible]

ఈనాడు 30-12-2021

పరిమి రామనరసింహం
9849316730

# మాతృభాషలు - విద్యాబోధన

**కొ**ద్ది గొప్ప తేడాలతో మన దేశంలో మాతృభాషల స్థితి ఒకేవిధంగా ఉంది. దీని గురించి వివరించటానికి రెండు అంశాలను పరిశీలించవలసి ఉంది. అవి: 1. భారతదేశంలో మాతృభాషల దుస్థితి లేదా క్షీణతకు కారణాలేమిటి? 2. మాతృభాషల పరిరక్షణకు ఏం చెయ్యాలి?

**1. భారతదేశంలో మాతృభాషల దుస్థితి లేదా క్షీణతకు కారణాలేమిటి?**

**మన దేశంలోని మాతృభాషల దుస్థితి లేదా క్షీణతకు మూడు కారణాలు చూపవచ్చు. అవి: అధికార భాషగా హిందీ; భాషాప్రయుక్త రాష్ట్రాలు; ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన.**

హిందీభాషా ఔత్సాహికులు చెప్పినంత కాకపోయినా హిందీని ఖడీబోలీగా గాని, కొంతవరకు ఉరుదుగా గాని ఈ దేశంలో (మెజారిటీ ప్రజలు కాదనుకోండి) చాలా మందే మాట్లాడతారు. అట్లా చాలామంది మాట్లాడే భాషను అధికార భాష చెయ్యటం వల్ల ఆ చాలామందికి ఆధిపత్య భావన, వారిలో కొందరికి ఇతర భాషల పట్ల చిన్నచూపు ఏర్పడే అవకాశం ఉంది. హిందీవారు ఆయా భాషాప్రాంతాలలో నివసిస్తూ కూడా ఆ భాషలను నేర్చుకోకపోవటం మొదటి నుంచీ ఈ దేశంలో చూస్తున్నాం. అదే విధంగా తక్కిన భాషలవారిలో కొందరికి హిందీ పట్ల వ్యతిరేకత, కొందరికి ఉదాసీనత, కొందరికి ఆత్మన్యూనతా భావం కాదనలేని నిజాలు. ఈ విధంగా ఈ దేశంలో హిందీ విషయంలో భాషాపరమైన సుహృద్భావం లోపించింది అని చెప్పవచ్చు. హిందీ వారు కూడా ఇతర భాషలను గౌరవించి వారి హృదయాలను గెలుచుకో లేకపోయారు. ప్రభుత్వం హిందీ సినిమాలను ఎక్కువగా ప్రోత్సహించి, వాటి ద్వారా హిందీని ఇతర భాషీయులలో కొంత వరకు పాపులర్ చేయగలిగింది, కాని ఆ అనుకూలతని హిందీ భాషీయుల అత్యుత్సాహ ధోరణులు, ఆధిపత్య ధోరణులు సొమ్ము చేసుకోనివ్వలేదు. హిందీ సినిమాలు కూడా సెన్సార్ బోర్డ్ వారి పక్షపాత ధోరణుల వల్లే దేశంలో పాపులర్ అయినై కాని, ప్రజలలో వాటి మీద ఇష్టం ఉండి కాదు. దీనికి రుజువు కావాలంటే 1950–60ల నాటి సినిమాలు గుర్తు చేసుకోవాలి. సెన్సార్ వారు హిందీ సినిమాలలో sex and violence ను ఎక్కువగా అనుమతించి, తెలుగు మొదలైన ఇతర భాషల సినిమాలలో అనుమతించకపోవటం వల్ల ఈ భాషలలో ప్రజలను ఆకర్షించటానికి నిర్మాతలు పౌరాణిక జానపద ఇతివృత్తాలతో ఎక్కువ సినిమాలు తీయవలసి వచ్చింది. ఆనాడు హిందీ సినిమాలకు మార్కెట్టు కూడా హిందీతర ప్రాంతాలలోనే. 1960లలోని తొలి సగంలో ఉత్తరప్రదేశ్ మొత్తంలో ఉన్న సినిమా హాళ్ళ కంటె ఒక్క విజయవాడలోని సినిమా హాళ్ళ సంఖ్య ఎక్కువ. యువతను ఆకర్షించే sex and violence కారణంగా ఆ కాలంలో యువత హిందీ సినిమాలు చూడకుండా ఉండలేకపోయారు అని చెప్పాలి.

హిందీ ఏ విధంగా మాతృభాషల క్షీణతకు కారణం అయింది? అధికార భాషగా హిందీ ఎంపికను సమర్థించటానికి దానికి లేని మెజారిటీని అంటగట్ట వలసి వచ్చింది. అందుకు నేడు హిందీ రాష్ట్రాలుగా చెప్పబడుతున్న రాష్ట్రాలలోని స్థానిక భాషలైన అవధి, బ్రజ, హర్యాన్వీ, బుందేల్ ఖండీ, గఢ్వాలీ, మొదలైన అనేక భాషలను హిందీ ఖాతాలో జమకట్టి, వాటికి పాఠశాలలో చోటు లేకుండా చేశారు. క్రమంగా ఆ భాషలు అంతరించి పోయే పరిస్థితి కల్పించారు. సుమారు 220కి పైగా భారతీయ భాషలు కనుమరుగైనై అని ఐక్యరాజ్య సమితి చెప్పింది అని జాతీయ విద్యావిధాన పత్రంలో చెప్పుకున్నారు. వాటిలోని చాలా భాషలు హిందీ ఆధిపత్య సాధన ప్రక్రియలో ఆత్మార్పణం చేసుకున్నవే. హిందీకి మెజారిటీ చూపటానికి ఆ నాడు హిందీలో జమకట్టిన ఎన్నో భాషలకు తర్వాతి కాలంలో కేంద్ర సాహిత్య అకాడెమీ గుర్తింపు ఇచ్చింది. ప్రభుత్వం రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యూల్ లోకూడా చేర్చింది; మరికొన్ని ఇప్పుడు చేరబోతున్నై. (రాజస్థాని ... ) ఇతర రాష్ట్రాలలో పనిచేస్తున్న కేంద్రప్రభుత్వ ఉద్యోగుల పిల్లల చదువులో వారి మాతృభాషకు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా వారిని హిందీ భాషీయులుగా మార్చివేయటం జరుగుతున్నది. లోగడ కొన్ని చోట్ల బి.కామ్.లో రెండవ భాషగా హిందీని నిర్బంధం చేసి ఆ విద్యార్థులకు తమ మాతృభాషలో తగినంత ప్రావీణ్యాన్ని పొందలేని పరిస్థితి కల్పించటం జరిగింది. దూరదర్శన్ వచ్చిన తొలి దశలో చాలా సంవత్సరాల పాటు హిందీ కార్యక్రమాలకు పెద్దపీట వేసి, తెలుగు వంటి భాషలకు చాలా తక్కువ సమయం కేటాయించారు. ఆ సమయంలో కూడా చవకబారు కార్యక్రమాలతో మన తెలుగు కార్యక్రమాలు బాగుండవు; హిందీ కార్యక్రమాలే బాగుంటై అని తెలుగువారే అనుకునేట్లు చేశారు. ఉదాహరణకు, ఢిల్లీ నించి దూరదర్శన్‌లో రామానంద సాగర్ రామాయణాన్ని ప్రసారం చేస్తూ అదే సమయంలో హైదరాబాదు టివిలో పిల్లలతో తీసిన ఒక చవకబారు రామాయణం కార్యక్రమాన్ని సీరియల్‌గా ప్రసారం చేశారు. **అధికార భాష మాత్రమే అయిన హిందీని జాతీయ భాషగాను, "languages of the Union shall be" అని చెప్పబడిన తెలుగు వంటి భాషలను ప్రాంతీయ భాషలుగానూ ప్రజలకు తలకు అంటే విధంగా ప్రచారం చేశారు. ఈ విధంగా హిందీ సినిమానూ, టివిని, మీడియాను, సంస్కృతిని 'జాతీయ' అనే విశేషణం తోనూ, తక్కినవాటిని ప్రాంతీయ అనే విశేషణంతోనూ స్థిరపరచారు.** హిందీని పాపులర్ చెయ్యమనే సూచన రాజ్యాంగంలో ఉన్న మాట నిజమే. కాని అందుకు ప్రభుత్వాలలోని హిందీ ఔత్సాహికులు అనుసరించిన పద్ధతులు హిందీయేతర

ప్రజలలో కొంతమందిలో హిందీ వ్యతిరేకతను, కొంతమందిలో తమ మాతృభాషా సంస్కృతుల పట్ల ఉదాసీనతను లేదా తక్కువ భావనను కలిగించేందుకే తోడ్పడినై.

ఇక భాషాప్రయుక్త రాష్ట్రాల విషయానికి వస్తే, ఈ ప్రక్రియ కొన్ని ప్రధాన భాషలకు, ఎన్నో చిన్నచిన్న భాషలకూ నష్టాన్ని కలిగించింది. కేంద్ర ప్రభుత్వాలలోని విధాన నిర్ణేతలకు హిందీ మీదనే శ్రద్ధ ఉండటం, తక్కిన భారతీయ భాషల మీద ఉండవలసినంత శ్రద్ధ లేకపోవటం దీనికి కారణం.

భాషాప్రయుక్త రాష్ట్రాల వల్ల అధికంగా నష్టపోయిన భాష తెలుగు. అప్పట్లో తెలుగు దక్షిణాది అంతటా వ్యాపించిన భాష – తమిళనాడులో తెలుగు మాట్లాడే కుటుంబం ఒక్కటైనా లేని గ్రామం ఒక్కటి కూడా లేని పరిస్థితి నుంచి ఇప్పుడు తెలుగు వినిపించని పరిస్థితికి దిగజారింది. త్యాగరాజు పుణ్యమా అని కర్నాటక సంగీత సభలలో తప్ప. ఆంగ్లేయులు కూడా అప్పటి నాణేలమీద తెలుగు, బెంగాలీ, ఉరుదు, నాగరి లిపులలో వాటి విలువను ముద్రించారు. ఇంతటి ప్రాచుర్యం కల తెలుగు భాష తమిళనాడు, కర్నాటక, ఒరిస్సా, మహారాష్ట్రలలో తన ఉనికిని కోల్పోయింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తెలుగు, తమిళం, కన్నడం, మరాఠీలకు సమాన గౌరవం ఉండేది. ఎవరి భాషను వారు తలెత్తుకొని దర్జాగా మాట్లాడేవారు; నేడు ఆ పరిస్థితి లేదు. దీనికి కారణం: మాది తమిళనాడు; మా రాష్ట్రం తమిళ రాష్ట్రం అనే భావన. ఆంధ్ర రాష్ట్రం విడిపోగా అప్పటి మిగిలిన మద్రాసు రాష్ట్రంలో తెలుగువారు 40 శాతం. కర్నాటకలో తెలుగువారు 30 శాతం. అప్పుడు తెలుగు పరిస్థితి గౌరవప్రదంగానే ఉండేది; క్రమంగా అది క్షీణించింది. అంత శాతం ప్రజలు ఉండి కూడా పాఠశాలలలో ప్రభుత్వాల కుయుక్తుల వల్ల తెలుగు తరగతులు మూత పడ్డై. పదవ తరగతిలో తెలుగు ఉంటుంది; కింది తరగతులలో ఉండదు; ఉన్నా ఉపాధ్యాయులు ఉండరు. ఇటువంటి పరిస్థితులు ఏర్పడటానికి కారణం భాషాప్రయుక్త రాష్ట్రాలు.

**భారతదేశంలో మాతృభాషల దుస్థితికి మూడవ కారణం ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన. ఇక్కడ ప్రధానంగా గుర్తించ వలసిన అంశం ఏమిటంటే ఆంగ్ల మాధ్యమమే మాతృభాషల దుస్థితికి కారణం కాని, ఆంగ్లభాష కాదు.** ఆంగ్లం భారతీయ భాషల ఎదుగుదలకు అడ్డంకి; దాన్ని వదిలెయ్యాలి అని హిందీ ఔత్సాహికులు వాదిస్తారు. ఎందుకంటే అంగ్లం పోతే ఆ స్థానాన్ని హిందీ ఆక్రమించటం సులభం అని. ఒక సబ్జెక్టుగా ఆంగ్లం అందరూ నేర్చుకోవాలి; బాగా నేర్చుకోవాలి. బాహ్య ప్రపంచంతో అనుసంధానం కావటానికి ఆంగ్లం ఎంత అవసరమో ఎంతో మంది ఎంతో చెప్పారు. దాన్ని ఇక్కడ నేను మళ్ళీమళ్ళీ చెప్పదలచుకోటం లేదు.

ఆంగ్లమాధ్యమం వల్ల మాతృభాష ఒక సబ్జెక్టు స్థాయికి దిగజారుతుంది. విద్యార్థులు మాతృభాషలో ఒక విషయం మీద సాధికారంగా మాట్లాడే శక్తి సంపాదించుకో లేరు. ఒక తరం గడిచే సరికి ప్రజలలో ఏ సామాన్య విషయం మీద కూడా మాతృభాషలో అభివ్యక్తి చేసే శక్తి శూన్యం అవుతుంది. ఒక సబ్జెక్టుగా చదివే మాతృభాషలోని సాహిత్యపు పాలు కూడా అంతంత మాత్రం కావటంతో మాతృభాషలో సృజన శక్తి బలహీన పడి ఒకటి రెండు తరాల తర్వాత పూర్తిగా లోపిస్తుంది. అటువంటి పరిస్థితిలో ఒక సందర్భంలో ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు అన్నట్లుగా మాతృభాషలో కవిత్వం గాని, ఒక కథ గాని, ఒక నవల గాని రాయ గలవారు కనిపించరు. ఆయనే అన్నట్లుగా అది ఆ భాషకు అంతిమ కాలాన్ని దగ్గరపరుస్తుంది. భాషను కోల్పోయిన జాతి తన సంస్కృతి మూలాల నుండి విడిపడిపోతుంది. చివరికి తన అస్తిత్వాన్ని కోల్పోతుంది. కనుక ఈ అంశాలన్నీ మాతృభాషా మాధ్యమంలో విద్యాబోధన యొక్క ఆవశ్యకతను బలపరుస్తున్నై. మాధ్యమం ఏదైతే నేం సాహిత్యాన్ని ఒక విషయంగా చదివే విద్యార్థులు కొందరు ఉంటారు కదా! వారి వల్ల ఆ భాషలో సాహిత్య సృష్టి జరగదా? అని మనం ప్రశ్నించవచ్చు. కాని, తక్కిన విషయాలలో పరిజ్ఞానం చాలినంత లేకుండా కేవలం సాహిత్య అధ్యయనంతో సృజనాత్మకత పెంపొందదు. శ్రీశ్రీ వంటి మహాకవులు తమ విద్యాకాలంలో సాహిత్య విద్యార్థులు కారు. అసలు, సృజన అనేది కేవలం సాహిత్యానికే కాదు సైన్సుకు కూడా అవసరమే. సృజన వల్లనే సైన్సు నుండి టెక్నాలజీ పుడుతుంది. ఇక్కడ **ఆంగ్ల మాధ్యమం మాతృభాషలకు హానికరం అంటున్నది కేవలం హైస్కూలు స్థాయిలో మాత్రమే కాదు, యూనివర్సిటీ స్థాయిలో కూడా. అన్ని స్థాయిలలోనూ మాతృభాషా మాధ్యమంలో చదివినవారే సృజన శిఖరాలను అధిరోహించ గలుగుతారు.**

**2. మాతృభాషల పరిరక్షణకు ఏం చెయ్యాలి?**

దీనికి ఒకటే సమాధానం: అన్ని విషయాలనూ మాతృభాషలోనే అధ్యయనం చెయ్యాలి. అట్లా ఒకటి రెండు తరాలు గడిచే సరికి మాతృభాష స్థిరంగా నిలిచిపోతుంది; అభివృద్ధి చెందుతుంది. కాని ఈ దేశంలో అది అంత సులభం కాదు. అందులో పరిగణనలోకి తీసుకోవలసిన అంశాలు చాలా ఉన్నాయి. ఇప్పుడు తెలుగు మన మాతృభాష. అధ్యయనం అంతా తెలుగులోనే జరగాలి అంటే అది ఏ తెలుగు? ఇంటి భాషా? ఊరి భాషా? ఒక సామాజిక వర్గపు భాషా? ఒక ప్రాంతపు భాషా? ఇవి అన్నీనా? వీటికి సమాధానం చెప్పటానికి కొన్ని విషయాల వివరణ అవసరం. అవి: భాష; భాషలో వైవిధ్యం; ప్రమాణ భాష; ఏ స్థాయిలో ఏ రకమైన భాష వాడాలి? అనేవి. వీటిని స్థూలంగా తెలుగుకు అన్వయించి చెప్పుకుందాం.

### భాష – భాషలోని వైవిధ్యం

అసామాన్యుల నుంచి సామాన్యుల వరకు అందరికీ అతి పరిచయమైన, అందుబాటులో ఉన్న భావ ప్రకటనా వ్యవస్థ భాష. ఆ విధంగా అది అందరి నోళ్ళల్లో నానుతూ ఉంటుంది. దాన్ని ఎంతమంది మాట్లాడ్తారో అన్ని రకాల వైవిధ్యాన్ని కలిగి ఉంటుంది. కనుక ఒక భాషలోని వైవిధ్యాన్ని ఎప్పటికప్పుడు బేరీజు వేసుకోవలసిన అవసరం ఉంది. అట్లా ఎందుకు అంటున్నానంటే భాషా సమాజాలలో ఒక పక్క తమతమ భాషల పట్ల స్పృహ పెరుగుతున్నప్పటికీ, మరొక పక్క ప్రపంచీకరణ ప్రభావం వల్ల మాతృభాషలు నిర్లక్ష్యానికి గురికావటం చూస్తున్నాం. తెలుగు వంటి భాషలు ఈ పరిస్థితిని

ఎదుర్కొని నిలవాలంటే ఇతోధికంగా పరిపుష్టిని సాధించి అభివృద్ధి చెందవలసిన అవసరం ఉంది. పరిపుష్టి సాధన కొరకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉన్న వనరులను బేరీజు వేసుకోవలసి ఉంటుంది. ఒక భాషలోని వైవిధ్యాన్ని బేరీజు వేయటం ద్వారా ఆ భాషలోని వనరులను అంచనా వేయటం సాధ్యం అవుతుంది.

ఒక భాషలో ఎంతమంది వ్యవహర్తలుంటారో అంత వైవిధ్యం ఉంటుంది అని ఇంతకు ముందు చెప్పుకున్న మాట సిద్ధాంత పరంగా సరి అయినదే. కాని ఆ వైవిధ్యం – ప్రాంతాలను బట్టి ఉండే వైవిధ్యం లాగా – సాధారణ పరిశీలనకు అందేది కాదు. కనుక భాషలోని వైవిధ్యాన్ని ప్రాంతాలను బట్టి, వృత్తి–సమాజాలను బట్టి పరిశీలించవలసి ఉంటుంది. సాధారణంగా ఒక భాష ఏర్పడ్డ ఆదికాలంలో వైవిధ్యం ఉండటానికి వీలులేదు. గుర్తించదగిన వైవిధ్యం లేని ఏకరూపతే ఆదిమ కాలపు భాషాలక్షణంగా చెప్పుకోవచ్చు. ఆ భాషాసామాజికులు ఇతర ప్రాంతాలకు విస్తరించిన తర్వాతనే భాషలలో వైవిధ్యం చోటు చేసుకొని క్రమక్రమంగా పెరగటం జరుగుతుంది. అట్లా పెరిగిన వైవిధ్యం రెండు ప్రాంతాలవారి మధ్య పరస్పర అవగాహన క్షమత్వానికి భంగకరం కానంతవరకు అది ఆ భాషకు లోబడే ఉంటుంది. అట్లాకాక, పరస్పర అవగాహన క్షమత్వానికి భంగం కలిగినప్పుడు ఆ రెండు ప్రాంతాల వారి భాషణపు అలవాట్లు రెండు వేరువేరు భాషలుగా గుర్తించబడతై. కాని, సంవాద (communication) సౌకర్యాల అభివృద్ధి కారణంగా నేటి ఆధునిక యుగంలో ఒక భాష రెండు భాషలుగా విడిపడిపోవటానికి అవకాశాలు లేవనే చెప్పాలి.

**భాషలోని వైవిధ్యం ఎన్ని రకాలుగా ఉండవచ్చు?**

ఒక భాషలోని వైవిధ్యానికి గల కారణాలను బట్టి ఆ వైవిధ్యం అన్ని రకాలుగా ఉంటుంది అని చెప్పవచ్చు. వ్యక్తి, వృత్తి, ప్రాంతం, విషయం, సాహిత్యం కారణాలుగా భాషలలో వైవిధ్యాలు ఏర్పడతై. ఇందులో వ్యక్తి కారణంగా ఏర్పడే వైవిధ్యాలను భాషాశాస్త్రంలో వైయక్తికాలు (idiolects) అంటారు. వృత్తి వల్ల, ప్రాంతం వల్ల ఏర్పడే వైవిధ్యాలను మాండలికాలు (dialects) అంటారు. మాండలికాలలో వృత్తి కారణంగా ఏర్పడేవి వృత్తి మాండలికాలు, ప్రాంతం కారణంగా ఏర్పడేవి ప్రాంత మాండలికాలు. విషయం కారణంగా గుర్తించదగిన భాషాలక్షణ వైవిధ్యాలు వైషయికాలు (registers). సాహిత్యపరమైన వైవిధ్యాలు శైలీభేదాలు.

ఒక్కొక్క వ్యక్తి యొక్క భాషణపు అలవాట్లలోని భేదాలవల్ల కలిగే వైవిధ్యాలు అనదగిన వైయక్తికాలను గుర్తించటం కష్టమే. అవి అతి సూక్ష్మమైనవి కావటంవల్ల వాటిని మాండలికాల అధ్యయనంలో భాగంగా గ్రహించటం చాలా వరకు అంగీకార యోగ్యం అవుతున్నది. వ్యక్తుల అనుభవాలు కూడా భాషావైవిధ్యాలకు కారణం అవుతై. పిల్లలకు ఉండే జీవితానుభవం వేరు, పెద్దలకు ఉండే జీవితానుభవం వేరు; అదే విధంగా స్త్రీల జీవితానుభవం, పురుషుల జీవితానుభవం వేరువేరుగా ఉంటుంది. ఆ విధంగా ఒక భాష పిల్లలలోను, పెద్దలలోను, స్త్రీలలోను, పురుషులలోను కొన్ని వేరువేరు లక్షణాలు కలిగి ఉంటుంది. ఈ అంశం మీద ఎక్కువగా కృషి జరగలేదు. అది జరగవలసిన అవసరం ఉంది. ఆర్థిక స్థితిగతులు కూడా భాషలోని వైవిధ్యానికి కారణం కావచ్చు. వాటిని సాధారణంగా వృత్తి మాండలికాలలో భాగంగా పరిశీలించటం జరుగుతున్నది. వీటన్నిటినీ vertical variations అనీ, ప్రాంత మాండలికాలను horizontal variations అని వ్యవహరించటం కూడా ఉంది. తెలుగులో ఇటువంటి సూక్ష్మ పరిశీలనలు చేపట్టవలసిన అవసరం ఉంది. ఇంతకు ముందు సాహిత్య అకాడెమీ, తెలుగు అకాడెమీలు వృత్తి మాండలికాల మీద, ప్రాంత మాండలికాల మీద విలువైన అధ్యయనాలను వెలువరించినై. అయినప్పటికీ ఆ అధ్యయనాలు జరిగి చాలా కాలం గతించింది కనుక వాటి అధ్యయనం మరింత సూక్ష్మ స్థాయిలో మళ్ళీ చేపట్ట వలసిన అవసరం ఉంది.

ఇంతవరకు చెప్పుకున్న భాషా వైవిధ్య కారకాలు సామాజిక మైనవి. తక్కిన రెండింటిలోను 'వైషయికాలు' (registers) విద్యారంగానికి చెందినవి. ఆయా విషయాల (subjects) బోధనలో వాటిని గుర్తించి వినియోగించటం వల్ల ప్రయోజన కరంగా ఉంటుంది. ఇక శైలీ భేదాలు సాహిత్యంలో కనిపిస్తై. శైలీభేదాల అధ్యయనం వల్ల అవగాహన, ఆస్వాదన, సాహిత్య బోధన సులభతరం అవుతుంది. ఆయా భావాల అభివ్యక్తిలో భాష యొక్క సామర్థ్యం, ఆ కవి లేదా రచయిత యొక్క సృజన శక్తి మూల్యాంకనం చేయటానికి వీలు అవుతుంది.

తెలుగు ఇప్పుడు రెండు రాష్ట్రాలలో ముఖ్యభాషగా ఉన్నప్పటికీ, దక్షిణాది లోని ఇతర రాష్ట్రాలలో కూడా తెలుగువారు అధిక సంఖ్యలోనే ఉన్నారు. ఉత్తరపు సరిహద్దు రాష్ట్రాలలోకూడా చెప్పుకో దగిన సంఖ్యలో తెలుగువారు ఉన్నారు. వారందరూ తరతరాలుగా అక్కడ నివసిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న ఆధునికపు నాగరక యుగంలో విద్య–పాలన–సమూహ సంవాదం (education - administration - mass communication) అనే రంగాలలో భాషావినియోగం ఆధునికతకు, అభివృద్ధికి చిహ్నం. ఈ రంగాలలో భాషను సమర్థంగా వినియోగించాలంటే ఆ భాష అభివృద్ధి చెంది ఉండాలి. అందుకు భాషలోని పద వనరులను అన్నిటిని సేకరించి ఒక బృహన్నిఘంటువును, ఆయా రంగాలకు చెందిన వైషయిక పద కోశాలను నిర్మించవలసిన అవసరం ఉంది. అభివృద్ధి చెందిన ఇతర భాషల లోనించి ఆయా విషయాలకు సంబంధించిన గ్రంథాలను అనువాదం చేసుకోవలసిన అవసరం ఉంది. అందుకు అనువాద నిఘంటువులను కూడా నిర్మించుకోవలసిన అవసరం ఉంది. కేవలం శాస్త్రసాంకేతిక రంగాలలో సాధించే అభివృద్ధి సమాజపు సమగ్ర అభివృద్ధి సాధనకు సరిపోదు. మానవీయ శాస్త్ర రంగాలలోనూ, ముఖ్యంగా సాహిత్య రంగంలోనూ అభివృద్ధి సాధించి సమాజంలోని వ్యక్తులలో మానవీయ విలువలను పెంపొందించ వలసిన అవసరం ఉంది. అందుకు మానవీయ శాస్త్ర గ్రంథాలను, ముఖ్యంగా సాహిత్య గ్రంథాలను మన భాషలోకి, మన భాషలోనించి ఇతర భాషలలోకి అనువదించుకో వలసిన అవసరం ఉంది. అందుకు సాహిత్య అధ్యయనాన్ని మరింతగా ప్రోత్సహించవలసి ఉంటుంది. సాహిత్య అధ్యయనం సులభతరం, అర్థ వంతం చేయటానికి – సాహిత్యం

మానవతా విలువలను పెంపొందించటంతో బాటుగా, సామాజిక పురోగతికి మార్గదర్శనంగా కూడా ఉంటుంది కనుక సామాజిక శాస్త్రాల అధ్యయనం, సాహిత్య శాస్త్ర శైలీ శాస్త్రాల అధ్యయనం కూడా అవసరం అవుతుంది.

వీటన్నిటినీ అర్థవంతంగా నిర్వహించాలంటే భాషలోని అన్ని వైవిధ్యాలనూ సమగ్రంగా అధ్యయనం చేయవలసి ఉంటుంది.

**భాషలోని వైవిధ్యాలు – ఏక రూపత ప్రాధాన్యం**

భాష నిత్య పరిణామ శీలి అనే విషయం ఇప్పుడు కొత్తగా చెప్ప నక్కర లేదు. ఈ లక్షణం వల్లనే భాషలో వైవిధ్యం బహుముఖీనంగా ఉంటుంది. అయితే భాషకు గల సహజ వినియోగానికి ఈ వైవిధ్యం ఎటువంటి ఇబ్బందులనూ కలిగించదు. మానవ సమాజాలు సాధించిన సంస్కృతి కారణంగా భాషకు అసహజ వినియోగం ఏర్పడుతుంది. జంతు దశ నుండి మానవుడు పరిణామం చెందిన క్రమంలో వాక్సంకేతాలతో భావ వ్యక్తీకరణ చేసే సాధనంగా భాష ఏర్పడింది. సంఘజీవిగా అవతరించిన మానవుడు తోటి మానవులతో సహకరించుకోటానికి అవసరం అయిన సంవాద సాధనంగా భాష పనిచేయటం మొదలుపెట్టింది. ఒక గుంపులోని సభ్యులు పరస్పరం సహకరించుకోటానికి ఒకరి అభిప్రాయాలనూ భావాలనూ మరొకరికి తెలపటం, ఇతరుల అభిప్రాయాలకు స్పందించటం అవసరం. ఇది మాత్రమే భాషకు గల సహజ వినియోగం. మానవుడు ప్రకృతి జీవనం నుండి విడిపడి సంస్కృతిని అలవరచుకున్నాడు. సంస్కృతి అంటే మార్పు. అంటే సహజంగా ఉన్నదాన్ని మార్చుకోటం. ఉదాహరణకు, ఆహారం తీసుకోటం సహజమే; దాన్ని తయారు చేసుకొని తినటం మార్పు. అదే సంస్కృతి. ఆహారం తయారు చేసుకోటం, వ్యవసాయం, వస్త్రధారణ, వస్తూత్పత్తి, ప్రభుత్వం – పరిపాలన, సాహిత్యం, సంగీతం, కళలు, ఉపన్యాసాలు, రచనలు, శాస్త్ర సాంకేతిక విద్యల అభివృద్ధి, వాటిని బోధించటం, మొదలైనవి. వీటన్నిటిలోనూ భాష తప్పనిసరి. ఈ క్రమంలో భాషకు గల స్థల–కాల పరిమితులను అధిగమించటానికి లిపి కనిపెట్టటం జరిగింది. తద్వారా భాషను మాటల రూపంలోనే కాకుండా రాత రూపంలో వాడుక చేయటం మొదలైంది. ఇది అంతా భాషకు అసహజ వినియోగమే. ఇక్కడ అసహజం అనే మాటను అదొక 'దోషం'గానో కూడనిది గానో పరిగణించ వలసిన పని లేదు. ఇది మానవ పరిణామ క్రమంలో భాగమే. సహజం కానిది అని చెప్పటమే ఇక్కడ ఉద్దేశం. ఈ విధంగా ఏర్పడిన అసహజ వినియోగం కారణంగా ప్రత్యేక సందర్భాలలో భాషించటమే కాకుండా ప్రత్యేక పద్ధతులలో రాయటం ఎక్కువ అయింది. రాసే విషయాన్ని – అది సాహిత్యం కానివ్వండి, శాస్త్ర విషయం కానివ్వండి, పాలనాంశం (administrative matter) కానివ్వండి పలు ప్రాంతాలకు, పలు కాలాలకు అందే విధంగా రాయ వలసిన అవసరం ఏర్పడింది. భాషలోని స్థానిక, వైయక్తిక వైవిధ్యాలను అధిగమించి ఒక ప్రామాణిక రూపాన్ని భాషకు సమకూర్చ వలసిన అవసరం ఏర్పడింది. రాత వల్లనే ప్రామాణిక భాష యొక్క అవసరం ఏర్పడుతున్నది. భాషను కేవలం వాగ్రూపంలోనే వాడుతుంటే ప్రామాణిక భాష అవసరం ఉండేది కాదు. ఇక్కడ 'ప్రామాణిక' అనే పదాన్ని 'అదేదోగొప్పది' అనే అనవసరపు విలువను జోడించి అర్థం చేసుకోకూడదు. కేవలం 'అందరికీ వర్తించే ఒకే రూపం కలిగినది' అని మాత్రమే గ్రహించాలి. అణాలు పైసలు, తులాలు వీసెలూ, సోలలూ మానికలూ, మైళ్ళు ఫర్లాంగులు, అడుగులు గజాలు వదిలేసి మెట్రిక్ మానాలను ప్రవేశపెట్టినట్లుగా అన్నమాట.

ప్రాచీన కాలంలో ఇటువంటి పరిస్థితులలోనే ఏర్పడిన భాష సంస్కృతం. మధ్య యుగాలలో తెలుగులో ఏర్పడిన భాషావిశేషమే కావ్యభాష లేదా గ్రాంథికభాష. ఆధునిక యుగంలో భాషాశాస్త్రవేత్తలు ప్రతిపాదించే రూపమే ప్రామాణిక భాష. దాని లక్షణం అన్ని మాండలికాల నుంచి నైఘంటిక రూపాలను (= నామ ప్రాతిపదికలను, క్రియా ధాతువులను, విశేషణ–క్రియావిశేషణ రూపాలను) గ్రహించి సంయోజన–నిష్పన్న ప్రక్రియల వల్ల ఏర్పడే (= ప్రకృతి–ప్రత్యయాల కలయిక వల్ల ఏర్పడే) సాధ్య రూపాలలో ఏక రూపత. ప్రామాణిక భాషా లక్షణాన్ని మరొక విధంగా చెప్పాలంటే సిద్ధ రూపాలలో వైవిధ్యం, సాధ్య రూపాలలో ఏక రూపత. సిద్ధరూపాలను అన్ని మాండలికాల నుంచి గ్రహించాలి; సాధ్య రూపాలను విద్యావంతులలో బహుళవ్యాప్తి ప్రమాణంగానూ, ప్రామాణిక సాహిత్యంలో పాతుకుపోయిన రూపాలకు దగ్గరగా ఉండే విధంగానూ రూపొందించుకోవాలి. అది ఏ ఒక్క ప్రాంతానికో పరిమితమైనది అనే భావన కలిగించకుండా ఉండటం మిక్కిలి అభిలషణీయం. అట్లా ఏ ఒక్క ప్రాంతానికో పరిమితమైనది అనే భావన కలిగేవిధంగా ఉంటే తక్కిన ప్రాంతాలవారిలో తొలి దశలో తమ భాష సరి అయినది కాదేమో ననే ఆత్మన్యూనతా భావం ఏర్పడటం, మలి దశలో అట్టి ప్రామాణిక భాష మీద మన్నన తగ్గిపోవటం అనే వ్యతిరేక పరిస్థితులు తలెత్తుతై. ప్రస్తుతం ప్రామాణిక తెలుగు విషయంలో అదే జరిగింది.

ప్రాచీన భాషావిషయంలో అన్ని మాండలికాలనూ కావ్యభాషలోకి గ్రహించవచ్చు అని వ్యాకరణాలు నిర్దేశించినై – మాదలికాలు అనే ప్రస్తావన లేకుండానే. "త్రిలింగ దేశ వ్యవహార సిద్ధంబగు భాష దేశ్యంబు" అని చెప్పి దేశ్యానికి – అంటే మాండలిక వ్యవహారానికి – కావ్య భాషా గౌరవాన్ని సమకూర్చినై. కేవలం లక్షణం చెప్పవలసిన 'సాధ్యరూపాలను' మాత్రమే వ్యాకరణంలో చెప్పినట్లుగా వాడాలి అనే ఉద్దేశంతో "లక్షణ విరుద్ధంబగు భాష గ్రామ్యంబు" అని, దాన్ని కావ్యాలలో వాడకూడదు అని చెప్పి, లక్షణ విరుద్ధమైన రూపాలను కూడా పెద్దవాళ్ళు (ఆర్యులు, గొప్ప కవులు) వాడినవాటిని 'అనింద్య గ్రామ్యాలు'గా పరిగణించ వచ్చు; వాటిని గ్రహించవచ్చు అని కూడా వెసులుబాటును కల్పించినై. కనుక భాషలోని వైవిధ్యాల అధ్యయనం ఏక రూపకమైన ఒక ప్రామాణిక భాషను పరిపుష్టం చేయటానికే.

**ప్రాదేశిక ప్రమాణ భాషలు**

తెలుగు వంటి పలు ప్రాంతాలకు, పలు రాష్ట్రాలకు వ్యాపించి ఉన్న భాష అందునా వ్యవహర్తల విద్యాస్థాయి తక్కువకావటం వల్ల మాండలిక వైవిధ్యం అధికంగా ఉన్నభాష ఒకే ఒక ప్రామాణిక రూపంతో మనుగడ సాగించలేదు. కనుక మూడు గాని నాలుగు గాని ప్రాదేశిక ప్రమాణ భాషలకు అవకాశం కల్పించవచ్చు.

ఒక భాషకు రెండు మూడు ప్రమాణ భాషలు ఉండటం, లేదా ఒకే భాష రెండు మూడు పేర్లతో చలామణి కావటం కొత్త ఏమీ కాదు. భౌగోళిక దూరస్థితి, రాజకీయ కారణాలు, విస్తృత వ్యాప్తి - వైవిధ్య బాహుళ్యం : ఈ మూడు కారణాల వల్ల ఒక భాష అనేక ప్రాంతాలలో వేరువేరు పేర్లను కలిగి ఉండవచ్చు; లేదా ఒకే పేరుతో వేరువేరు ప్రామాణిక రూపాలను కలిగి ఉండవచ్చు.

భౌగోళిక దూరస్థితి వల్ల వేరువేరు ప్రామాణిక రూపాలు కలిగిన భాషకు ఇంగ్లీషును ఉదాహరణగా చెప్పుకోవచ్చు. బ్రిటిష్ ఇంగ్లీషు, అమెరికన్ ఇంగ్లీషు, కెనడియన్ ఇంగ్లీషు, ఆస్ట్రేలియన్ ఇంగ్లీషు అని ఇంగ్లీషు భాష పలు ప్రామాణిక రూపాలను కలిగి ఉండటం మనం ఎరిగినదే. ఇండియన్ ఇంగ్లీషు కూడా ప్రామాణిక హోదాకు పోటీ పడుతున్నది. భౌగోళిక దూరస్థితి వల్ల ఒకే భాషకు రెండు పేర్లు ఉండటం కూడా చూడవచ్చు. అవి ఉరుదు, దక్షిని. ఈ రెండూ కొన్ని మాండలిక భేదాలతో ఒకే భాష. కాని ఉత్తరాదిలో ఉరుదు అని, దక్షిణాదిలో దక్షిని అనే రెండు పేర్లతో చలామణి అవుతున్నది.

రాజకీయ కారణాల వల్ల ఒకే భాషకు రెండు పేర్లు ఉండటం కూడా మన దేశంలోనే చూడవచ్చు. లక్షణపరంగానూ, వ్యాకరణ పరంగానూ ఉరుదు, హిందీ అనేవి రెండూ ఒకే భాష. కేవలం సంస్కృతసమాలు ఎక్కువ ఉండటం, దేవనాగరి లిపిని వాడటం హిందీ ప్రత్యేకతలు అయితే, అరబిక్ లిపిని వాడటం, పర్షియో అరబిక్ పదాలు ఎక్కువగా వాడటం ఉరుదు ప్రత్యేకతలు. నిజానికి లక్నో వంటి ఉత్తరభారత నగరాలలోని బజార్లలో మాట్లాడే హిందీ-ఉరుదు భాషలలో సంస్కృత పద బాహుళ్యం, పర్షియో అరబిక్ పద బాహుళ్యం అనే భేదం కూడా కనిపించదు. ఈ భేదం తటస్థం (neutralize) అయిపోయి రెండూ ఒకే విధంగా కనిపిస్తై. ఒక మతం వారు మాట్లాడితే ఉరుదు; మరొక మతంవారు మాట్లాడితే హిందీ.

విస్తృత వ్యాప్తి - వైవిధ్య బాహుళ్యం అనే లక్షణం వల్ల వేరువేరు భాషలుగా వేరువేరు పేర్లతో వ్యవహరించ బడటానికి ప్రాచీన కాలంలోని ప్రాకృత భాషలను పేర్కొనవచ్చు. ప్రాకృతం ఆయా ప్రాంతాలలో మాగధి, శౌరసేని, ఇత్యాది పేర్లతో వ్యవహరించబడేది. ఈ భాషలలో వైవిధ్య బాహుళ్యం అధికంగా ఉండటం కొంత వరకు వీటి నామ వైవిధ్యాన్ని సమర్థిస్తున్నప్పటికీ, వీటి మధ్య పరస్పర అవగాహన క్షమత్వం మరీ తక్కువ ఏమీ కాదు.

తెలుగును కూడా ఈ లక్షణం (విస్తృత వ్యాప్తి - వైవిధ్య బాహుళ్యం) కలిగిన భాషగా గుర్తించవచ్చు. తెలంగాణా రాష్ట్రం, సాగరాంధ్ర రాయలసీమలతో కూడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తమిళనాడు రాష్ట్రం అంతటా విస్తరించిన పలు ప్రాంతాలు, కర్ణాటకలోని పలు ప్రాంతాలు, ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్రల లోని సరిహద్దు ప్రాంతాలు వ్యవహార సీమలుగా కలిగిన తెలుగు భాష సింగపూర్, శ్రీలంక, మలేశియా, మారిషస్ వంటి విదేశాలలోనూ తరతరాలుగా నివసిస్తున్న వ్యవహర్తలను కలిగి ఉంది. రెండు రాష్ట్రాలలోని ప్రతి జిల్లాలోనూ ప్రత్యేక వైవిధ్యం కలిగిన మాండలిక భేదాలను కలిగి ఉంది. ఇతర రాష్ట్రాలలో కూడా మాండలిక భేదాలను కలిగి ఉంది. ఈ విధంగా తెలుగు భాష విస్తృత వ్యాప్తి, వ్యవహార వైవిధ్యం కల భాషగా పరిగణించ వలసి ఉంది. కనుక ముందు చెప్పుకున్నట్లుగా తెలుగులో అనేక ప్రాదేశిక ప్రమాణ భాషలు అభివృద్ధి చెందటాన్ని స్వాగతించ వచ్చు; ప్రోత్సహించవచ్చు.

అందులో ఒకటి తెలంగాణా తెలుగు కావచ్చు. రెండవది తమిళనాడు, కర్ణాటకలలోని తెలుగు వ్యవహారాలను కలుపుకుంటూ రాయలసీమ తెలుగు కావచ్చు. లేదా రాయలసీమ తెలుగు ఒకటిగా ఉండి, తమిళనాడు కర్నాటక రాష్ట్రాలలోని తెలుగు మరొక ప్రమాణ భాష కావచ్చు. అయితే, ఈ రాష్ట్రాలలోని తెలుగువారిలో తెలుగులో రాస్తున్నవారు ఇంకా తగిన సంఖ్యలో కనిపించటం లేదు. కనుక ఈ రాష్ట్రాలలోని తెలుగును రాయలసీమ తెలుగుతో అనుసంధానం చేసి ప్రోత్సహించవచ్చు. ఇప్పుడున్న ప్రమాణ భాషను సాగరాంధ్ర ప్రాంతానికి ప్రమాణ భాషగా కొనసాగించవచ్చు.

ఇట్లా చెయ్యటం వల్ల మాతృభాషగా తెలుగు చదివే విద్యార్థుల తెలుగు భాషాపాటవంలో గుణాత్మకమైన మార్పువస్తుంది. దీనికి కారణం వారు చదివే తెలుగు తమ ప్రాదేశిక ప్రమాణ భాష కనుక అది వారి మాతృమాండలికానికి దగ్గరగా ఉండటమే. తెలుగు ఇంత విస్తృత వ్యాప్తి, ఇంత వైవిధ్య బాహుళ్యం కల భాష కనుకనే ఇప్పటి వరకు ఉన్న పరిస్థితిలో ఇప్పటి ప్రమాణ భాషకూ చాలా ప్రాంతాల విద్యార్థుల మాతృమాండలికాలకూ దగ్గరి పోలికలు లేకపోవటం వల్ల మాతృభాషగా తెలుగు చదువు సంతృప్తి కరమైన ఫలితాలను ఇవ్వలేక పోతున్నది. ఇది విద్యావిషయికంగా చాలా ముఖ్యమైన అంశం.

ఈ విధంగా ఏర్పడ్డ అనేక (మూడు లేదా నాలుగు) ప్రామాణిక రూపాల మధ్య అవగాహన క్షమత్వం ఏవిధంగా ఉంటుంది? ఈ ప్రశ్నకు సమాధానం సులభమే. వ్యవహార విస్తృతి వలన, ఆధునిక యుగంలో విస్తృతంగా వచ్చిన ప్రచార మాధ్యమాలలోని వాడుక వలన ఈ ప్రాదేశిక ప్రమాణ భాషలను అన్ని ప్రాంతాలలోని మాండలిక వ్యవహర్తలు అర్థం చేసుకోటం కష్టం కాదు. రాయటానికి, మాట్లాడటానికీ కష్టం అయినా విని చదివి అర్థం చేసుకోటం కష్టం కాదు. కాని **అన్ని ప్రాదేశిక ప్రామాణిక రూపాల లోని, అన్ని మాండలికాలలోని పద సంపద మొత్తాన్ని కలుపుకొని అఖండ తెలుగు భాషకు సమగ్రమైన నిఘంటువు మాత్రం తప్పనిసరి. దానితో పాటుగా ప్రాదేశిక ప్రమాణ భాషానిఘంటువులు కూడా నిర్మించుకో వచ్చు. ఉన్నత విద్యాస్థాయిలో అన్ని ప్రాదేశిక ప్రమాణ భాషాప్రాంతాలలోనూ తక్కిన ప్రాదేశిక ప్రమాణ భాషలలో రాసిన కొన్ని పాఠ్యాంశాలు, ప్రాచీన సాహిత్యం నుంచి కొన్ని పాఠ్యాంశాలు చేర్చటం కూడా చాలాముఖ్యం.**

### ఏ స్థాయిలో ఏ భాషణ రూపం వాడాలి?

**ప్రారంభ స్థాయి:**

ఇది పాఠశాలకు ముందు రెండు సంవత్సరాలు. తరగతులు పిల్లల ఇంటి పరిసరాలలో నెలకొల్పిన బడులలో జరగాలి. ఈ స్థాయిలోని కలాపాలు (activities) బోధన రూపంలో కంటె పిల్లలను బడికి తయారు చేసే విధంగా ఉండాలి. ఆటలు, పాటలు,

కవిత

## శ్వాస

ఇక్కడ అంతా కొత్తగా ఉన్నా
అందరితో పరిచయమున్నట్లనిపిస్తుంది
నవ్వుకు ప్రతినవ్వు బదులిస్తున్నా
ఆ నవ్వుల వెనుక మనదయిన
భాష వినిపిస్తున్నది
నమస్కారానికి ప్రతినమస్కారం చేస్తున్నా
ఆ వందనానికి వెనక లయలుచిందే
గుండెచప్పుడు నర్తిస్తున్నది
మనిషిని మనిషిని కలిపేది
కులమా..మతమా..ప్రాంతమా...
చెప్పలేని చిక్కుప్రశ్నయినా
భాషమాత్రం మనుషుల్ని
ఒక్కటిగా పెనవేసితీరుతుంది
అసలు బంధాలకన్నా
అక్షర బంధుత్వాలే అతిఘనిష్టమైనవని
కలం పట్టుకున్నప్పుడే అర్థమైంది
సాహిత్య సందర్భాలలో ఎక్కడికెళ్ళినా
కొందరు రచయితలు.. కవులు
మరికొందరు అక్షరాభిమానులంతా
నా సృజన చైతన్యాన్ని
రెట్టింపు చేయటానికన్నట్లూ...
మేమంతా ఏ పురాజన్మలనుంచో
భావాలను కలిసి పంచుకుంటున్నట్లూ
ఒకే భాషాసూత్రంతో
ఆప్యాయంగా అల్లుకుపోయినట్లూ...
అప్పుడు ఇంకేవయినా
ఎలా గుర్తొస్తాయి!
మా తలపుల్లో..పలుకుల్లో
పాటల్లో..పద్యాల్లో..కథల్లో..కవితల్లో
ఎందరో తాళపత్రాల తెలుగు కవులు
తాజా పరిమళాలతో శ్వాసిస్తుంటారు
మరెందరో ఉద్యమదీప్తులు
ఉరికురికి ఉదయిస్తుంటారు
నిన్న కన్నుతెరిచిన కవిశిశువు కూడా
ప్రతిభా జలపాతాలలో
స్నానం చేయిస్తుంటాడు
ఎంతకాలాన్నయినా
తెలుగు తీరాలలో మునకలేయించి
మనసుతీరకపోయినా మరలినప్పుడు
నా మాతృభాషా శ్వాసంతా
నానిండా..సరికొత్త సంగీతంలా..
జ్ఞాపకాల పూలగుత్తిలా...
పుస్తకాల్లో నెమలికన్నులా...
పదిలంగా నా స్మృతిపేటికలో!!
నాతోనే..నాతోనే!!

డా. సి. భవానీదేవి
9866847000

కథలు, కథనాలు, బొమ్మలు, బొమ్మల తయారీ, మొదలైన విధంగా ఉండాలి. సంవాదం పూర్తిగా మౌఖికంగానూ స్థానిక భాషలోనూ ఉండాలి. అది పిల్లలు ఇంట్లో మాట్లాడే భాషకు దగ్గరగా ఉండాలి. తెలుగైతే తెలుగు; ఏ భాషైతే ఆ భాష. అది లిపి లేని భాష కూడా కావచ్చు. దాన్నే వాడాలి. అందులోని పాటలనే సేకతించి వాడాలి. పాఠ్య పుస్తకాలతో పని ఉండకూడదు. ఈ స్థాయిలో వాడే భాషను స్థానిక భాషణ రూపం అందాం.

**మొదటి స్థాయి: 1, 2, 3 తరగతులు**

ఈ స్థాయిలో స్థానిక భాషణ రూపంలోనే సంవాదం జరగాలి. లిపి, అంకెలు, సుమతి, వేమన శతకాలలోనించి కొన్ని పద్యాలు, స్థానిక భాషణ రూపంలో రాయబడిన ఆసక్తి కరమైన కథలు, నీతి కథలు, గేయాలు, ఘటనల చిత్రణ, బొమ్మల కథలు,.... మొదలైనవి. ఇట్లా వివరించి చెప్పటం కంటె విద్యావేత్తలు ఈ స్థాయి పిల్లల కొరకు సూచించే బోధనాంశాలను స్థానిక భాషణ రూపంలో బోధించాలి.

**రెండవ స్థాయి: 4, 5 తరగతులు.**

విద్యావేత్తలు సూచించే బోధనాంశాలను స్థానిక మాండలికంలో రాసిన వాచకాలను స్థానిక భాషణ రూపంలో బోధించాలి. సంవాదంలో స్థానిక మాండలికాన్ని కూడా పరిమితంగా వాడాలి. స్థాయికి తగిన శతక పద్యాలను కరస్థం చేయించి, వాటిని స్థానిక భాషణ రూపంలో అర్థం అయ్యేలా వివరించాలి. మొదటి స్థాయిలో కంఠస్థం చేసిన పద్యాలకు కూడా స్థానిక భాషణ రూపంలో భావం వివరించాలి. స్థానిక మాండలికంలో రాయటాన్ని ప్రోత్సహించాలి. తప్పులను పట్టించుకో కూడదు.

**మూడవ స్థాయి: 6, 7, 8 తరగతులు**

విద్యావేత్తలు సూచించే బోధనాంశాలను స్థానిక మాండలికంలో రాసిన వాచకాలను స్థానిక మాండలికంలో వివరిస్తూ బోధించాలి. సంవాదం స్థానిక మాండలికంలో జరగాలి. స్థానిక మాండలికంలో రాయటాన్ని ప్రోత్సహించాలి. తప్పులు దిద్దాలి. స్థాయికి తగిన శతక పద్యాలను కరస్థం చేయించి, వాటిని స్థానిక మాండలికంలో అర్థం అయ్యేలా వివరించాలి. వాటికి తాత్పర్యాలు స్థానిక మాండలికంలో రాయటాన్ని ప్రోత్సహించాలి. అధ్యాపకుడు 6లో అప్పుడప్పుడూ, 7లో తరచుగా, 8లో పూర్తిగా ప్రాదేశిక ప్రమాణ భాషలో మాట్లాడాలి. పిల్లల చేత మాట్లాడించాలి.

**నాల్గవ స్థాయి: 9, 10 తరగతులు**

అన్ని బోధనాంశాలకు, సంవాదానికి ప్రాదేశిక ప్రమాణ భాష వాడాలి. పిల్లల భాషణలో తప్పులు పట్టించుకోకూడదు. రాతపనిలో తప్పులు దిద్దాలి. విద్యావేత్తలు సూచించే విధంగా పాఠ్యాంశాలు ఉండాలి. పాఠాలలో ప్రాచీన సాహిత్యం లోనించి తగినన్ని పద్యాలు ఉండాలి.వాటి బోధన వివరణ ప్రాదేశిక ప్రమాణ భాషలో ఉండాలి.

తెలుగు వాచకాలను గురించి ఇంతవరకు చెప్పుకున్నాం. తక్కిన విషయాలను కూడా తెలుగు మాధ్యమంలోనే బోధించాలి. ఏ తరగతిలో ఏ రకమైన తెలుగు వాడాలి అనే విషయంలో తెలుగు వాచకాల పద్ధతినే అనుసరించాలి.

ఇవన్నీ ఇట్లా జరగాలంటే విద్య పూర్తిగా ప్రభుత్వ రంగంలో ఉండాలి. ప్రైవేటు బళ్ళు ఉండ కూడదు. ఉపాధ్యాయులకు మంచి శిక్షణ ఉండాలి. తగిన విధంగా వాచకాలు నిర్మించాలి.

డా॥ అల్లంసెట్టి చంద్రశేఖరరావు
9949605141

# అక్షరాభ్యాసం - కొత్త పద్ధతి

**భా**షాబోధన వేరు. భాషలో బోధించడం వేరు. తెలుగు మాతృభాష కానివారికి తెలుగు బోధించడం భాషాబోధన. విషయాన్ని భాషామాధ్యమం ద్వారా బోధించడాన్ని భాషలో బోధించడం అంటాం. ఒక విషయాన్ని ఇంగ్లీషు మీడియంలో చెప్పొచ్చు లేదా తెలుగు మీడియంలో చెప్పొచ్చు. మాతృభాషలో విద్యాబోధన జరగాలని ప్రపంచంలోని అన్ని దేశాల మేధావులూ కోరుకొంటున్నారు. విద్య వేరు. చదువు వేరు. ఉదాహరణకు విలువిద్య. భారతం చదువు అంటే భారతం అనే పుస్తకంలో రాసిన దానిని చదువు అనే కదా అర్థం. అంటే రాత, చదువు పరస్పర సంబంధం కలవి అని తెలుస్తుంది.

"నూతన విద్యా విధానంలో **ఫౌండేషన్ లెర్నింగ్ (అభ్యసన పునాది)** ఆదర్శం. 'ఫౌండేషన్ లెర్నింగ్ అంటే కనీస నైపుణ్యాలను నేర్పించడం. భాష నేర్చుకోవడానికి వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం వంటివి పునాదులు. కాబట్టి ఈ నైపుణ్యాలను నేర్పించడానికి సరళమైన సులువైన పద్ధతులను ఉపయోగించి విద్యార్థులకు నేర్పించడం, కనీసం కావలసిన భాషని నేర్పించడం. జీవన మనుగడకు, విద్యార్థి ఉత్తర ప్రత్యుత్తరాలకు, దైనందిన సమస్యలను ఎదుర్కోవడానికి ఈ కనీసభాష అవసరం. అందుకే "జాతీయ విద్యావిధానం-19' అభ్యసన పునాదిని తీసుకు వచ్చింది." అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ వారు అంటున్నారు.

బడిలో పిల్లలకు తెలుగు భాషను నేర్పుతున్నాము అంటుంటారు. బడిలో పిల్లలకు ఏ భాషను నేర్పుతున్నాము? మాతృభాషను నేర్పుతున్నామా? పరభాషను నేర్పుతున్నామా? పిల్లలు బడిలో చేరకముందు నేర్చుకొన్న భాష ఎంత? బడిలో భాషను ఎంతవరకు నేర్పుతున్నాము? వారు ఎంత నేర్చుకున్నారు? అన్నది మౌలికమైన ప్రశ్న.

ఒకటవ తరగతి తెలుగు విద్యార్థికి మాతృభాషలో ఏమిటి నేర్పిస్తారు. బేసిక్ వకాబ్యులరీ నేర్పిస్తారా? ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు ఆ మాత్రం పదసంపద (వకాబ్యులరీ) ఉండదా? వినండి మాట్లాడండి అని ఒకటవ తరగతి తెలుగు వాచకంలో ఒక కృత్యం రాశారు. మాతృభాషలో ఏమిటి వినిపిస్తారు. విద్యార్థి ఏమిటి వింటాడు. మాతృభాషలో ఆ మాత్రం మాటలాడలేడా?

పూర్వం సోవియట్ రష్యా వారు 'రష్యన్ ఫర్ ఎవిర్ బడి' అని ఒక మాసపత్రిక నడిపిస్తుండేవారు. పత్రికతో పాటు ఒక గ్రామఫోన్ రికార్డు పంపించేవారు. దానిలో 'లిసన్ అండ్ రిపీట్ ' అని ఒక ఉచ్చారణ అభ్యాసం ఉంటుంది. పరభాష నేర్చుకొనేవారికి ఈ అభ్యాసం అవసరమే. తెలుగుభాషను పరభాషగా నేర్చుకొనేవారికి ఈ డ్రిలింగ్ అవసరమే. తెలుగు పిల్లలకు తెలుగు పరభాష కాదుకదా? అది వారి మాతృభాష. మహాప్రాణ అక్షరాలైతే కొంతమందికి ఉచ్చారణలో శిక్షణ అవసరం. కాని 'అ' అన్న అక్షరం, 'క' అన్న అక్షరం. 'గ' అన్న అక్షరం పలకలేని బడిపిల్లలు వుంటారా? ప్రత్యేకంగా ఉచ్చారణ నేర్పవలసిన ధ్వనులున్నాయి. వాటిని వేరేగా పేర్కొనాలి.

తెలుగువారికి ఇంగ్లీషు మాతృభాష కాదు. ఇంగ్లీషు బోధించేటప్పుడు ఒక పాఠంలో ఒకటి రెండు వ్యాకరణాంశాలు, కొన్ని కొత్త పదాలూ, కొత్త వాక్యనిర్మాణ పద్ధతి నేర్పుతాం. ఒకే భావాన్ని రెండు వాక్యనిర్మాణ పద్ధతుల్లో ఎలా చెప్పవచ్చో నేర్పుతాం. ఇవి విద్యార్థి ఎంతవరకు నేర్చుకున్నాడు అని పరీక్షించే విధానం గూడ వుంది. ఇంగ్లీషుభాష నేర్చుకోవడానికి ముందు విద్యార్థికి భాషాపరిజ్ఞానం సున్న. భాష నేర్పుతున్నాం. భాష నేర్చుకొన్న తరవాత మూల్యాంకనం చేస్తున్నాం. మార్కులు వేస్తున్నాం. మాతృభాషా బోధనలో అటువంటి విధానం ఏమైనా వుందా అని ప్రశ్నించుకోవలసిన అవసరం వుంది.

బడి ఈడు పిల్లలకు ఇదివరకే భాష తెలుసు. పిల్లలు తల్లిదండ్రుల నుండి తమ కంటె పెద్దవారి నుండి, ఇరుగు పొరుగు వారినుండి భాష నేర్చుకొంటారు. అవసరమైనంత మేరకు తమ భావాలను మాతృభాషలో వ్యక్తం చేయగల సామర్థ్యం వారికి వుంటుంది. అలాగే వ్యావహారిక అంటే చుట్టు పక్కలవాళ్ళు మాట్లాడే భాషను అర్థం చేసుకునే సామర్థ్యం గూడ వుంటుంది. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి అక్షరాలు నేర్చుకున్న తరవాత పుస్తకాలు చదువుకొని విషయాన్ని గ్రహించగలడు. నాలుగు, ఐదు తరగతులు చదువుతున్న పిల్లలు చందమామ, బాల, బాలమిత్ర వంటి మాసపత్రికలు చదివేవారు కదా? కొందరు ప్రముఖ రచయితల విద్యాస్థాయి నాలుగు, ఐదు తరగతులే. పిల్లలకు అర్థంకాని భాషలో రాస్తే అప్పుడు ఉపాధ్యాయుని అవసరం కలుగుతుంది. పిల్లలకు అర్థంకాని భాషలో రాసిన విషయాన్ని వారికి అర్థం అయ్యే భాషలో ఉపాధ్యాయుడు వివరించవలసిన అవసరం వుంటుంది. ఈ విషయాన్నే యేట్సుదొర గమనించాడు. వ్యావహారిక భాషోద్యమానికి ఇదే నాంది. పిల్లలు తమంతట తాము చదువుకొనే స్థాయికి తీసుకువెళ్ళడమే ఉపాధ్యాయుని విధి. ఉన్నత విద్యలో మనం బోధించేది భాషకాదు. సాహిత్యం. మన లక్ష్యం భాష తెలిసిన వారికి చదువు చెప్పడం. భాష నేర్పడం కాదు. భాషకు లేఖనానికి సంబంధం లేదు. ఇప్పటికీ లిపిలేని భాషలు చాలా వున్నాయి. ఒకే భాషను వేరు వేరు లిపులలో రాసే విధానం వుంది. ఉదాహరణకు సంస్కృతం.

**చదువు, రాత ఎందుకు నేర్చుకోవాలి.**

రాతలేకపూర్వం మానవుడు తాను సంపాదించిన జ్ఞానాన్ని మౌఖికంగానే తరవాత తరాలవారికి అందించేవాడు. ఇప్పుడు దూర

శ్రవణం అంటే టెలిఫోన్ ద్వారా దూరం నుండి సంభాషణం చేయగలుగుతున్నాం కదా. కాబట్టి రాయడం ఎందుకు నేర్చుకోవాలి? అని అడగొచ్చు. మాటలు గాలిలో కలిసిపోతాయి. కాబట్టి రాత అవసరం. "గొప్ప జ్ఞాపకశక్తి కన్న వెలిసిపోయిన సిరాచుక్క మిన్న" అన్నది చైనా సామెత. "నేను మాటిచ్చాను" అంటే కొందరు ఒప్పుకోరు. "అదేదో కాయితం మీద రాసియ్యి" అంటారు. చదువు దూర ధ్వనులను వినడమేకాదు, పూర్వపు భాషను గూడ వినగలదు. నన్నయ భారతం చదవడం ద్వారా 11వ శతాబ్దం నాటి గ్రాంథిక భాషను వినగలుగుతున్నాం కదా. అందుచేత చదవడం నేర్పాలి. చదవడం ద్వారా ఎవరో ఎప్పుడో రాసినదానిని చదువుతున్నాం గాని భవిష్యత్తుకు మనం ఏమీ అందించలేం. ఈ నాటి మన భావాలు భవిష్యత్తరాలకి అందించాలంటే రాతలో చూపడం అవసరం.

వ్యక్తి తన భావాలను ఇతరులకు అక్షరాలద్వారా తెలియజెయ్యడం రాతయొక్క లక్ష్యం. దీనికి కేవలం అక్షరాలు రాయడం మాత్రమే చాలదు. భావవ్యక్తీకరణ సామర్థ్యం వుండాలి. తాను రాస్తున్న భాషలోని పదాలు, వాటి వినియోగం, వాక్యనిర్మాణ పద్ధతులు తెలిసుండాలి. కాబట్టి పుస్తక పఠనం అవసరం. వ్యక్తిగత కారణాల వలన కొందరు బాగా మాట్లాడ లేకపోయినా, వారికి ఆ భాషలో వ్యక్తీకరణ సామర్థ్యం వుంటే బాగా రాయగలరు.

**పాత పద్ధతి-ఒక సమీక్ష**

కొత్త పద్ధతిలో అక్షరాభ్యాసం గురించి తెలుసుకొనే ముందు ఇప్పుడున్న పద్ధతిని సమీక్షించుకోవలసిన అవసరం వుంది. నేను చెప్పబోయే విషయాలు మీ అనుభవంలోనివే. కొత్తవేమీ కావు. ఎల్.కె. జి. చదువుతున్న చిన్న పిల్లలు పుస్తకం చేత పట్టుకొని "ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్ " అనో "రెయిన్ రెయిన్ గోఎవే" అనో లేదా "వానా వానా వల్లప్ప" అనో అనర్గళంగా చదువుతుండడం చూసే వుంటాం. ఇంట్లో పెద్ద పిల్లలు చదువుతున్న ఒకటవ తరగతి పుస్తకాన్ని వాళ్ళ చిన్న తమ్ముడో చెల్లాయో, ఇంకా బడిలో వేయకపోయినప్పటికీ 'అమ్మ, ఆవు, ఇటిక, ఈగ, ఉడుత, ఊయల' అని ఈ చివరనుండి ఆ చివరవరకు చదవడం చూసి మురిసిపోనివారుండరు. ఇలా పుస్తకాలు చూసి చదువుతున్న పిల్లలు అక్షరాలు గుర్తించి చదువుతున్నారా? లేక మరే జ్ఞానాన్నిబట్టి చదవగలుగుతున్నారు? అన్న ప్రశ్న ఎప్పుడైనా వేసుకొన్నామా?

"వానా వానా వల్లప్ప" పాటను పుస్తకం నుండి కత్తిరించి ఆ కాగితాన్ని చూపించి చదవమనండి. అలాగే "బాబా బ్లాక్ షీప్" పాటను ప్రత్యేకంగా చూపించి చదవమనండి. లేదా 'అమ్మ, ఆవు, ఇటిక, ఈగ, ఈ పదాలను పెద్ద అక్షరాలలో రాసి చదవమనండి. ఒకవేళ చదవగలిగితే పిల్లవాడికి "అ" తో పాటు "మ్మ", "ఇ" లో పాటు "టిక" గూడ గుర్తించడం వచ్చనమాట. అంటే అక్షరాలు గుణింతాలు వచ్చినట్లే కదా. అటువంటి విద్యార్థికి ఇంకా 'అ, ఆ లు చదవడం నేర్పాలా?

బొమ్మలు చూపించి అక్షరాలు నేర్పాలనుకోవడం తప్పు. యు.కె.జి. రవి తెలుగు వాచకములో కత్తి బొమ్మ కింద "కృపాణము" అని రాశారు. దానిని "ఖడ్గము" అని యు.కె.జి. చదువుతున్న అమృత చదివింది. తప్పు అనగలమా? తప్పు అన్నా 'మా టీచరు అలాగే చెప్పారు' అంటుంది. వాళ్ళ టీచరు చెప్తున్న వాచకంలో 'ఖడ్గము' అనే వుంది. 'ఖడ్గము' గూడ బడిలో నేర్చుకొన్న మాటే. వాడుకమాట కాదు. "సీతాఫలము" బొమ్మకింద "ఫలము" అని రాస్తే సీతాఫలమే 'ఫలము' మరేపండూ ఫలము కాదు అనే గ్రహిస్తాడు కదా విద్యార్థి. అలాగే నక్షత్రం బొమ్మ కింద "భరణి" అని రాయడం వలన ఏ నక్షత్రం బొమ్మ చూపినా భరణి అంటాడు కదా?

ఒకటవ తరగతిలో అక్షరాలు నేర్పడానికి ముందుగా నేర్పాలనుకొనే అక్షరం కలిగి ఉన్న పాటను నేర్పాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ వారు అంటున్నారు. ఒకటవ తరగతి వాచకంలో పాటలువున్నాయి. విద్యార్థి పాటలోని పదం, పదంలోని అక్షరం గుర్తుపట్టాలి. ద్రావిడ ప్రాణాయామం అంటే ఇదే. పాటకు ఒక దృశ్యం. పదానికి ఒక బొమ్మ. బొమ్మను చూసి పదంలోని అక్షరాన్ని చదవడం. పాటలు, పద్యాలు చదవగలిగిన విద్యార్థులు అ, ఆ, లు నేర్చుకోవాలా? తెలుగు వాచకం సాహిత్య బోధనకు ఉపయోగపడుతుంది. అక్షరాభ్యాసానికి కాదు.

పాఠ్యగ్రంథాల రచయితలు ఇంగ్లీషు వాచకాలను అనుకరిస్తున్నారు. మన పిల్లలలాగే ఇంగ్లండులోని మూడు, నాలుగు సంవత్సరాల వయస్సుగల ఇంగ్లీషు పిల్లలకు గూడ చక్కగా ఇంగ్లీషు మాట్లాడడం వస్తుంది. కాని వారికి చదవడం రాదు. మనలాగ వారికి అక్షరాలు నేర్పిస్తే చాలదు. తెలుగు అక్షరాలు ధ్వని విధేయంగా వుంటాయి. ఇంగ్లీషు అక్షరాల ధ్వని, పదాన్ని బట్టి మారిపోతుంది. కాబట్టి ఇంగ్లీషు విద్యార్థి స్పెలింగు బట్టీపెట్టాలి. తెలుగు విద్యార్థికి ఈ బాధ లేదు.

ఇంగ్లీషు భాషలోని అక్షరాలు ధ్వని సంకేతాలు కావు. వాటికి పేర్లున్నాయి. ఇంగ్లీషు, గ్రీకు మొదలైన భాషలలోని అక్షరాలకు పేర్లుంటాయి. ఇవి ధ్వని సంకేతాలు కావు. ఇంగ్లీషు భాషలోని మొదటి అక్షరం పేరు 'ఏ'. రెండవ అక్షరం పేరు 'బి'. ఇంగ్లీషులో మొదటి అక్షరం అచ్చయితే రెండవ అక్షరం హల్లు. A అన్న అక్షరం యొక్క ధ్వని "ఎ" కాదు. అది ఒకప్పుడు "అ" గాను, మరొక్కప్పుడు "ఏ" గాను వినిపిస్తుంది. B అన్న అక్షరం యొక్క ధ్వని "బి" కాదు. దాని ధ్వని "బ". గ్రీకులో A,B లను 'ఆల్ఫా, బీటా' అంటారు. దాని రూపమే 'ఆల్ఫాబెట్'. మన అక్షరాలలో "ఁ అరసున్న; ం - నిండుసున్న' ః- విసర్గ, వీనికి మాత్రమే పేర్లున్నాయి. వీని ధ్వనిని ఏకండీగా పలకలేం. నిండుసున్న యొక్క ధ్వని ప్రక్కనున్న అక్షరాన్నిబట్టి వుంటుంది.

ఇంగ్లీషు పిల్లలకు ఏపిల్ బొమ్మని చూపిస్తే ఏపిల్ అంటారు. "ఏపిల్" అన్న పదాన్ని చదవలేరు. కాబట్టి Apple లో A అన్న అక్షరాన్ని ఎర్ర రంగులో ముద్రిస్తే "ఏపిల్" అన్న మాటలోని మొదటి అక్షరం యొక్క ధ్వని ఏ అని గ్రహించ వీలుంది. ఇంగ్లీషు పిల్లవాడికి ఏపిల్ బొమ్మ చూపిస్తే "ఏపిల్" అంటాడు. "మోచేయి" బొమ్మ చూపిస్తే "ఆ(ర్)మ్" **Arm** అంటాడు గాని "ఏ(ర్)మ్" అనడు కదా. ఇంగ్లీషులో ''ఎ'' అన్న అక్షరానికి రెండు పలుకుబడులు వున్నాయనమాట. ఒకే అక్షరం రెండు ధ్వనులు. మరొక జంట చూద్దాం. cat, kite వీనిలోని మొదటి అక్షరం యొక్క ధ్వని ఒక్కటే.

కాని రెండక్షరాలు. ఒకే ధ్వనికి రెండక్షరాలు. అందుచేత బొమ్మని చూపించి పదాన్ని పలికిన తరవాత స్పెలింగ్ చెబుతారు. ఇంగ్లీషులో పదాన్ని బట్టి అక్షరం యొక్క ధ్వని మారుతుంది. ఈ విధానం మనకు సరిపోదు.

ఇంగ్లీషు అక్షరాలు నేర్పడానికి Apple లో A ని, Bell లో B ని ఎర్ర రంగులో ముద్రిస్తారు. ఇదే పద్ధతిని తెలుగువారు కూడ అనుకరించారు. పిల్ల నెత్తుకొన్న స్త్రీ 'అమ్మ'. ఆవు బొమ్మ కింద 'ఆవు'. ఓడ బొమ్మ కింద 'ఓడ'. డబ్బా బొమ్మ కింద 'డబ్బా'. ఈ పదాలలోని మొదటి అక్షరాలన్నీ కొట్టొచ్చినట్లు కనిపించేటట్లు వేరే రంగుల్లో పెద్దవిగా ముద్రిస్తారు. ఎల్. కె. జి. చదువుతున్న మూడున్నర సంవత్సరాల అమృత 'ఓ' అన్న అక్షరాన్ని చూసినప్పుడల్లా 'ఓడ' అంటుంది. 'ఓ', 'డ' ఈ రెండు అక్షరాలు విడి విడి అక్షరాలు అని బోధించినా గూడ మళ్ళీ అదేమాట. "ఓడ". 'మా టీచర్ అలాగే చెప్పారు' అంటుంది. 'ఓడ' అని చదువుతారు 'డబ్బా' అని చదవ లేరు. విడివిడిగా అక్షరాలు చదవలేరు. 'అమ్మ' చదివినవాళ్లు 'అయ్య' చదవలేరు.

పిల్లలు గుర్తుపట్టినవి అక్షరాలు కావు. వారు గుర్తుపట్టినవి బొమ్మలు. అక్షరాలు బొమ్మలు కావు, అవి ధ్వని సంకేతాలు. వాటిని చదవాలి. మన లక్ష్యం అక్షరాలు చదవడం. బొమ్మలను గుర్తుపట్టడం కాదు. పిల్లలకు బొమ్మలు చూపించి కథలు చెప్పండి. పాటలు నేర్పండి. కాని అక్షరాలకీ బొమ్మలకీ ముడిపెట్టవద్దు.

**ఇప్పటి పద్ధతిలో లోపాలున్నాయి కాబట్టే కొత్త పద్ధతి అవసరమైంది.**

పిల్లలు పదాలు పలుకుతారు. ఆ మాటలకు అర్థం గూడ వారికి తెలుసు. పిల్లలకు తెలిసిన పదాలతోనే అక్షరాభ్యాసం చేయించాలి. మనం పదాన్ని విడగొట్టి అక్షరాలు నేర్పుతున్నాం. మాటలు ధ్వనుల సమూహం అని పిల్లవాడు అర్థం చేసుకోవాలి. కాబట్టి పదాలు చదవడం ద్వారా అక్షరాలు నేర్పడం సరైన పద్ధతే. ధ్వనులను అక్షరాలుగా రాస్తున్నాం అని గూడ పిల్లలకు తెలియాలి. పదాలలోని అక్షరాలనన్నిటినీ ఒకేసారి నేర్పలేం కాబట్టి నేర్చుకొన్న అక్షరాలతోనే పదాలు కూర్చాలి.

2

## అక్షరాభ్యాసం - కొత్త పద్ధతి

### భూమిక

**రాత ఎప్పుడు నేర్పాలి:**

ఐదు సంవత్సరములు పైబడినవారిని ఒకటవ తరగతిలో చేర్చుకొంటున్నారు. ఒకటవ తరగతిలో అక్షరాలు దిద్దుతారు. రాయడం, చదవడం నేర్చుకొంటారు. ఆ వయస్సువారికి అందంగా బొమ్మలు గీయడం వస్తుంది. దస్తూరీ బాగా కుదురుతుంది. గాంధీగారు తన దస్తూరి గురిచి మాట్లాడుతూ "వంకర టింకర అక్షరాలు అసంపూర్ణ విద్యకు చిహ్నంగా భావించాలి. నా అక్షరాలను అందంగా రాద్దామని ఎంతో ప్రయత్నించాను. కాని వ్యవహారం చెయ్యిదాటిపోయింది. దస్తూరీ మార్చుకోలేకపోయాను. నన్ను చూసి ప్రతి బాలుడు, ప్రతి బాలిక జాగ్రత్త పడాలని కోరుకొంటున్నాను. అక్షరాలు దిద్దించుటకు ముందు బాలురకు చిత్రలేఖనం నేర్పడం అవసరమని నా అనిపించింది. పూవులు, పిట్టలు మొదలగు వాటిని పరిశీలించి చిత్రించినట్లే అక్షరాన్ని గూడ పరిశీలించి రాయడం అవసరం. వస్తువులను చూసి గీయడం నేర్చుకొన్న తరవాతే రాత నేర్పడం మంచిది. అప్పుడు అక్షరాలు అందంగా వుంటాయి." అన్నారు.

**ఐదు సంవత్సరములు పైబడిన పిల్లకు రాయడం నేర్పవచ్చు.**

ఒకటవ తరగతిలో చదవడంతో పాటు రాయడం నేర్చుకొంటారు. రెండవ తరగతిలో ప్రవేశించే నాటికి తెలుగు అక్షరాలన్నీ రావాలి. తెలుగు చదవగలగాలి, రాయగలగాలి. ఒకటవ తరగతిలోపు విద్యార్థులకు రాత నేర్పకండి. నేడు తల్లిదండ్రులు తమ పిల్లలను యల్.కె.జి.' యు.కె.జి. తరగతులలో చేర్పిస్తున్నారు. వారు అ, ఆ కంటే ముందుగానే ఎ, బి, సి, డి లు దిద్దుతున్నారు. ఐదు సంవత్సరాలకు ముందుగానే నోటు బుక్కు. పెన్సిలు, ఇరేజరు పట్టేస్తున్నారు. తప్పులు రాసి ఇరేజర్‌తో చెరపడం కన్న తప్పు రాయకుండా వుండడం మిన్న. తెలుగు పిల్లలకు మాతృభాషలో కంటే పరభాషలోనే ముందుగా అక్షరాభ్యాసం జరిగిపోతుంది. అందుచేత మనం గూడ ఒకడుగు ముందుకేయాలి.

**ఐదు సంవత్సరముల లోపు పిల్లకు చదవడం నేర్పవచ్చు**

చదవడం, రాయడం ఇవి రెండూ వేరువేరు విషయాలుగా గుర్తించాలి. మాతృభాషలో చక్కగా భావ వ్యక్తీకరణ చేయగలిగే పిల్లలకు, నిత్యజీవితంలో వాడుకొనే మాటలు తెలిసిన పిల్లలకు అంటే క్షుణ్ణంగా మాట్లాడ గలిగే పిల్లలకు చదవడం నేర్పవచ్చు. వయస్సు, పరిసరాలు, గ్రహణ శక్తి మొదలైన వాటిపై పిల్లల పదసంపద ఆధారపడి వుంటుంది. దీనిని దృష్టిలో వుంచుకొని ఉపాధ్యాయుడు బోధనా విషయాన్ని రూపొందించుకోవాలి. మూడు సంవత్సరములు పైబడినవారిని ఎల్.కె.జి.లోను, నాలుగు సంవత్సరములు పైబడినవారిని యు.కె.జి.లోను, ఐదు సంవత్సరములు పైబడినవారిని ఒకటవ తరగతిలోను చేర్చుకొంటున్నారు. ఒకటవ తరగతిలో అక్షరాలు రాయిస్తున్నారు. కాబట్టి నాలుగు సంవత్సరములు పైబడిన పిల్లలకు చదవడం నేర్పవచ్చు. రాయడం నేర్పకూడదు. రాతకు ముందు చదవడం వస్తే మంచిదే కదా.

మన లక్ష్యం పిల్లలచేత వారి మాతృభాషలోని మాటలను చదివించడం. వారిచేత రాయించడం కాదు. చదవడం అంటే ఇతరులు రాసిన వాటిని, అంటే వారు ఉపయోగించిన పదజాలాన్ని చదవడం. అంతేకాదు అర్థం చేసుకోవడం గూడ అవసరమే. అర్థం తెలీని చదువు వ్యర్థం. రాసేవాడు ఉపయోగించిన పదజాలం అంతా చదివేవాడికి తెలియకపోవచ్చు. కాబట్టి పిల్లలకు తెలీని పదాలకు అర్థాలు, వాటిని వుపయోగించడం మొదలైనవి ఉపాధ్యాయుడు చక్కగా బోధించవలసివుంటుంది. ఇది పిల్లలపై అధిక భారం మోపడం. లక్ష్య పరిమితులు దాటిపోవడం. విద్యార్థులకోసం రాసిన పాఠ్య గ్రంథాలలో కొత్త పదాల సంఖ్య చాలా తక్కువగా వుండాలి. వీలైనంత వరకూ వారు వుపయోగిస్తున్న పదాలను వాడి అక్షరాలను నేర్పడం మంచిది. ఇది చాలా శ్రమతో కూడిన పని. పిల్లలు నిత్యం వాడుతున్న పదాలు ఎన్ని? ఏవి? అని ముందుగా తెలుసుకోవాలి.

ఆయా పదాలలో చెప్పదలచుకొన్న అక్షరాలు విద్యార్థుల పదసంపదలో లేనప్పుడు మాత్రమే కొత్త పదాలను వారికి పరిచయం చెయ్యాలి. రాత నేర్పడానికి ముందు చదువు నేర్పడం వలన ఒక లాభం వుంది. రాత నేర్చుకొనే సమయానికి విద్యార్థికి ఇంచుమించు అన్ని అక్షరాలూ తెలిసి వుంటాయి. పద సంపద కూడ పెరుగుతుంది.

**ఎటువంటివి చదివించాలి:**

మాతృభాషలో రాసిన పదాలను, వాక్యాలను పిల్లలు చదువుకొని అర్థం చేసుకోవడానికి అనువుగా వారికి ఆ భాషలోని అక్షరాలను చదవడం నేర్పాలి. పిల్లలు నిత్యం వాడుకొనే మాటలు చదివించాలి. వీలైనంత వరకు నిత్యం చూస్తున్న వస్తువుల పేర్లు చదివించాలి. బంధు వాచకాలు, తోటి విద్యార్థుల పేర్లు, ఊరిపేర్లు, సినిమాల పేర్లు ఇలా ఏవైనా ఎంచుకోవచ్చు. తెలియని పదాలను ఉపయోగించడం కంటె తెలిసిన పదాలతోనే అక్షరాభ్యాసం చేయించడం మంచిది.

పిల్లలకు ఏం నేర్పాలనుకొంటున్నారు. లక్ష్యాన్ని ఖచ్చితంగా నిర్దేశించండి. అక్షరాలను నేర్పాలనుకొంటున్నారా? లేక కొత్తపదాలను నేర్పాలనుకొంటున్నారా? పదాలే నేర్పాలనుకొంటే అక్షరాలద్వారా నేర్పవలసిన పనిలేదు. 'ఝషము' అని చెప్పడానికి బొమ్మను చూపించి మూడుసార్లు చెప్తే చాలు నాలుగోసారి బొమ్మను చూడగానే పిల్లవాడు. 'ఝషము' అంటాడు పిల్లలు 'ఝ' ని గాని 'ష' ని గాని 'ము' ని గాని గుర్తించకుండానే చదివేస్తారు.

నేడు విద్యాబోధనపై వ్యాసాలు రాస్తున్న వారుగూడ 'ఙ', 'ఞ'ల ఉచ్చారణ విషయంలో తప్పుగా రాస్తున్నారు. "ఞ" ని "ఇణి" అంటున్నారు. "ఋ, ౠ" లను "అఋ, అౠ" అని అంటున్నారు. "జ్ఞానము, జ్ఞాపకం" వంటి మాటలలో మాత్రమే "ఞ" అక్షరం కనిపిస్తుంది. 'ఋ' అన్న అక్షరం కొన్ని పదాలలో మాత్రమే రాస్తున్నారు. ఈ అక్షరాన్ని గూడ సరిగ్గా ఉచ్చరించడం రానివాళ్ళు వున్నారు. ఉపాధ్యాయుడు తన ఉచ్చారణ సరిగా లేదనుకొంటే ఆ అక్షరాలు చెప్పడం మానుకోవాలి. వాటిని విద్యార్థి పైతరగతులలో అవసరమైనచోట్ల నేర్చుకొంటాడు. ఇటువంటిదే మరొక అక్షరం. బండి ఱ. ఈ అక్షరం ద్విత్వం గానే మనకు కనిపిస్తుంది. దీనిని ప్రాచీన రచనలు చదువుకోవడం కోసం నేర్చుకోవాలి. ఒకటవ తరగతిలో నేర్పవలసిన పనిలేదు.

**మాటనుండి రాతకు:**

రచయితలు మాట్లాడే భాషకు అక్షరరూపం యిస్తారు. మాట్లాడే భాషకీ రాసే భాషకీ భేదం వుంటుంది. ఆ భేదం ఎంత తక్కువగా వుంటే అంత మంచిది. శిష్ట వ్యావహారికాన్ని గూడ రాయడం అన్నిచోట్లా జరిగేపనికాదు. లిపికి కొన్ని పరిమితులున్నాయి. మాట్లాడేటట్లు రాయలేం. వాగ్వ్యవహారంలోనున్న భాషను లిపి బద్ధం చేసేటప్పుడు చాలా సమస్యలు ఎదురౌతాయి. భాషలో వివిధ రకాలైన మాండలికాలు వుంటాయి. కుల మాండలికాలున్నా చదువుకున్న వారిలో ఆ భేదం అంతగా కనిపించదు. కొందరు విద్యావేత్తలు బోధనా మాధ్యమం గురించి మాట్లాడుతూ ఇంటిభాషలో విద్యాబోధన జరగాలంటున్నారు. అందరి ఇళ్ళల్లో భాష ఒక్కలాగ వుండదు. ఇంటిభాష గూడ ఎల్లప్పుడూ ఒక్కలాగే వుండదు. మా ఇళ్ళల్లో "చదవడం లేదు, రాయడం లేదు" అంటాం. పుస్తకాలలో గూడ ఇలాగే రాయడం వుంది. మా మనవరాలు విశాఖపట్నంలో 3వ తరగతి చదువుతుంది. ఆమె భాష చాలాకాలం క్రితమే మారిపోయింది. "చదవ ట్లేదు, రాయట్లేదు" అంటుంది. ఆమె తమ్ముడు, రెండేళ్ళవాడు గూడ అలాగే అంటున్నాడు. వాళ్ళ చిన్నాన్న పిల్లలు గూడ అలాగే అంటున్నారు. అమ్మల్ని అనుకరించడం లేదు. ఇంటి భాష వేరు. బడి భాష వేరు. విద్యార్థి చదువుకోవడం ద్వారా ఇంటిభాషనుండి బడిభాషకు అంటే ప్రామాణిక భాషకు మారతాడు. మాండలిక పదాలు గూడ ప్రామాణికమే. ప్రాంతాలనుబట్టి పదాల వాడుక వుంటుంది. వాడుక పదాలను రాయగలం. చదవగలం. కాని యాసలో రాయలేం. భాష వేరు, యాస వేరు.

విద్యార్థులు భాషను తరగతి గదిలోనే కాదు బయటగూడ నేర్చుకొంటారు. భాషపై సినిమా, టి.వి., ప్రింట్ మీడియా ప్రభావంగూడ అధికంగా వుంటుంది. చిన్న పిల్లలు టి.వి., సినిమాలలోని సంభాషణలను, ముఖ్యంగా విలన్ భాషను అనుకరించడం మీరు గమనించే వుంటారు. కొందరు నటులు నత్తి నత్తిగా మాట్లాడుతుంటారు. పిల్లలు వీరిని అనుకరించకుండా చూడవలసిన బాధ్యత అందరిపైనా వుంది. ప్రింటు మీడియా గూడ తనవంతు కర్తవ్యంగా రకరకాల స్పెలింగులు ప్రవేశపెడుతూనేవుంది. న్యూన ప్రమాణం ఇబ్బందికరంగా ఉంటుంది.

అక్షరాలను రాసేటట్లు గానే చదవాలి. 'ఎలక, ఎలుక, ఎలిక' ఉడుత, ఉడత' అనే మాటలు వాడుకలో వున్నాయి. ఎలాగ రాస్తే అలాగే చదవాలి. కొందరు 'నొప్పి' అని రాస్తే, మరి కొందరు 'నెప్పి' అని రాస్తారు. కొందరు 'తరువాత' అని రాస్తే, మరి కొందరు 'తరవాత' అని రాస్తారు. రాసినట్లే చదవాలి. తప్పులు రాస్తే తప్పులే చదవాలి. ఉచ్చారణలో ఉన్న ఈ స్వల్ప భేదాలను ఉపాధ్యాయుడు బోధించాలి.

ఇంగ్లీషు చదువుల మూలంగా తెలుగు ఉచ్చారణలో మార్పు వచ్చింది. 'నాన్నమ్మ' ను 'నానమా' అని పిలుస్తున్నారు. మరి వారి రాత ఎలాగుంటుందో ఊహించండి. కొందరి 'చ' కారోచ్చారణ గూడ తెలుగు ఉచ్చారణకాదు. ఐనా దీని ప్రభావం రాత మీద ఉండదు. ఒకటవ తరగతిలోనే పిల్లల ఉచ్చారణ సరిచేయవలసి వుంటుంది. ఈ విషయంలో అశ్రద్ధ వహించకూడదు.

ఒకటి రెండు తరగతులలోని విద్యార్థులు, మాట్లాడే భాష నుండి క్రమంగా రాత భాషకు అలవాటు పడతారు. అంతేకాదు పిల్లవాడు తన పద సంపదను పెంచుకొంటాడు. ఇది ఒక ప్రాంతానికి చెందిన భాష గురించి చెప్పడం కాదు. వ్యావహారికంలో రాస్తున్నాం అంటున్నా రాసే భాషకూ మాట్లాడే భాషకూ తేడా వుంటుంది. కొందరు బాగా చదువుకున్నవారు గూడ, "వచ్చేసినారు" అన్న మాటను "వచ్చేసి(న్రు" అంటుంటారు. కాని "వచ్చేసినారు" అనే రాస్తారు.

రాతలో వున్న భాష శ్రద్ధగా మాట్లాడేభాష. తొందరగా మాట్లాడే భాష కాదు. ఏ ప్రాంతం వారికైనా ఈ సూత్రం వర్తిస్తుంది.

సంభాషణలో వున్న వేగం రాతలో కనిపించదు. కాబట్టి సందిగ్ధతకు తావులేకుండ వుండడంకోసం విసంధి రూపాలు రాయడమే మంచిది.

3

## ఒకటవ తరగతిలో అక్షరాభ్యాసం కొత్త పద్ధతి

ప్రవేశిక

ఒకటవ తరగతి ఉపాధ్యాయులు ఈ కొత్త పద్ధతిలో అక్షరాలు నేర్పితే పిల్లలు అనతి కాలంలోనే చిన్న చిన్న పుస్తకాలు చదవగలరు. ప్రభుత్వం విధించిన ప్రణాళికను అమలు చేస్తూనే కొత్త పద్ధతిలో అక్షరాలు నేర్పవచ్చు.

బడిలో ఉపాధ్యాయునికంటె ఇంటివద్ద పిల్లల తల్లిదండ్రులు సులువుగా అమలు చేయగలరు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయునికి ఉన్న సమస్య వీరికుండదు. ఈ పద్ధతిని ఇతర రాష్ట్రాలలో ఉన్న తెలుగువారు, ఇతర దేశాలలో ఉన్న తెలుగువారు సులభంగా వినియోగించుకోగలరు. ఈనాడు చదువు రాని తల్లిదండ్రులు లేరు. పిల్లల తల్లిదండ్రులు విద్యావంతులు కాబట్టి పిల్లల చదువుకోసం ఉదయం ఒక పది నిమషాలు, రాత్రి ఒక పది నిమషాలు కేటాయించండి. పిల్లలకు తల్లిదండ్రులే తొలి ఉపాధ్యాయులు.

**ఐదు సంవత్సరములు పైబడిన పిల్లలకు రాయడం నేర్పవచ్చు.**

**ఉపకరణాలతో సంసిద్ధులు కండి**

**బోధన ఉపకరణాలు**

1) బ్లాక్ బోర్డు: పిల్లలకు అక్షరాలు రాయడం నేర్పుతున్నాం కాబట్టి ఈ బోర్డుపై సమాన దూరంలొ 4 లేక 5 గీతలు వుండాలి. అక్షరాలు వీటి మధ్యనే రాయాలి.

2) ఫ్లాష్ కార్డులు: ఉపాధ్యాయుడు కార్డు సైజు అట్టలపై అందంగా అక్షరాలు రాసుకోవాలి. రంగుల స్కెచ్ పెన్నులు ఉపయోగించడం మంచిది. అచ్చువి లభించేటట్లయితే వాటిని ఉపయోగించుకోవచ్చు. ఇవి కనీసం 4 సెట్లు వుండాలి. ఏరోజు ఏ అక్షరాలు పరిచయం చెయ్యాలనుకొంటున్నామో అవీ, ముందు రోజులలో నేర్చుకున్న అక్షరాలు ఉపయోగించుకోవాలి. వీటిని విద్యార్థులకు గూడ ఇవ్వవచ్చు. వీటితో పదాలు కూర్చవచ్చు. వీటిని చదవడానికి మాత్రమే ఉపయోగించాలి. వీటిద్వారా అక్షరాలు రాయడం నేర్పకూడదు. ఫ్లాష్ కార్డులద్వారా తల్లిదండ్రులు పిల్లలకు తేలికగా చదవడం నేర్పవచ్చు.

3) వార్తా పత్రికలు, కరపత్రాలు, పుస్తకాలు ఇంకా ఏవైనా పెద్ద అక్షరాలతో వ్రాసినవి వాడుకోవచ్చు. చదివే అలవాటు పిల్లలకు నేర్పండి.

**3.మాటల కూర్పు ఆట:**

ఒక పేక దస్తా తయారు చేసుకోవాలి. దీనిని ఉపాధ్యాయుడు తయారు చేసుకోవాలి. సుమారు 4×4 సెంమీ॥ తెల్లని కార్డులపై అచ్చులు, తలకట్టుగల హల్లులు రంగురంగు స్కెచ్ పెన్నులతో అందంగా రాసుకోవాలి. మరియు సున్న(ం) , విసర్గ(ః) గూడ వున్న అట్టముక్కలు గూడ రాసుకోవాలి. ఇటువంటివి 4 సెట్లు (దస్తాలు) తయారు చేసుకోవాలి. గుణింతాలు లేని అక్షరాలతోనే అట్ట ముక్కలు తయారు చేసుకోవాలి. గుణింతాలు లేని పదాలు చాలా వున్నాయి. గుణింతాలతో కూడిన హల్లులతో సెట్‌లు తయారు చేసుకోవడం ఆచరణసాధ్యం కాదు. ఉపాధ్యాయుడు తాను చెప్పిన అక్షరాలను మాత్రమే ఉపయోగించాలి. ఒకరోజు 4 అక్షరాలు చెప్తే ఆ అక్షరాల సెట్లు మాత్రమే పిల్లకు యిచ్చి ఆడించాలి. మరునాడు మరి 4 అక్షరాలు చెప్తే మొత్తం 8 అక్షరాలు సెట్లు యివ్వాలి. ఒక్కొక్క సెట్‌లో ఒకే రకమైన 4 అక్షరాలు వుంటాయి. ఆడేవారి సంఖ్య పెరిగితే సెట్లులోని అక్షరాల సంఖ్య గూడ పెరుగుతుంది. ఈ పేక దస్తాలను ఉపయోగించి పిల్లల చేత మాటల కూర్పు ఆట ఆడించవచ్చు. ఆడిరచి చూడండి పిల్లల పద సంపదను చూసి ఆశ్చర్యపోతారు. పెద్దవారు కూడ పిల్లలతో ఆడవచ్చు. ఎవరు గెలుస్తారో చేప్పలేం.

**ఆడేవిధానం:**

ఈ ఆట ఆడడానికి చదవడం వస్తే చాలు. 8 అక్షరాలు వచ్చిన తరువాత ఇద్దరు పిల్లలు ఆడుతున్నారనుకొందాం. 8×4=32 ముక్కలుబాగా కలిపి, ఒక్కొక్కరికి ఒక్కొక్కటి మధ్యలో ఒకటి చొప్పున 4 పంచాలి. 12 పోగా దస్తాలో 20 మిగులుతాయి. దస్తాతిరగేసి వుంటుంది. ఆటగాళ్ళు తమ ముక్కలను మూసి వుంచవలసి పనిలేదు. దస్తానుండి ఒక ముక్కతీసి తమ వద్దనున్న ముక్కతో పదం తయారుచెయ్యాలి. తమ దగ్గర ముక్క తగ్గితే మళ్ళీ దస్తానుండి ముక్క తీసుకోవచ్చు. ఆటగాని వద్ద ఎప్పుడూ 4 ముక్కలు వుండాలి. ఈ ఆటను ఇంకొక విధంగా గూడ ఆడవచ్చు. నలుగురు ఆడుతుంటే మధ్యలో 12 ముక్కలు వేయాలి. దస్తానుండి ఒక ముక్క తీసుకొని దానితో మధ్యలో ఉన్న ముక్కలతో కలిపి ఒక పదం తయారు చెయ్యాలి. మధ్యలోనుండి ఎన్ని ముక్కలైనా తీసుకోవచ్చు. పదం చెయ్యలేకపోతే ముక్క వదిలేయాలి. ఈ ఆటను యిలాగే ఆడాలని లేదు. మీరు మార్చుకోవచ్చు. ఆట పూర్తయిన తరువాత ఒక్కొక్కరు ఎన్ని మాటలు కూర్చారో లెక్కవేయడమేకాదు, ఆమాటలను ఉపాధ్యాయుడు రికార్డు చేసుకోవాలి. ఉపాధ్యాయుడు విద్యార్థిపేరుతో ఒక ఖాతా తెరిచి అందులో ఆ పిల్లవాని పదసంపద జమచెయ్యాలి. దీనివలన ఎవరివద్ద ఎంత పెద్ద మాటలమూట వుందో, ఎవరుగొప్ప పదవంతులో తెలుస్తుంది.

4

(ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు చదువు నేర్పడానికి గూడ ఈ పాఠాలు వినియోగించుకోవచ్చు. ఉపాధ్యాయుడే బోర్డుమీద రాయాలి. ఇంట్లో పెద్దవారు పిల్లలకు చదువు చెప్పాలనుకుంటే పలక బలపం వాడవచ్చు. ఫ్లాష్ కార్డులు గూడ ఉపయోగించుకోవచ్చు.)

ఒకటవ తరగతిలో రాత నేర్పుతారు కాబట్టి రాతకు సులువుగా ఉండే అక్షరాలు ముందుగా పరిచయం చేస్తాను.

**మాదిరి పాఠం - 1**

1. ఇంతవరకు నేర్చుకొన్న అక్షరాలు - 0
2. ఇంతవరకు చదువుకొన్న మాటలు - 0
3. ఈ పాఠంలో నేర్చుకోవలసిన కొత్త గుర్తులు -2 (వీటిని ఉపాధ్యాయుడే బోర్డుపై రాసి వివరించాలి)

1.సున్న :ం 2. తలకట్టు ( ˇ ) ( ఇవి అక్షరాలు కావు.

గుర్తులు)

4. ఈ పాఠంలో చదవవలసిన కొత్త మాటలు - లేవు.

5. ఈ పాఠంలో చదవవలసిన కొత్త వాక్యాలు - లేవు.

మాదిరి పాఠం - 2

1. ఇంత వరకు నేర్చుకొన్న అక్షరాలు (గుర్తులు) - 2

2. ఇంత వరకు చదువుకొన్న మాటలు - 0

3. ఈ పాఠంలో నేర్చుకోవలసిన కొత్త అక్షరాలు - 3

(1. ర 2. ఎ 3 వ నేర్పడం

1. ర 2. ఎ 3. వ )

4. ఈ పాఠంలో చదవవలసిన కొత్త మాటలు -3

ఎర, వర, వరం

సూచన:సున్న ధ్వనిని వివరించాలి

5. ఈ పాఠంలో చదవవలసిన కొత్త వాక్యాలు - 1. ఎవరం?

సూచన: ప్రశ్నార్థకం గుర్తు, (?) స్వరం వివరించాలి, శిక్షణ అవసరం

మాదిరి పాఠం - 3

1. ఇంతవరకు నేర్చుకొన్న అక్షరాలు, (గుర్తులు) - 5 (ఎ, ర, వ, ం, ?)

2. ఇంతవరకు చదువుకొన్న పదాలు, వాక్యాలు -3 ( ఎర, వర, వరం, ఎవరం ? )

3. ఈ పాఠంలో నేర్చుకోవలసిన కొత్త అక్షరాలు-2 ( వీటిని ఉపాధ్యాయుడే బోర్డుపై రాసి వివరించాలి)

ఏ, ప

4. ఈ పాఠంలో చదవవలసిన కొత్త మాటలు-4

రంపం, పంపర, పరపర, పరంపర

5. ఈ పాఠంలో చదవవలసిన కొత్త వాక్యాలు -2

ఏ వరం? ఏ రంపం?

## గ్రంథాలయం



**మాట్లాడవలసింది, 'శ్రామికవర్గ అస్తిత్వం' గురించే! (14 వ్యాసాల సంపుటి)**

రచన : రంగనాయకమ్మ

పుటలు: 104, వెల :40/-

ప్రతులకు :అరుణా పబ్లిషింగ్‌హౌస్,

ఏలూరు రోడ్డు, విజయవాడ - 2

ఫోన్: 94406 30378



బ్రాహ్మణవాదంపై

**అంబేద్కర్ తిరుగుబాటు**

పుటలు: 600, వెల :338/-



**వ్యక్తిత్వ నిర్మాణం**

పుటలు: 696, వెల :600/-



**దళితుల చరిత్ర**

(7వ భాగం)

పుటలు: 327, వెల: 300/-



ఆధునిక భారతం

**అంబేద్కర్ చూపు**

పుటలు: 415; వెల: 800/-

రచయిత: కత్తి పద్మారావు

ప్రతులకు: లోకాయత ప్రచురణలు, లుంబినీవనం, అంబేద్కర్ కాలనీ, పొన్నూరు-522 124, గుంటూరు జిల్లా, సెల్: 98497 41695

కవిత

## పొలిమేర ఆవల

రెక్కేదో తెగిన పక్షిలా
ఈకలు రాలిన రెక్కలా
ఎక్కెడెక్కడో తచ్చాడుతోంది
గొప్పల కుప్పలా మాటల
మాలలల్లుకుంటున్న మాపు
కళ్లల్లో దిగబడ్డ చూపుడు వేలైంది
అదో గతితప్పిన యానం
విసిరేయబడ్డ శకలంలా
ముక్కలు ముక్కలుగా
ఉప్పుచారికలై చెక్కిలిపై
చెక్కబడ్డ రేయి
సుతారంగా ఒంటరితనాన్ని
పులిమిన కాలఘోష

అలలకు చిక్కుబడిన
ఎండిన చూపు
ఎవరికెవరో, ఎవరినొదిలెవరో
ఎవరి కొరకో, ఏ వైపుకో
ఎండుటాకులు
నేలపై చెల్లాచెదరయ్యాయి
పొలిమేర దాటిన పొలికేక
ఏ కన్నీరు తాగి సేదతీరిందో
ఏ ఆనవాలు విడిది చేయాలని
అడవులు గుడులయ్యాయో
ఏ అక్షరాలపై నమ్మకం
అతుకుల తోరణమై వేలాడుతోందో
ఏ చుక్కాని మిణుకుమిణుకుమంటున్న
ఆశాదీపం వెలిగించిందో

రెండు జీవితాల నడుమ
శతాబ్దాల నిశ్శబ్ద వంతెన
తరాల అంతరాల మధ్య
గడ్డకట్టిన సెలయేటి పాట
అగాధమై శిథిలమై, శిలాజమై!
ఇప్పుడున్నవి అక్కడ అన్నీ అవశేషాలే
ఇప్పుడు మిగిలున్నవి ఆఖరి పదాలే
ఏ దిక్కులూ వినలేని
అశక్త ఆలాపనలే
తెగిన తెలుగు గాలిపటాల
చివరి పిలుపులే!!

కరణం కళ్యాణకృష్ణకుమార్
9848428978

సి.వి.క్రిష్ణయ్య
93965 14554



# ఎవరు తెలివి గలవారు?! 3

**జరిగిన కథ:**

రాజుగారైన సింహం ఎవరు తెలివి గలవారో తెలుసుకొని రమ్మని అడవి జనాలకు చెప్పింది. ప్రపంచమంతా తిరిగి చూసి జంతు పక్షిజనాలు మనుషులు తెలివి గలవారేగానీ అతని తెలివితేటలకంటే బుద్ధిహీనత దుర్మార్గాలు ఎక్కువని దీనికి కారణం మనుషులు ఏర్పాటు చేసుకొన్న బడి ఆ బడిలో చదువులేనని తేల్చిచెప్పారు. అలాంటి బడిమీద ఆశకల్గింది జంతుజనాలకు పక్షిజనాలకు. మనుషుల నుండి పారిపోయి వచ్చిన చదువుకున్న కోతి సహాయంతో ఆడవిలో బడిపెట్టుకొన్నారు. తర్వాత కథ చదవండి

## బడి కష్టాలు

స్వేచ్ఛగా ఇంతకాలం తిరిగిన పిల్లలు బడిలో కదలకుండా కూర్చోలేక పోతున్నారు. పిల్లల్ని నిశ్శబ్దంగా కదలకుండా కూర్చుండబెట్టలేక ఉపాధ్యాయులు, హెడ్మాష్టరు పిల్లల్ని భయపెట్టి వీపులు పగలగొట్టి తమ అదుపులోకి తెచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నారు. సాయింకాలం ఇంటికి వచ్చిన పిల్లల ఒంటిమీద వాతలు చూసి తల్లిపక్షులు తల్లి జంతువులు కన్నీళ్లు పెట్టుకొని బాధపడుతున్నారు.

నాలుగు రోజుల తరువాత తల్లులంతా పిల్లల్ని తీసుకొని బడికి బయలుదేరారు. పిల్లలు మేమురామంటూ గోలచేసారు. తల్లులు బ్రతిమలాడి తినడానికి పండ్లూ కాయలు ఇచ్చి పిల్లల్ని ఎలాగో కష్టపడి బడికి తీసుకొని వచ్చారు. కాని విక్కీ మాగీలు ఎవ్వరికీ తెలియకుండా ఒక పెద్ద చెట్టుతొర్రలో దాక్కున్నారు.

బడిలో ఉపాధ్యాయులంతా పిల్లల కోసం ఎదురుచూస్తున్నారు. పెంపుడు కోతికూడా బడిలోనే ఉంది. తల్లులంతా కట్టగట్టుకొని రావడంతో ఉపాధ్యాయులు భయపడ్డారు.

"పిల్లలవంటి మీద వాతలు చూడండి పైన తోలుకూడా చిట్లిపోయింది. ఇలాగేనా కొట్టేది. పిల్లలు బడి అంటే భయపడిపోతున్నారు. నాలుగురోజులకే ఇలా ఉంటే బడి ఎలా కొనసాగుతుంది" అని నక్కతల్లి కోప్పడింది.

కోతి తల్లుల్ని సముదాయించడానికి ప్రయత్నించింది. "తెలివితేటలు సంపాదించడం సామాన్యమైన విషయంగాదు. మొదట ఇలాగే ఉంటుంది. స్వేచ్ఛగా ఆటలాడుకొనే పిల్లలు గదా? కదలకుండా కూర్చోబెట్టడం పెద్దపని. బడిపెట్టిన మొదటిరోజుల్లో మనుషుల పిల్లలు కూడా ఇలాగే ఉండేవారట. చింతబెత్తాలు, పేము బెత్తాలతో వీపులు పగలగొట్టేవారట. పైన వేలాడదీసి కింద మంట బెట్టేవారు. గోడకుర్చీలు వేయించేవారు. వందల కొద్దీ గుంజీలు తీయించేవారు. కాళ్లు చేతులు కట్టివేసి ఎండలో నిలబెట్టేవారు. ఇలా భయపెట్టి కొట్టి ఎట్టకేలకు లొంగతీసుకొనేవారు. అలా క్రమంగా స్వంతంగా ఆలోచించడమాని మనం చెప్పినట్టువింటారు. ఇలాగే మనుషులు గొప్పవాళ్లు అయ్యారు" అని వివరంగా చెప్పింది పెంపుడుకోతి.

ఈ మాటలకు తల్లులు భయపడ్డారు. "మనుషుల పిల్లలు ఇంత హింస ఎలా భరిస్తున్నారు? తల్లితండ్రులు ఎలా ఒప్పుకొంటున్నారు. పసితనంలో ఇంత హింస అనుభవించినవారు పెరిగి పెద్దవారైనపుడు అంతకు అంత తీర్చుకోరా. ఊరుకుంటారా? ఇందుకేనేమో మనుషులు ఇంత చెడ్డవాళ్లుగా మారింది" అంటూ వాపోయింది తల్లికుందేలు.

జింకతల్లి తన బిడ్డను ముద్దుపెట్టుకొన్నది "ఇంత హింసించి ఈ చదువులు చెప్పించకపోతే ఏమవుతుంది" అన్నది జింకతల్లి.

నిజమే. నిజమేనంటూ మిగిలిన వారంతా వంతపాడారు. కాని తల్లి సింహం గట్టిగా అరిచింది. "మీ పిరికి మాటలు కట్టిపెట్టండి" పిల్లల్ని ఎలాగో దారిలో పెట్టి చదువు నేర్పండి, వీళ్ల మాటలు పట్టించుకోవద్దు అంటూ ఉపాధ్యాయులకు భరోసా ఇచ్చింది తల్లి సింహం.

ఇంటికి వస్తూ జింకతల్లి కుందేలుఅమ్మతో అన్నది 'చెల్లీ! ఈ బడి ఏమిటి? చదువలేమిటి? నాకు అంతుబట్టకుండా ఉంది. ఈ టీచర్లకు మనకంటే ఎక్కువ ఏమి తెలిసి ఉంటుంది. మెదడుతో చేసే పనికి శరీరాన్ని దండిస్తే ఏమి లాభం! సంతోషంగా ఉల్లాసంగా ఉంటేనే కదా పిల్లలు బాగా నేర్చుకొంటారు? కొట్టి భయపెడితే ఎలా నేర్చుకొంటారు? మనుషులకు ఈమాత్రం కూడా తెలియదంటావా? అని అడిగింది జింకతల్లి.

" ఆ చదువేదో మనమే నేర్చుకొని హాయిగా పిల్లలకు మనమే నేర్పించుకుంటే బాగుంటుందికదా! హాయిగా ఆడుతూ పాడుతూ పనిచేసుకొంటూ నేర్పించవచ్చు" అని అన్నది కుందేలు.

ఆరోజు చిలకమ్మ చెప్పిన మాటలు విని ఉంటే సరిపోయేది. చూద్దాం ఏమిజరుగుతుందో అనుకొంటూ ఇండ్లకు చేరుకున్నారు.

ఒకప్పుడు అడవి అంతా తామే అన్నట్లు ఎంతో ఉత్సాహంగా తిరిగిన విక్కీమాగీలు బడి పుణ్యమా అని కనబడటమే లేదు. తల్లిదండ్రులు ఇతర జనాలు వెదికి విక్కీ మాగీలను పట్టుకుని



బలవంతంగా బడిలో వదిలారు. ఉపాధ్యాయులు రోజంతా రకరకాల శిక్షలు వేసి బడి అంటే మరింతగా భయపడేట్లు చేసారు. సాయంకాలం మాగీ ఒక్కటే ఇంటికి వచ్చింది. విక్కీ తప్పించుకుని దూరంగా పారిపొయ్యాడు.

ఎట్టకేలకు బడిలో చదువులు ప్రారంభమయ్యాయి.

పెంపుడు కోతి వచ్చి ''ఈ రోజు నుంచి పాఠాలు మొదలవుతాయి. పిల్లలంతా శ్రద్ధగా నేర్చుకోవాలి. ఆనందోబ్రహ్మ అన్నారు. జీవితానికి పరమార్థం ఆనందంగా ఉండడమే. అందుకని ఆరోగ్యాన్ని ఆనందాన్ని ఇచ్చే నాట్యం సంగీతాలతో మన చదువులు మొదలవుతాయి. మీకు ఇష్టమేనా అని అడిగింది. పిల్లలంతా ఉత్సాహంగా ఇష్టమే ఇష్టమే అంటూ ముకుమ్మడిగా అరిచారు.

నెమలి వచ్చి పురివిప్పింది. రంగురంగుల తన ఈకలను రకరకాలుగా కదిలించింది. ముందుకు వెనక్కు అడుగులువేస్తూనాట్యం చేసింది. నాట్యం చూసి పిల్లలంతా కేరింతలు కొట్టారు.

నెమలి నాట్యంయొక్క గొప్పతనం గురించి అరగంట వివరించింది. పిల్లలకు ఏమీ అర్థంగాలేదు. విసుగు పుట్టింది ఆవులింతలు మొదలయ్యాయి. లేచి పారిపోతే ఉపాధ్యాయులు కొడతారని అలగే కూర్చుని పరధ్యానంలోకి వెళ్లిపొయ్యారు. నెమలి పాఠం ఆపి మంచినీళ్లు తాగింది. మాట్లడుతున్నప్పుడు పరధ్యానంలోకి వెళ్లిన పిల్లలంతా శబ్దం ఆగిపోగానే ఉలిక్కిపడి మనలోకంలోకి వచ్చారు.

నెమలి పురివిప్పి గుండ్రంగా తిరిగింది. నా మాదిరి మీరు కూడా చేయండి అని చెప్పింది.

మాగీలేచి నిలబడింది. మీకు అందమైన ఈకలు ఉన్నాయి. పురివిప్పి నాట్యం చేయగలరు. మాకు ఈకలు లేవు గదా! మేమెలా నాట్యం చేయగలం అని అడిగింది.

ఈకలు లేకపోతేనేమి కాళ్లు కదిలించండి అని గట్టిగా అరిచింది నెమలి. పిల్లపక్షులు పిల్లజంతువులు ఎంత ప్రయత్నించినా నెమలిలా కాళ్లు కదలించలేకపోయాయి. చివరకు నెమలిపిల్లకు కూడా సాధ్యం కాలేదు. సింహంపిల్ల నాకు నాట్యం రాదు అంది. అవును మాకు నాట్యం రాదు అంటూ పక్షిపిల్లలు పిల్లజంతువులు అరిచాయి. ఆ అరువులు విని హెడ్మాష్టరు ఏనుగుగారు పరుగెత్తుకొంటూ వచ్చారు. “అలా అరవకూడదు. ఏదీ వెంటనే రాదు. ఒక విద్య నేర్చుకోడానికి సంవత్సరాలు పడుతుంది. భయపడకూడదు అంటూ ధైర్యం చెప్పింది.

ఇంతలో ఒంటెపిల్ల లేచింది “మాస్టారు గారిలా నా కాళ్లు కూడా పొడవు. నేను నాట్యం చేస్తాను అంటూ కాళ్లు అటూ ఇటూ వేగంగా కదిలించింది. మిగిలిన పిల్లలంతా చప్పట్లు కొడుతూ పెద్దగా అరిచారు. పిల్లఒంటెకు ఉత్సాహం ఎక్కువైంది. కాలు వేగంగా కదిలించింది. ఆ వేగానికి తూలి నేలమీద పడిపోయింది. కాలు బెణికింది. లేవలేకపోయింది. పిల్లలంతా భయపడ్డారు. హెడ్మాష్టరు గారు తొండంతో ఎత్తి నిలబెట్టింది. పిల్లఒంటె నిలబడలేక పడిపోయింది.

“ఇలాంటివి జరుగుతూ ఉంటాయి భయపడకూడదు. అని చెప్పి ఒంటెపిల్లను కదలకుండా ఒక పక్కన కూర్చుండపెట్టింది.

నాట్యం కొంచెం కష్టం. పాటలు ఎంతో మధురంగా ఉంటాయి. ఇప్పుడు సంగీతం నేర్చుకోండి అంటూ సంగీతం మాష్టారు గండు కోకిల గారిని పిల్చారు హెడ్మాష్టరుగారు.

సంగీతం మాస్టారు వచ్చి “ముందుగా సంగీతం గొప్పతనం

గురించి అరగంటసేపు చెప్పారు. ఈ విషయాలు పిల్లలకు అర్థంకాలేదు. విసుగుపుట్టింది. కొందరికి ఆవలింతలు వచ్చాయి. కొంతమంది తూగారు. పులి సింహం పిల్లలైతే గుర్రుపెట్టి నిద్రపోయారు.

మొదటిరోజు పాఠం 'సరిగమలు' చెప్పారు. పిల్లల చేత సరిగమలు పలికించారు. పిల్లలంతా సరిగమ అంటూ గొంతెత్తి అరిచారు. ఆ ప్రాంతమంతా ఒక విచిత్రమైన శబ్దంతో ప్రతిధ్వనించింది. గుర్రుపెట్టి నిద్రపోతున్న సింహం పులిపిల్లలు దడుసుకొని నిద్రమేలుకొని పరుగుదీసాయి. ఏదైనా ప్రమాదం జరిగిందేమోనని తల్లితండ్రులు పరుగెత్తుకొంటూ బడి దగ్గరకొచ్చారు. అది సంగీతమని తెలిసి నవ్వుకొంటూ వెళ్లారు.

మరో నాలుగురోజుల్లో ఉపాధ్యాయులంతా తమ పాఠాలు మొదలుపెట్టారు. పిల్లలకు ఒక్కటీ అర్థంగావడంలేదు. పాఠాలు వినలేక కంఠత పెట్టలేక అర్థంగాక పిచ్చిపట్టినట్లైంది. ఆటల్లేవు. మాటల్లేవు. తల్లులంతా బలవంతంగా పిల్లల్ని ఈడ్చుకొని వచ్చి బడిలో వదిలివెళుతున్నారు. పిల్లల ఒంటిమీద దెబ్బలు పులిచారల్లా వాతలు పడుతున్నాయి.

పిల్లల పరిస్థితులు ఇలా ఉంటే తల్లుల పరిస్థితి మరో రకంగా ఉంది. బోలెడంత తీరిక దొరికింది కదా! మనుషుల దగ్గర పెరిగిన పెంపుడు జంతువులు, పెంపుడు పక్షులు మనుషుల గురించి వింతలు విడ్డూరాలు చెబుతూ ఉంటే వింటూ కాలక్షేపం చేయడం అలవాటయింది.

కబుర్లు ఎక్కువై ఇక్కడ సంగతుల అక్కడ, అక్కడి సంగతులు ఇక్కడ చెప్పి తగువులు పెట్టి తమాషాలు చూసే అమ్మలక్కలు తయారయ్యారు. ఒక రోజు కాకికీ కోకిలకూ తగువుపడింది.

కాకి గొంతు కర్ణకఠోరంగా ఉంటుందనీ కాకి గోల భరించడం కష్టమనీ కోకిల అన్నట్లు కాకి చెవిన పడింది. కాకి కోపంతో ఊగిపోయింది. "ఒసే కోకిలా! నీది కూడా ఒక బ్రతుకేనా? నీకు ఒక ఇల్లంటూ ఉందా? ఎప్పుడైనా బిడ్డల్ని పెంచావా? నీదంతా దొంగ బతుకు. పసిబిడ్డల్ని పెంచడం చేతగాక పరాయి గూట్లో గుడ్లు పెట్టి లల్లాయి పాటలు పాడుకుంటూ తిరుగుతావు. అలాంటి నువ్వు నన్ను వేలెత్తి చూపిస్తున్నావ్. నీకెన్ని గుండెలు. నీ బిడ్డలు ఎంత దుర్మార్గులో చెప్పాలా, నీ పిల్ల గుడ్డులోంచి బయటకు రాగానే మా గుడ్లను పిల్లల్ని గూట్లోనుంచి బయటకు తోసేస్తుంది మేము తెచ్చిన తిండి ఒక్కటే మింగుతుంది. మేము మా బిడ్డలేగాదా అనే భ్రమలో ఉంటాం. పెద్దదై ఈకలు వచ్చి ఎగిరిపోయేదాకా అర్థంగాదు. మీలాంటి సోమరిపోతులు ఇతరుల కష్టంమీద ఆధారపడి బ్రతికేవాళ్లు మనుషుల్లో ఉంటారు. మాలో ఎవరికి కష్టమొచ్చినా అంతా ఒక్కటై అరుస్తాం. గోలచేస్తాం. మమ్మల్ని మేము కాపాడుకొంటాం. ఇదికూడా తప్పేనా అంటూ" కాకి బాధపడింది.

మరీ అంత నోరు పారేసుకోకు. చనిపోయిన మనుషులకు పెట్టే పిండాకూడు తిని బ్రతికే మీదీ ఒక బ్రతుకేనా? మీరు నోరు తెరిస్తే మనుషులు చెవులు మూసుకొంటారు. మేము గొంతెత్తి పాడగానే మనుషులు మాతో గొంతు కలిపిపాడతారు. మా పాటలకు చెట్లు చిగురిస్తాయి. అని గొప్పలు పోయింది కోకిల.

కూతలు కూసే మీకు ఏమి తెలుసే ప్రాణుల్లో ఉండే పరమార్థం. మనుషులు చనిపోయిన తమ తాతలతండ్రుల ఆత్మలు తృప్తి పరచడానికి వారికి ఇష్టమైన రుచికరమైన పదార్థాలు వండి పెడతారు. మమ్మల్ని పిలిచి తినమంటారు. వారు పెట్టినవి తిని వారిని తృప్తి పరుస్తాం. మేము తినకపోతే వారు పడే బాధ వర్ణనాతీతం. ఎదుటివారి గొప్పతనం తెలుసుకోలేని మీ అజ్ఞానానికి జాలిపడుతున్నాను" అని కాకి బాధగా అన్నది. కాకి మాటలు విన్న అమ్మలక్కలంతా నిజమే నిజమేనంటూ అరిచారు. కోకిలను మందలించారు. కోకిల తలదించుకొని తప్పయిపోయిందక్కా అంటూ గుడ్లనిండా నీరు నింపుకొంది. "ఇంకచాలు పదండి" అంటూ అడవి కోడి అరిచింది. అందరూ ఎవరి ఇండ్లకు వారు వెళ్లిపోయారు.

మరోరోజు గబ్బిలానికి గుడ్లగూబకి తగువు పడింది. మాటల సందర్భంలో గుడ్లగూబ గబ్బిలం గురించి నక్కను అడిగిన ప్రశ్న తగువుకు కారణమయింది. "గబ్బిలం జంతువులా పిల్లల్ని కని పాలిస్తుంది. పక్షిలా రెక్కలతో ఎగురుతుంది. ఇంతకూ గబ్బిలానిది ఏ జాతి? అని ప్రశ్నించింది.

ఈ మాటలు విన్న గబ్బిలానికి కోపం వచ్చింది. ఇంతకూ తమది ఏజాతి? పక్షులన్నీ పగలు తిరుగుతాయి. తమరు విషపురుగుల్లా క్రూరమృగాల్లా రాత్రులు చీకట్లో తిరుగుతారు అని దెప్పిపొడిచింది గబ్బిలం.

నువ్వుకూడా రాత్రుళ్లేగదా తిరుగుతావు. నన్ను తప్పుపట్టడం ఎందుకు? నా కండ్లకు రాత్రులు చూడగలిగే శక్తి ఉంది. చీకటిని సైతం చీల్చుకొంటూ వెళ్లగలను. నిన్ను గురించి అందరికీ సందేహమే. అసలు నీకు కళ్లు కూడా లేవటగదా! అందుకనే కళ్లు లేని కబోది అని లోకంలో ఒక నానుడి ఉంది అన్నది గడ్లగూబ.

గబ్బిలానికి కోపం వచ్చింది. ఎన్నిసార్లు చెప్పాలి నాజాతి గురించి. నేను జంతువుని. అసలు నీకో విషయం తెలుసా? పక్షులన్నీ ఒకప్పుడు జంతువులేనని తెలుసుకో. అందరం మొదట పుట్టింది నీటిలోనే. నువ్వు కూడా ఒకప్పుడు జంతువివే. మనుషుల్ని గురించి కళ్లులేని కబోది అనేమాట కూడా నిజమే. నీమాదిరి నాకళ్లు చూడలేవు. చూడలేకపోయినా ఎక్కడ ఏ వస్తువు ఎంత దూరంలో ఉందో అన్నీ నా మనోనేత్రం ద్వారా చూస్తుంటాను.

ఎలాగా? అంటూ ఆశ్చర్యంగా అడిగింది గుడ్లగూబ "నా నోరు చెవులు ఇందుకు ఉపయోగిస్తాను. నోటితో శబ్దం చేస్తాను. ఆ శబ్దతరంగాలు నాచుట్టు పక్కలున్న ప్రదేశాలకు వెళ్లి తిరిగివస్తాయి. ఆ తిరిగివచ్చిన తరంగాల వలన ఏ వస్తువు ఎంత దూరంలో ఉందో నాచెవులకు తెలిసిపోతుంది. నా ఈ శక్తిని చూసే మనుషులు రాడార్ అనే యంత్రాన్ని కనుగొన్నారు. అందుకనే నిశబ్దంగా ఉండే రాత్రుళ్లు తిరుగుతాను. ఆ సమయంలో వేరే శబ్దాలు ప్రతిధ్వనులు లేకుండా ఉంటాయి. నా పని సులువు అవుతుంది అని వివరంగా చెప్పింది గబ్బిలం. సరేసరే ఈ రోజుకు కబుర్లు కట్టిపెట్టి ఇండ్లకు పదండి. తీరిక సమయాల్లో తగువులాటలు మొదలయ్యాయి. రేపు కొట్టుకొంటారేమో అంటూ పెంపుడు కుక్క వెటకారంగా అన్నది. హాయిగా పిల్లల్ని వెంటబెట్టుకొని అడవంతా తిరుగుతూ ఆనందంగా ఉండేవాళ్లం. బడిలో పిల్లలూ బయట మనమందరమూ బాధితులమే. ఇదంతా బడి మహత్యమేనంటూ నిట్టూర్పు విడిచింది కొమ్ముల జింక.

వచ్చే సంచికలో : తల్లిదండ్రులకు తలనొప్పులు

డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# అడుగంటిపోతున్న అమ్మనుడి – నిర్జీవంగా మారుతున్న మాతృభాష

**వ్య**వసాయం, పశుపాలన అభివృద్ధికి పునాదులు. నరమానవుడు వేలయేళ్ళుగా శ్రమించి జంతువులను మచ్చిక చేసుకున్నాడు. విత్తనాలు తయారు చేసుకున్నాడు. ఋతువులు గమనించాడు. కార్తెలలోకి మార్చుకున్నాడు. ఇళ్ళు, బట్టలు కట్టుకున్నాడు. నోటిమాటగా, పాటగా, వృత్తిగా, తంతుగా తరతరాలకు ఈ జ్ఞానం అందిస్తూ వచ్చాడు.

'వ్యవసాయ విజ్ఞానం అమ్మనుడి/ జానపదంలో కలికితురాయి. వ్యవసాయం వాతావరణానికి, ప్రాంతానికి సంబంధించి వేరు వేరుగా ఉంటుంది.

**కార్తెలు;** ఆరుద్రలో అడ్డెడు చల్లితే, పునాసకు పుట్టెడు పండుతుంది. పుబ్బలో చల్లే దానికంటే దిబ్బలో చల్లింది మేలు. చిత్తలో చల్లితే చిట్టెడుకాపు. ఆరుద్ర కార్తె విత్తనానికి అన్నం పెట్టిన ఇంటికి సేగిలేదు. అనురాధ కార్తెలో వర్షానికి అనాధ కొమ్మయినా ఈనుతుంది. అశ్విని కురిస్తే అంతా నష్టం. ఆరుద్ర వాన – అదనువాన. కత్తెరలో వాన కనకపు పంట. సవతి వర్షం చేనుకు హర్షం. మూల ముంచును. జ్యేష్ఠ చెరుచును.

తొలకరివాన మొలకలుకులకు తల్లి. తూనీగ లాడితే తూమెడు వర్షం. పంట కాల్వ నీరు అన్ని పైర్లకు మేలు.

**దుక్కి;** దుక్కి ఉంటె దిక్కు ఉంది. పత్తికి పది చాళ్ళు. జొన్నకు ఏడు. నువ్వులకు ఏడు, ఉలవకు ఒకటి దుక్కులు. ఎరువుకన్నా, గొర్రెలమంద కన్నా, లోతయిన దుక్కి మేలు.

**ఎరువు;** గొర్రెల పెంట ఏడాది. ఆవుల పేడ ఆరేండ్లు, పుట్టమన్ను ఎరువైతే పుట్ల కొద్దీపంట. పూచిన తంగేడు, కాచిన వెంపలి వేసినా పండుతనన్నదట వరి.

**ఆహారం;** ఎండాకాలంలో వచ్చే ఉగాది, శ్రీరామనవమి రోజుల్లో ఉగాది పచ్చడి, పానకం, చల్లని మజ్జిగ, వడపప్పు లాంటి తేలికగా జీర్ణమయ్యే పదార్థాలు తీసుకుంటాం. చలికాలంలో తీపి ఎక్కువగా వాడుతుంటాం. సంక్రాంతి రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో గుమ్మడి అవిశాకు తప్పని సరిగా వాడితే, మునగ కూర, ములక్కాడ అసలు వాడరు. కాని కర్మ క్రియరోజున ఆ రెండూ ఖచ్చితంగా వాడతారు. వేపపూవు పచ్చడి అబ్దికాలలో చేసేవారు.

దుక్కులు దున్నటం వృధా అనుకుని ట్రాక్టర్లతో ఒకేసారి దున్ని వ్యవసాయం చేస్తున్నారు. వీటి ఫలితం రైతు పెట్టుబడికి ఆదాయానికి లంకె కుదరక పోవటమే' అని జరుగుతున్న నష్టాన్ని గూర్చి చెపుతూ.



ఒక నాడు 'వాన కురిస్తే 'అని మాత్రమే ఆకాశంవంక చూసాడు కాని, నేడు విత్తనాల దగ్గరనుండి ప్రతిదానికి ఆకాశం వంక చూడకతప్పటం లేదు' అని బాధపడతారు. (జానపద విజ్ఞాన సమాలోచన. ఆచార్య భక్తవత్సలరెడ్డి 1995). తెలుగు సామెతలను, మాండలిక పదకోశాన్ని, వ్యవసాయ వృత్తి పదకోశాన్ని సాహిత్య అకాడెమీ 1960లలోనే సేకరించి ప్రచురించింది. 'తెలుగు సామెతలలో జనజీవనం' (పాపిరెడ్డి నరసింహారెడ్డి. తెలుగు అకాడెమీ 2009) వంటి అధ్యయనాలు వస్తున్నాయి. ఇవన్నీ మన వ్యవసాయ సంప్రదాయంలో పటిష్టతతను నిరూపిస్తాయి.

**విధ్వంసం దిశగా 'అభివృద్ధి'**




విద్యుత్తు, పెట్రోలు, బొగ్గు, పెన్సిలిన్ రాకతో ఇంధనం, సేద్యం, వైద్యం మారింది. ఈ మార్పును సార్వత్రికవిద్య వేగిరపరిచింది. చదువుకున్న వాళ్ళ పెత్తనం పెరిగింది. పెరుగుట విరుగుట కొరకే అన్నట్లు రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం పొలాలను ఊషర క్షేత్రాలుగా మార్చింది. తల్లిపాలుకూడా విషపూరితమయ్యాయి

**దిద్దుబాటు చర్యలలో లోపించిన నుడికారం.**

సేంద్రియ వ్యవసాయం, శ్రీసాగు, జీరో బేస్డ్ నాచురల్ ఫార్మింగ్ /పెట్టుబడి లేని సహజవ్యవసాయం అంటూ, కొత్త సీసాలో పాతసారాలాగా, కొత్తచదువులతో దిద్దుబాటు మొదలైంది.

పాలేకర్, ధబోల్కర్– వగైరా మరాఠీ వ్యవసాయ శాస్త్రవేత్తలకు, వారి రాష్ట్రంలోకాక, మన రాష్ట్రంలో ఆదరణ పెరిగింది. వారి రాష్ట్రంలో ఆదరణ పెరిగితే, తప్పకుండా అక్కడి జనసామాన్యానికి చెప్పటానికి, తరతరాలుగా వాడుకలో ఉన్న వ్యవసాయ పద్ధతులలో ఉన్న పలుకుబడులను గుర్తు చేసేవారేమో !. అదే పద్ధతిలో ఇక్కడి పలుకుబడులను తెలుసుకుంటూ కలుపుకు

పోయేవారేమో!!

కాని వారు చదివింది తెల్లవాళ్ళ ఒరవడిలో నడిచే 'కాలేజీ'ల్లోనే.తమ అన్వేషణతో హరిత విప్లవం తెచ్చిన లోటుపాట్లను గమనించారు. ఆ శాస్త్ర పరిభాషలోనే దేశీయమైన పరిష్కారాలు బోధించసాగారు. వ్యవసాయంవైపు మళ్ళిన కొందరు డబ్బున్న, చదువుకున్నవాళ్ళు వాటిని పాటించసాగారు. నగరవాసం తెచ్చిన రోగాలకు విరుగుడుగా ఆ పంటలకు గిరాకీ పెరిగింది. క్రమంగా ప్రభుత్వ ఆదరణ దొరికింది. జీవామృతం(పేడ పానకం), ఘనామృతం(పేడలడ్డు), ఆగ్నేయాస్త్రం, నేమాస్త్రం ( మిరప, వేపకషాయం) ఇలా కొత్త పలుకుబడులు వాడుకలోకి వచ్చాయి. అటు వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వశాఖల విస్తరణ కార్యక్రమాలలో సంప్రదాయంగా వస్తున్న పదసంపద వాడకం తగ్గుతూ వస్తుంది. అనాదిగా వ్యవసాయం తెలిసినవారు కాబట్టి , రైతులు అర్థం చేసుకుని అమలు చేసుకుంటున్నారు. కొత్త పంచాంగాలకు అలవాటు పడుతున్నారు. క్రమంగా చాప చినిగి చదురైనట్లుగా సంప్రదాయంగా వస్తున్న జ్ఞానం నెమరుకు నోచుకోక సన్నగిల్ల సాగింది. అది ఎంతో కొంత జనంలో జీర్ణించి ఉండబట్టే ఈ దిద్దుబాటుచర్యలు ఎంతో కొంత సఫలమౌతున్నాయి. **మరో తరం, మరో సంక్షోభం తట్టుకోవాలంటే ఈ మూలధనం మిగిలేట్లు లేదు. సంస్కృతిని ముందుతరానికి అందించ వలసిన భాష, కేవలం మాట్లాడుకొనే పనిముట్టుగా నిర్జీవంగా మారిపోతుంది.**

భాషాభిమానులు, సంస్థలు తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇటీవలే నవీకరించిన 'తెలంగాణా పదకోశం' (తెలుగు విశ్వవిద్యాలయం), కొత్తగా 'చర్మకార పదకోశం' (తెలుగు అకాడెమీ) వచ్చాయి. కానీ ఈ పదసంపదలో కొంతైనా అధికారవర్గాల, ప్రచార సాధనాల, విస్తరణ కార్యక్రమాలలో భాగం కావాలి. అస్తిత్వ పోరాటం నుండి ఆవిర్భవించిన తెలంగాణాలో కూడా యాసంగి, పునాస వంటి పదాలుదాటి అడుగు ముందుకుపడటం లేదు.

**స్ఫూర్తి నిచ్చే గేయగాథలు; సత్తైవిత్తనాలు;**

స్వచ్ఛంద సంస్థ దెక్కన్ డెవలప్మెంట్




సొసైటీ, చిరు ధాన్యాల పాతపంటల పండుగలు చేసే మెతుకుసీమలోని పస్తపూర్ దగ్గర వికారాబాదులో బహురూపి కిష్టయ్య చెప్పిన, పర్వతాల మల్లారెడ్డి కథలలో 'వద్దు పెడితే సర్కారుకెల్లునయ్య-ఆకరి పంట మసాపురికొర్రకొడుక! మూడునెలలకు వస్తది కుమార ! మనము తినకుంటే అట్టెపాయె కొడుక!బీదసాదలు తింటరు' అంటూ విలువ/పరువు తక్కువ పంటలు వేయటానికి సంశయిస్తున్న కొడుకును తల్లి ప్రోత్సహిస్తుంది. కరువురోజుల్లో పేద ప్రజలను ఆదుకోవాలనే మల్లారెడ్డి సంకల్పానికి మెచ్చి పరమేశ్వరుడు చిరుధాన్యాల 'సత్తైవిత్తనాలు' అందిస్తాడు. (జానపద గేయాలు సాంఘిక చరిత్ర; రామరాజు, కృష్ణకుమారి. సాహిత్య అకాడెమీ 1976) బ్రహ్మారెడ్డి కథలో 'పాడు బడ్డ ర్యాగళ్ళలో, బీడు పడ్డ పొలాలలో అనుములు,తైదలు(రాగులు) ఎదబెట్టినారు.అనుములు గుడాలు చేసి తిన్నారు.తైదలు విసిరి అంబలి గాసి తాగారు ' అంటూ కథ సాగుతుంది.ఈ సమాజపు జ్ఞాపకాలను గుర్తుచేస్తే పాతపంటలు అందరి పండుగలౌతాయి.లేకపోతే ప్రాజెక్ట్ పండుగలుగా మిగిలిపోతాయి.

**తొలితరం శాస్త్రజ్ఞుల ఆకాంక్షలు;**

ఇటువంటి సదాశయాలను గుర్తుచేసే గాథలను 'the mythical symbolic component of knowledge' గా పేర్కొంటూ (Farmers First 1999. పుట 37), రైతుల జ్ఞానం పునాదిగా విస్తరణ కార్యక్రమాలు చేపట్టాలని నొక్కి చెప్పిన రాబర్ట్ చాంబర్స్, శాస్త్రీయ ప్యాకేజీలతో (scientized package) లతో సరిపెట్టడం సరికాదని సలహా ఇస్తాడు. అటువంటి పాటలు పాడుతుంటే 20 శాతం పని అదనంగా జరగడం Agriculture as performance వ్యాసంలో మరో పరిశోధకుడు వివరిస్తాడు (పుట 39).

రైతు బృందాలతో గ్రామాలలో తిరగడాన్ని 'సామూహిక భ్రమణం'గా పేర్కొంటూ వారితో కలిసి పర్యావరణసరిహద్దులలో, నేలలో రకాలు, వినియోగం, వాలు, శీతోష్ణపరిస్థితులు పటాలలో గీయటం; అనిల్ గుప్తా, యన్ కే సంఘి వగైరాలు ప్రచారం చేసారు(పుట 72).

జీవజాలవర్గీకరణంలో శాస్త్రవేత్తలు, ప్రజలు పాటించే విభిన్న పద్ధతులు, పటాలు గీయటం పాశ్చాత్యులు ఉత్తరం నుంచి మొదలు పెడితే, మనం తూర్పు నుండి మొదలు పెట్టటంవల్ల వచ్చే తబ్బిబ్బులు, శాస్త్రవేత్తలు నిర్లక్ష్యం చేసిన మసూరి వరి వంగడం,రైతులు వ్యాప్తిచేయటం ఉదహరిస్తూ, రైతుల ప్రయోగాలకు విలువనివ్వాలి అని చేసే హెచ్చరికలు, అప్పటిదాకా ఏకపక్షంగా సాగుతున్న training & visit కార్యక్రమాలు (శిక్షణ,సందర్శన ) touch & vanish (కనిపించటం–మాయమవటం) గా దిగజారిపోతున్న తరుణంలో, కొంత చురుకుపుట్టించినా, శాస్త్రజ్ఞుల దృక్పథంలో వచ్చిన మార్పేమీ లేదు. ప్రజల, శాస్త్రవేత్తల జ్ఞానంలో అంతరం కొనసాగుతూనే వస్తుంది.

**ఇప్పుడైనా ప్రకృతి వ్యవసాయం ప్రచారం చేసే శాస్త్రవేత్తలు కట్టే, కొట్టే, తెచ్చే పద్ధతి బదులు, ఎన్నోవిధాలుగా విస్తరించిన సంప్రదాయజ్ఞానంలో విషయాలకు విలువనివ్వాలి. భాషలో, నుడికారంలోగల ఈ వివరాలను జోడించటంవల్ల జ్ఞానంలో వచ్చే నిడివి, లోతు, ప్రాసంగికతను / సందర్భశుద్ధి చూపిస్తూ ఈ రంగంలోకి భాషాభిమానులు చొచ్చుకుపోవాలి.**

# రంగనాయకమ్మ రచనలు

| పుస్తకం పేరు | ధర |
|---|---|
| 1) అమ్మకి ఆదివారం లేదా? (50 కథలు కలిసిన సంపుటం) | 180 |
| 2) అంధకారం లో.. (నవల) | 50 |
| 3) అసమానత్వం నించీ అసమానత్వం లోకే; తులసి దళం కాదు గంజాయి దమ్ము; యగ్న్యం కథ మీద 2 వ్యాసాలు; ఈ చక్కని పాడి ఆవు ఎవరిది? ( 4 పుస్తకాలుకలిసిన సంపుటం) | 90 |
| 4) బలి పీఠం (నవల) | 60 |
| 5) చలం సాహిత్యం (వ్యాసాలు) | 40 |
| 6) చైనాలో ఏం జరుగుతోంది? (చార్లెస్ బెతల్ హాం పుస్తకానికి అనువాదం) | 50 |
| 7) చైనాలో సాంస్కృతిక విప్లవమూ, పరిశ్రమల నిర్వహణా (చార్లెస్ బెతల్ హాం పుస్తకానికి అనువాదం) | 50 |
| 8) కమ్యూనిస్టు పార్టీ ఎలా ఉండకూడదు? | 60 |
| 9) ఇదే, నా న్యాయం! (నవల) | 60 |
| 10) ఇంటి పనీ, బైటి పనీ | 40 |
| 11) కళ ఎందుకు? (నవల) | 50 |
| 12) కూలిన గోడలు (నవల) | 50 |
| 13) మానవ సమాజం (వ్యాసాలు) | 100 |
| 14) నీడతో యుద్ధం (నాస్తిక, హేతువాద, నవ్య మానవ వాదాల పై 3 పుస్తకాలు కలిసిన సంపుటం) | 50 |
| 15) రచయిత్రి (నవల) | 80 |
| 16) శాస్త్రీయ దృక్పథం; పాఠకుల ప్రశ్నలూ -రంగనాయకమ్మ జవాబులూ (2 పుస్తకాలు కలిసిన సంపుటం) | 60 |
| 17) స్పార్టకస్; టామ్ మామ ఇల్లు; స్వేచ్ఛా పథం (3 నవలా పరిచయాలు కలిసిన సంపుటం) | 80 |
| 18) స్త్రీ (నవల) | 40 |
| 19) స్వీట్ హోమ్ (నవల. 3 భాగాలూ కలిసిన సంపుటం) | 150 |
| 20) తెలుగు నేర్పడం ఎలా? | 70 |
| 21) వాడుక భాషే రాస్తున్నామా? | 40 |
| 22) మార్క్సిజమే తెలియక పోతే, పుట్టిన వాళ్ళం పుట్టినట్టే ఉంటాం! (వ్యాసాల సంపుటం) | 100 |
| 23) మార్క్సు ' కాపిటల్' పరిచయం -1 | 180 |
| 24) మార్క్సు ' కాపిటల్' పరిచయం -2 | 150 |
| 25) దళిత సమస్య పరిష్కారానికి బుద్ధుడు చాలడు, అంబేద్కరూ చాలడు, మార్క్సు కావాలి | 70 |
| 26) ఇంగ్లీషు కీకారణ్యం లోకి ప్రవేశించండి! (తెలుగు విద్యార్థులకు ఇంగ్లీషు గ్రామరు పాఠాలు) | 150 |
| 27) జానకి విముక్తి (నవల. 3 భాగాలూ కలిసిన సంపుటం) | 140 |
| 28) ఒకటో తరగతి తెలుగు వాచకం | 20 |
| 29) రామాయణ విష వృక్షం (3 భాగాలూ కలిసిన సంపుటం) | 250 |
| 30) పేక మేడలు; చదువుకున్న కమల (2 నవలలు కలిసిన సంపుటం) | 60 |
| 31) ప్రేమ కన్నా మధురమైనది; ఆండాళమ్మ గారు; చుట్టాలు; నా డైరీలో ఒక పేజీ (5 నవలికలు కలిసిన సంపుటం) | 70 |
| 32) నిశిత పరిశీలనా, దగాకోరు పరిశీలనా? దగాకోరు పరిశీలనా; జనసాహితితో మా విభేదాలు; తీగలాగారు, డొంకంతా కదిలింది (3 పుస్తకాలు కలిసిన సంపుటం) | 90 |
| 33) కృష్ణ వేణి (నవల) | 80 |
| 34) కళ్ళు తెరిచిన సీత (నవల) | 140 |
| 35) పిల్లల కోసం అర్థిక శాస్త్రం (మార్క్సు 'కాపిటల్' ఆధారంగా రాసిన పాఠాలు) | 120 |
| 36) పల్లవి లేని పాట (ఒక నవలికా, కొన్ని వ్యాసాలూ) | 100 |
| 37) తత్వ శాస్త్రం | 80 |
| 38) ఆత్మ కథాంశాల ఉత్తరాలు | 40 |
| 39) ఇదండీ మహా భారతం ! | 170 |
| 40) శ్రామిక కోణం (కథలూ, వ్యాసాలూ) | 120 |
| 41) శ్రమ దోపిడీ ప్రపంచాన్ని మార్చాలి | 50 |
| 42) వాళ్ళిద్దరూ అంతేనా? (నవల) | 150 |
| 43) 1917 విప్లవం ఎందుకు పోయింది? సోవియట్ రష్యాలో ఏం జరిగింది? (చార్లెస్ బెతల్ హామ్ 4 సంపుటాల పరిచయం) | 100 |
| 44) మార్క్సే నా టీచర్(వ్యాసాలు) (వ్యాసాలు) | 50 |
| 45) మార్క్సు రాసిన కాపిటల్ ఏం చెప్పింది?(టీవీ 9 లో ప్రసారం కోసం తయారు చేసిన పాఠాలు) | 100 |
| 46) ప్రేమకి ముగింపు ఎప్పుడు? (కథలూ, వ్యాసాలూ) | 80 |
| 47) కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక పరిచయం | 40 |
| 48) దొంగ తల్లిదండ్రులుంటారు జాగ్రత్త! (నవల) | 150 |
| 49) వేదాలు,వేదాలు, వేదాలు, వేదాలు:ఏం చెప్పాయి వేదాలు? | 90 |
| 50) పారిస్ కమ్యూన్ పరిచయం | 50 |
| 51) మహానటి సినిమా, ఆ నటికి న్యాయం చేయదు (వ్యాసాలు) | 80 |
| 52) ఇది, మానవ సమాజమేనా? (వ్యాసాలు) | 50 |
| 53) సంపద సృష్టి కర్తలు ఎవరు? (వ్యాసాలూ, ఇంటర్వ్యూలూ) | 40 |
| 54) వర్గాల గురించి మార్క్సు-ఎంగెల్సులు ఏం చెప్పారు? | 50 |
| 55) ఒక వస్తువు ధరకీ,ఆ వస్తువు కోసం జరిగిన 'శ్రమ' కీ సంబంధం ఎలా వుంటుంది? | 50 |
| 56) కమ్యూనిస్టు సమాజాన్ని చూద్దాం | 50 |
| 57) కమ్యూనిస్టులు, బూర్జువా పార్లమెంటరీ ఎన్నికల్లో పాల్గొనవచ్చునా, లేదా? | 40 |
| 58) ఒక సంఘ సంస్కర్త భార్య ఆత్మ కథ; ఒక పాటలకవి భార్య మనోవేదన | 40 |
| 59) పాఠకులు నాకు రాసిన ఉత్తరాలు | 50 |
| 60) అభ్యుదయ ప్రేమలు (కథలూ,వ్యాసాలూ) | 80 |
| 61) కళ్యాణి కథ (నవల) | 100 |
| 62) రత్నమ్మ గారి కోడలు; సుబ్బమ్మ గారి అల్లుళ్ళు (2 నవలికలు కలిసిన సంపుటం) | 80 |
| 63) మార్క్సిజం మీద విమర్శలకు జవాబులు | 40 |
| 64) మాట్లాడవలిసింది, 'శ్రామికవర్గ అస్తిత్వం' గురించే! (14వ్యాసాల సంపుటం) | 40 |

**ప్రతులకు: అరుణా పబ్లిషింగ్ హౌస్,**
**ఏలూరు రోడ్డు, విజయవాడ-520002.**
**( ఫోన్ : 9440630378)**

ధారావాహిక

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

## అడుగుజాడలు ఆనవాళ్లు-14

# నా పావురాలగుట్ట - చాకలిగట్టు యాత్ర

అలనాటి బౌద్ధ వారసత్వ ఒరవడిలో, ఈ తరానికి ఆతరం విలువల్ని అందించటానికి అప్పటి ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ, ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, చెన్నూరు ఆంజనేయరెడ్డిగారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నాగార్జునసాగర్‌లో 274 ఎకరాల్లో చేపట్టిన బుద్ధవనం ప్రాజెక్టు ఒక విలక్షణ బౌద్ధ పర్యాటక ఆకర్షణ. క్రీ.శ.3వ శతాబ్దిలో అంతర్జాతీయ ఖ్యాతిగడించిన శ్రీపర్వత విజయపురి బౌద్ధ, వైదికమతాల సామరస్య వేదికగానే కాక, ఇక్ష్వాకుల రాజధాని కూడ. బుద్ధవనం ప్రాజెక్టును సమగ్రంగా తీర్చిదిద్దటానికి ప్రముఖ జర్నలిస్టు మల్లెపల్లి లక్ష్మయ్యను తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకాధికారిగా నియమించి తగినన్ని నిధులను కూడా విడుదల చేసింది. ఈ ప్రాజెక్టు బౌద్ధ విషయ నిపుణ సంప్రదింపుదారుగా గత సం॥ తెలంగాణ ప్రభుత్వం నన్ను నియమించిన తరువాత, నేను తరచూ బుద్ధవనం ప్రాజెక్టును సందర్శిస్తున్నాను. నాగార్జునసాగర్ ఎగువన, కృష్ణానది ఎడమగట్టున, తెలంగాణ వైపున గల ఆదిమ మానవుని అడుగుజాడలను తడిమి చూడాలని ఎన్నోసార్లు అనుకొంటుండేవాణ్ణి. అది ఈసారి నిజమైంది.

తెలుగువారి తొలి తరం చరిత్రకు తెలంగాణ పురిటిగడ్డ. తొలుత కొండగుహల్లో, ఆ తరువాత, కొండచరియల కింద, అటు తరువాత గుంట ఆవాసాల్లో జీవించి, మైదానాల్లో స్థిరపడిన ఆదిమ మానవుని ఆనవాళ్లు తెలంగాణాలో కోకొల్లలు. సరిగ్గా 100 ఏళ్ల కిందట నాగార్జునికోటకు సమీపంలో పురాతన స్థలాన్ని గుర్తించటంతో ప్రారంభమైన చారిత్రక అన్వేషణ, తెలంగాణ చరిత్రకు గవాక్షమైంది. ఇప్పటి నాగార్జునసాగర్ వెనుక గల నీటి ముంపు ప్రాంతంలో 1926 తరువాత అనేక తఫాలుగా, పాతరాతియుగం మధ్య (సూక్ష్మ) రాతియుగం, కొత్తరాతియుగం, ఇనుప యుగం, చారిత్రక తొలి (శాతవాహన, ఇక్ష్వాకు) యుగం, మధ్యయుగాలకు సంబంధించిన అవశేషాలు వెలుగు చూశాయి. 1954 నుంచి 1960 వరకూ నాగార్జునకొండ వద్ద కేంద్ర పురావస్తు సంస్థ జరిపిన తవ్వకాల్లో ఇక్ష్వాకుల రాజధాని శ్రీ పర్వత - విజయపురి అనే కోట గోడలతో ఉన్న నగరం, బౌద్ధ, వైదిక కట్టడాలు, శిల్పాలు, శాసనాలు, వాటితో పాటు ఆదిమ మానవుని రాతి గొడ్డళ్లు, సన్నని బ్లేడ్లు, ఇనుప పనిముట్లు బయల్పడి తెలుగువారి చరిత్రపై వెలుగులు విరజిమ్మాయి.

కృష్ణానదికి ఆవైపు శ్రీపర్వత-విజయపురి, ఈ వైపు ఏలేశ్వరం పరిసరాల్లో లభించిన అనేక చారిత్రక ఆధారాలు, ఆదిమ మానవుని జీవన వికాస క్రమంలో వివిధ మలుపుల్ని తెలియజేస్తున్నాయి. ప్రకృతి భీభత్సాలు, క్రూర జంతువుల బారి నుంచి తనకు తాను కాపాడుకోవటానికి ఎత్తైన కొండ గుహలు, చరియల కింద నివసించి, ఆహార సంపాదన, నీటి కోసం సంచరించి కృష్ణానది తీరాన, కాలం వెళ్లబుచ్చాడు. క్రీ.పూ. 2.6 లక్షల ఏళ్ల నుంచి క్రీ.పూ. 12,500



సంవత్సరాల మధ్యకాలం (పాత రాతియుగం)లో చుట్టుపక్కల దొరికిన రాతితో పెచ్చులూడదీసి, రాతిగొడ్డళ్లుగా మలుచుకొని, దాన్ని ఒక ఆయుధంగా, పరికరంగా రూపొందించి, ఆహారాన్ని సంపాదించాడు. ఆ తరువాత, క్రీ.పూ. 12,500 నుంచి క్రీ.పూ. 4000 సం॥రాల వరకు రాతి పనిముట్ల తయారీతో వచ్చిన రాతి పెచ్చులు, సన్నటి బ్లేడ్లను, మాంసం, కాయలు, పండ్లను తినే యోగ్యంగా చేసుకొన్నాడు. ఈ సన్న, చిన్న పనిముట్లను సూక్ష్మ రాతి పనిముట్లంటారు. సాగర్ పరిసరాల్లో తెలంగాణ వైపు, పాతరాతి, సూక్ష్మ రాతియుగపు పనిముట్లు కోకొల్లలుగా దొరికాయి.

ఆ తరువాత దశలో, మరింత గట్టి రాళ్లతో పనిముట్లను తయారు చేసి వాటిని బాగా అరగదీసి, కొనలు తేలేట్లుగా చేసి, సులువుగా ఆహార సంపాదన చేశాడు. అంతేకాదు వ్యవసాయాన్ని విస్తృతంగావించి, పశువులను మచ్చిక చేసుకొని, స్థిర నివాస మేర్పరచుకొని, తమలాంటి వారితో సంబంధాలను కొనసాగించిన కాలాన్ని కొత్త రాతియుగం అంటారు. (క్రీ.పూ. 4000-1750) ఈ ప్రాంతంలో కొత్త రాతియుగపు గొడ్డళ్లు, ఒడిసెలరాళ్లు,

సానరాళ్లు అరగదీసుకొన్న గుంటలున్న అనేక స్థావరాలు బయట పడినాయి. కొత్త రాతియుగపు చివరి కాలంలో, రాగి అనే లోహంతో పనిముట్లు తయారై, కొత్త జీవన విధానానికి తెర తీసింది.

క్రీ.పూ. 1750 నుంచి క్రీ.పూ. 500 మధ్య కాలంలో ఈ ప్రాంతంలో సహజసిద్ధంగా దొరికే ముడి ఇనుప చిట్టెపురాళ్లు విరివిగా ఉండటం వల్ల, నాటి మానవుడు, వాటిని కరగించి, కావలసిన పరికరాలను తయారు చేసుకొని అడవులను నరికి, కొత్తగా భూముల్ని సాగు చేసి, తాత్కాలిక నివాసాల్లో ఉంటూ, చనిపోయిన వారి కోసం, శవాలను గుంటల్లో పూడ్చి వారు వాడిన పనిముట్లను కూడ అక్కడే

ఉంచి, చుట్టూ రాతిపలకలతో ఒక గది నేర్పరచి, పైన భద్రంగా ఒక బండ నుంచి మట్టితో కప్పి, ఎత్తైన దిబ్బగా తయారు చేసి, పెద్ద పెద్ద గుండ్లు, బండరాళ్లను గుండ్రంగా అమర్చి, శాశ్వత కట్టడ నిర్మాణానికి నాంది పలికాడు. మానవ జాతి చరిత్రను కొత్త మలుపు తిప్పిన ఇనుపయుగపు ఆనవాళ్లు నాగార్జునసాగర్ పరిసరాల్లో లెక్కలేనన్ని వెలుగుచూశాయి.

ఆఫ్రికాలో తొలిఅడుగు వేసిన ఆదిమ మానవుడు, మలి

అడుగును తెలంగాణలో వేసినట్లు తెలిపే ఆనవాళ్ల అన్వేషణ కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్ ఎడమవైపున ఎగువ తీరంలో నేను జరిపిన విస్తృత గాలింపులో ఆదిమ మానవుని అడుగు జాడలు  అనేకం వెలుగు చూశాయి.

బుద్ధవనం ఓఎస్డీ సుధనరెడ్డి, నరసింహారావు, నేను, పెద అడిశర్లపల్లి మండలంలోని పుట్టంగండి ఎత్తిపోతల పథకం చేరుకున్నాం. దాదాపు 200 అడుగుల లోతు నుంచి మరో 300 అడుగుల ఎత్తుకు నీటిని తోడి పోస్తున్న మోటార్లను మొక్కాలని పించింది. పక్కనున్న పావురాళ్లగుట్ట దగ్గర పాత రాతియుగపు మానవుడు నివసించిన కొండ చరియ ఆవాసాలు, అక్కడున్న క్వార్ట్జైటు రాతి బండలపైన, నదీ తీరంలోనూ, చుట్టు పక్కల పొలాలు, అడవుల్లో కోకొల్లలుగా పడివున్న రాతి గొడ్డళ్లు, కొత్తరాతియుగంలో పనిముట్లను అరగదీసిన గుంటలు, ఈనాటికీ చెక్కు చెదరకుండ ఉండటం ఆశ్చర్యాన్ని కలిగించాయి. క్వార్ట్జైటు మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభం కాకమునుపే ఈ ఆనవాళ్లను శాస్త్రీయ పద్ధతుల్లో నమోదు చేసుకొని భద్రపరచుకోకపోతే చరిత్ర చెరిగి పోతుందనిపించింది. పచ్చటి ప్రకృతి, జంతువుల వేటకు అనువు, నీటివసతి, పరికరాల తయారీకి ముడిసరుకు పుష్కలంగా ఉండి ఆది మానవునికి స్వర్గతుల్యంగా ఉన్న పావురాళ్లగుట్ట సందర్శన తరువాత మా ప్రయాణం పెద్దగట్టు వైపు సాగింది. పావురాళ్ల గుట్టలో క్వార్ట్జైటు రాతి గుట్టల్ని మాకు చూపించిన గోసంగి సైదులు ఆదరణ, ఆప్యాయతలు మరువలేనివి.


దేవరచల ఆదిమ మానవుని గుహ


పావురాళ్లగుట్టలో ఆదిమ మానవుని ఆనవాళ్లు


దేవరచలలో కొత్త రాతియుగపు ఆనవాళ్లు

పెదఅడిశర్లపల్లి మండలంలోని పెద్దగట్టు ఆదిమానవుని మరో ఆవాసం. పొలాల నిండా, పాతరాతియుగపు ఆనవాళ్లే. కృష్ణానది తీరాన గల దేవరచల అనే లోయ, నాటి నాగరికతకు ఆనవాలు. దేవరచల అన్న ప్రదేశంలో భూమి ఉపరితలంనుంచి  దాదాపు 200 అడుగుల లోతున్న లోయ, ప్రాకృతిక సౌందర్యానికి నెలవు. పైనుంచి 100 అడుగుల దిగువన గల ఆదిమ మానవుని గుహ, పైనుంచి నిరంతరం తెరలు తెరలుగా జాలువారే వానజల్లు లాంటి జలపాతం ఆలోయ అందాన్ని మరింత ఇనుమడింప చేస్తుంది. అంచెలంచెలుగా ఉన్న ఈ గుహలు, పాత, మధ్య, కొత్త రాతియుగాల్లో నాటి మానవుల ఆవాసాలుగా ఉండేవని, కొండ చరియలపైన రాళ్లలో చెక్కుకొన్న గుర్తులు, పైన దొరికిన రాతి పనిముట్లు రుజువు చేస్తున్నాయి. ఇక్కడే ఒక వంక, వాగుగా మారి, కృష్ణానదిని చేరే తీరు వర్ణనాతీతం.

స్థానిక రైతుల సాయంతో దేవరచల పరిసర పొలాలు, జలపాతం కుదుట్లో జరిపిన పరిశోధనల్లో, పాతరాతి గొడ్డళ్లు, మధ్యరాతియుగపు సన్నటి బ్లేడ్లు, కొత్తరాతియుగపు గొడ్డళ్లు లెక్కనేనన్ని కనిపించాయి.

ఆశ్చర్యమేమిటంటే, పొలాల నిండా టన్నుల కొద్దీ ఇనపు చిట్టెపు రాళ్లు. ఇనుపయుగంలో ఈ ముడిరాళ్లను పొడిగొట్టి, కరిగించి, మలినాల్ని తొలగించి, ఆ కరిగిన ద్రవంతో తమకు కావలసిన పనిముట్లు, పరికరాలు, ఆయుధాలను తయారు చేసుకొన్న సాక్ష్యాలు ఎన్నో కనిపించాయి. ఆనవాళ్ల నేపథ్యంలో నాకు నేను, ఆదిమ మానవునిగా ఊహించుకొని, ఆనాటి వాతావరణంలో కొంత సేపు గడిపి, ఒకరైతు అందించిన కందికాయలు అందుకొంటూ, మళ్లీ ఈ లోకంలోకొచ్చాను.

పెద్దగట్టు నుంచి ఉన్న బళ్లబాటను బాగుజేసి, బీటీరోడ్డు వేస్తే దేవరచలకు ఆహ్లాదకర పర్యావరణహిత పర్యాటక స్థావరమౌతుంది. సాగర్ సందర్శకులను ఇట్టే ఆకర్షిస్తుంది. నడవటం కొంచెం కష్టమేగానీ, పరిసరాల అందచందాల నడుమ జాలు వారే జలపాతం చిరుజల్లుల్లో తడిచినపుడు కలిగే అనుభూతిని ఎవరికి వారు సొంతం చేసుకోవాల్సిందే.

ఈ గాలింపు ఇంతటితో ఆగలేదు. తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ నాగార్జునసాగర్ వద్ద అభివృద్ధి చేసిన బుద్ధవనం చుట్టూ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ఒక నడక దారిని ఏర్పాటు చేశారు. ఆదారిలో వేసే ప్రతి అడుగూ, ఆనందాశ్చర్యాల్ని కలిగిస్తుంది. కనుచూపు మేరలో ఆకట్టుకొని కనికట్టుచేసే ప్రకృతి అందచందాలు,



బుద్ధవనంలో ఆదిమానవుని ఆనవాళ్లు

సువిశాల జలాశయపు అంచుల కవ్వింపులూ, నీటి మధ్యలో నున్న దీవులు, నడక ముందుకు సాగే కొద్దీ వినిపించే పక్షుల కిలకిల రావాలు, మైమరపించే ఆహ్లాదకర పరిమళాలు, తెల్లటి పాల నురగల్లాంటి మేఘాలపైన నీలి ఆకాశం, ఇలా, మరో లోకంలో విహరిస్తున్నామా అన్న అనుభూతికిలోనౌతామనటంలో అతిశయోక్తిలేదు. మా అడుగులు ముందుకు సాగుతున్నాయి. కీచురాళ్ల రణగొణ ధ్వనుల మధ్య రాళ్లపైన ఒక్కో అడుగేసుకొంటూ, నేను, సుధన్‌రెడ్డిగారు, శ్యాంసుందర్, నరసింహారావు గంభీరంగా శ్వాస తీసుకొంటూ పోతున్నాం మమ్మల్ని ఒక రాతి బండపైన కొత్త రాతియుగపు గుంటలు ఆపేశాయి.

అవి రాతిగొడ్డళ్లను పదును తేలేలా మొనల్ని అరగదీయగా, అరగదీయగా, ఏర్పడిన గుంటలు. జంతువుల్ని తరిమి కొట్టడానికి విసిరేసే ఒడిసెల తయారీలో భాగంగా, రాళ్లను గుండ్రంగా కొట్టుకొంటూ అరగదీసిన గుంటలు, పక్కనే దొరికిన నల్లశాసనపు రాతిలో తీర్చిదిద్దిన పదును దేలిన కొత్త రాతియుగపు గొడ్డలి మమ్మల్ని కదలకుండా కట్టిపడేశాయి. ముందుకెళ్లిన కొద్దీ మరిన్ని

ఆనవాళ్లు. ఊహించని ఈ ఆనవాళ్లు, మల్లేపల్లి లక్ష్మయ్య గారి కళ్లల్లో కాంతుల్ని మెరిపించాయి. మమ్మల్ని కూడా మురిపించాయి. ఎపుడో ఎనిమిదేళ్ల క్రితం రిటైరైన నాకు మళ్లీ పురావస్తుశాఖలో



చాకలిగట్టుపై కొత్తరాతియుగపు ఆనవాళ్లు

ఉద్యోగం చేస్తున్నానా అన్న భ్రాంతి కలిగింది.

ఆ ఆనందాలు మమ్మల్ని కృష్ణానది మధ్యలో నాగార్జునకొండ పక్కనే ఒక కిలోమీటరు దూరంలో ఉన్న చాకలిగట్టు వైపు మళ్లించాయి. మాతోపాటు తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండి మనోహర్, బుద్ధవనం అధికారులు మల్లేపల్లి లక్ష్మయ్య, సుధన్‌రెడ్డి, క్రాంతిబాబు, శ్యాంసుందర్‌ల బృందం ఓ గంటపాటు నీటి అలల స్వాగతాల మధ్య గూటి పడవ ప్రయాణం. పడవ దిగిన తరువాత ముళ్లపొదల మధ్య నుంచి సాగిన మా నడక ఒక పెద్ద బండపై ఆగింది. అక్కడ మళ్లీ మా ఆనందం వెల్లివిరిసింది.

కొత్త రాతియుగపు ఆనవాళ్లు మమ్మల్ని కేరింతలు కొట్టించాయి. పావురాలగుట్టలో మొదలై, దేవరచలలో సాగిన సందడి, చాకలిగట్టు విప్పిన ఆదిమ మానవుని గుట్టుతో మా ప్రయాణం ముగిసింది. ఒకనాటి చరిత్ర కాలనాళికై కళ్లముందు కదలాడింది. ఒక మెరుపు మెరిసిపోయింది.

స.వెం. రమేశ్

# తెన్నాటి తెమ్మెర (తెలుగువారి తమిళ కతలు) విడుదల






**స.వెం.**రమేశ్ తమిళనుడి నుంచి తెలుగునుడిలోకి అనువాదం చేసిన 40 కథల సంకలనం 'తెన్నాటి తెమ్మెర' పుస్తకాన్ని తిరుపతిలో విడుదల చేశారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని సైకాలజీ సెమినార్ హాల్‌లో డిసెంబర్ 21న ఈ కార్యక్రమం జరిగింది. డిట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ ప్రచురించిన ఈ పుస్తకాన్ని ఆ సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర చౌదరి విడుదల చేశారు. ప్రసిద్ధ రచయిత మధురాంతకం నరేంద్ర, కథా సాహితీ నిర్వాహకుడు వాసిరెడ్డి నవీన్, ఈ కథలు రాసిన రచయితల నేపథ్య పరిస్థితులను వివరించారు. కొన్ని కథలను విశ్లేషించారు. తమిళ నుడి లోనే కథలు రాసిన, ఇప్పటికీ రాస్తున్న రచయితల్లో 200 మంది తెలుగువారు ఉన్నారని సవెమ్ రమేశ్ తెలిపారు. తెలుగులో చదువుకునే పరిస్థితులు లేకపోవడం వల్ల తమిళనాడు లో అందరూ తమిళం మాత్రమే చదువుకుంటూ ఉన్నారని, అందువల్ల వీరు తమిళ నుడి లోనే కథలు రాశారని చెప్పారు. ఈ పుస్తకం లోని పలువురు ప్రసిద్ధ తమిళ రచయితలు తెలుగువారు అని ఇప్పటికీ తమకు తెలియదని వాసిరెడ్డి నవీన్ అన్నారు. వీరిలో కొందరితో తనకు 20 ఏళ్లుగా స్నేహం ఉందని, అయినా తెలుగు మాట్లాడుతారు అని కూడా తెలియదని చెప్పారు. తెలుగు, తమిళ నుడుల, సంస్కృతుల స్నేహానికి వారధిలా " తెన్నాటి తెమ్మెర " కథల సంకలనం ఉపయోగ పడుతుంది అని రాఘవేంద్ర చౌదరి అన్నారు. భవిష్యత్ లో ఇటువంటి కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించారు. ఈ కథల పుస్తకంలోని తమిళ రచయితల్లో కొందరు సభలో మాట్లాడారు. రాజుపాల్యం నుంచి గొట్టిముక్కల రాజేశ్వరి, మందలపాటి ఆనంది పాల్గొన్నారు. మదురైకి చెందిన కథా రచయిత జనసేసన్, మధురాంతకం నుంచి శ్రీపతిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఉదుముల పేట నుంచి మార్టూరి వసంత నాయుడు పాల్గొన్నారు. రచయిత అన్బరసు కుమారుడు మణి వన్నన్ హాజరయ్యారు. చెన్న రసం, కొంగురసం, తొండ రసం, కృష్ణ రసం ప్రతినిధులు మన్నవ గంగాధర ప్రసాద్, సంజనా పద్మం, మునిరాజు, దామోదరం లకు పుస్తకం ప్రతులను వేదిక మీద అందించారు. భూమన్, జిల్లెళ్ళ బాలాజీ, సాకం నాగరాజు, రాసాని, ఆర్.ఎం.ఉమామహేశ్వర రావు, సుంకోజి దేవేంద్రచారి, కిరణ్ కుమారి, మౌని వంటి రచయితలు సభకు హాజరయ్యారు.

ఈ పుస్తకానికి స.వెం.రమేశ్ రాసిన ముందుమాట ఇది:

# తెన్నాటి తెలుగు వెత

**తె**న్నాటి తెమ్మెరను మీ మేనుకు సోకించాలని చానేళ్ల కల నాది. ఇన్నాళ్లకు నెరవేరింది. కతల్లోకి వెళ్లే ముందు ఈ వెతను కూడా వినేసి వెళ్లండి. ఇప్పటి తమిళనాడును మేము 'తెన్నాడు' అంటున్నాం. మేము అంటే, తెన్నాటి తెలుగువాళ్లం. మేము అంటే, తమిళ దొరతనం కరకుగా తొక్కేస్తుంటే ఆ అణచివేతను తొలగదోసుకొని పైకి లేయాలనుకొంటున్నవాళ్లం. మేము అంటే, ఆంద్ర తెలంగాణ అక్కలన్నలు తొంగి కూడా చూడకుండా ఉండిపోతే 'మేము కూడా తెగిపడిన మీ మేనుకాయలమే,' అని ఎలుగెత్తి వేడుకొంటున్న వాళ్లం.

తెన్నాడు అని ఎందుకు అంటున్నామంటే...

ఒకప్పటి ఆంద్రతావు తెలుగు పెద్దలు, గద్దెమీద పెద్దతనం కోసం, తెన్నాటి తెలుగు పెద్దలమీద అలిగి, 1913 నుండి ఈ తావునంతా తమిళనేలగా చాటింపేసి, పెద్ద ఎసపు (ఉద్యమం) చేసి,



1953లో మదరాసును వదలి పారిపోయినారు. ఈ ఎసపుకు వెనుకముందులుగా తెన్నాటి తెలుగు పెద్దలు అరవకాళ్లను నాకుతూ సొక్కి మురిసిపోయినారు. ఆ మురిపెమే ఈ తావుకు తమిళనాడనే పేరును తెచ్చి పెట్టింది. ఆ మురిపెమే వేల తెలుగు తరగతులకు తాళాలను వేయించింది. ఆ మురిపెమే అడుగడుగునా అణువణువునా ఈ నేలంతా నిండివుండే తెలుగు సాగుబాటు(సంస్కృతి)ని తమిళ సాగుబాటుగా చాటింది.

తెలుగుదీ తమిళందీ విడివిడి సాగుబాటులు ఏం ఉంటాయంటారా? వినిపిస్తాను వినండి. ఈ నేలన తొలి గుడిని కట్టించింది తెలుగువాళ్లు; తొలి నగరాన్ని ఏర్పర చింది తెలుగువాళ్లు; నూర్లవేల చిన్నాపెద్దా గుళ్లనూ గోపురాలనూ నిలిపింది తెలుగువాళ్లు; తంజావూరు చోవులు (చిత్రాలు) తళుదాల పావులు (కొయ్యబొమ్మలు) కంచి, ఆరణి పట్టుకోకలు; మహాబలిపురం రాతిబొమ్మలు; బండి పాళెం మట్టిబొమ్మలు; వెలగచేరి కొలువు బొమ్మలు; పంటరొద్ది గుర్రంబొమ్మలు; తంజావూరు కులుకుబొమ్మలు; తంజావూరు అతుకు (అప్లిక్) గుడ్డలు; బవాని కంబళ్లూ జమకాళాలు: లచ్చిగుడి కంచుదివ్వెలు; జల్లికట్టు; పొంగలి పండుగ; కుచ్చులెద్దులు; గంగెద్దులు; బూమెద్దులు; సలిగెద్దులు; కాంగేయం గిత్తలు; తంజావూరు బాగవతాలు; చోళనాటి చెక్కపుల్లలాట; కొంగునాటి యక్షగానం; తొండనాటి తెరువాటలూ బారతం ఆటలు; తగుడూరు బయలాటలు; మొరసు నాటి కేళికలు; పాండెనాటి విల్లుపాట; దేవరాట; సేవాట, జిక్కాట, జింప లాట, కోలాట, పదుకాసియాట, వీరకాసియాట వంటి నూటికిపైగా పల్లె కళలు; పదుల లెక్కలోని అలమరి (సంచార) తెగలు; ఒక్కొక్క తెగకూ ఒక్కొక్క చిందాట; ఒక్కొక్క తెగ నోళ్లలో నూర్లనూర్ల అప్పటపు తెలుగు మాటలు: రుక్మిణీదేవి అరుండేల్ 'భరతనాట్యం' అని పేరు పెట్టేసిన దాసియాట, సదిరాటలు; గుళ్లూ ఇళ్లూ ఆనకట్టలూ గాలిగోపురాలూ కట్టే ఒడ్డరులు; చెరువులూ బావులూ కాలువలూ తవ్వి పొలాలకు నీళ్లను అందించే మున్నీరు కాపులు; కపిలబాన, తొండం, చెప్పులు, పలక(డప్పు), మద్దెల, డోలు వంటి పనిముట్లకూ ఎస(సంగీతం) ముట్లకూ తోలును తోమంచేసి అందించే మాదిగలు; ఉసురు ఎగిరిపోయి మన్నులో మన్నుగానో మంటలో మంటగానో కలిసిపోయే పీనుగకు కడవరకు కాపుండే కాటికాపర్లు... ఎంతని చెప్పమంటారు తెన్నాటి తెలుగు సాగుబాటును! చెపుతూ ఉంటే వినడానికి మీకు నాళ్లు చాలవు. ఏళ్లు కావాలి.

వాళ్లను చెప్పమనండి. లేదంటే మీరెవరయినా అరసి(శోదించి) చెప్పండి చూద్దాం! ఇందులో పదోవంతు సాగుబాటు తమిళులకు ఉందేమో! లేనప్పుడు ఇది తమిళనేల ఎందుకవుతుంది? అంత పెద్దమాట వద్దనుకొన్నా, తమిళనేల మట్టుకే ఎందుకవుతుంది? తెలుగూ తమిళమూ కలగలసిన 'తెన్నాడు' ఎందుకు కాకూడదు?

వేలయేళ్లు వెనక్కి వెళ్లి చూస్తే; తొండ, చోళ, కొంగు, పాండె అనే నాలుగు పెద్ద నాడులూ, నాంజిల్, కుడ, తగుడూరు, మొరసు అనే నాలుగు చిన్న ముక్కలూ... ఇదీ ఈ తావు. వీటన్నిటినీ కలగలిపి కుట్టేసి, 1969లో 'తమిళ్‌నాడు' అని పేరు పెట్టేసినారు. ఎవర్ని అడిగి ఈ పేరును పెట్టినారు? ఎవర్ని అడిగుండాలి అంటారా? తమిళులతో సరిలెక్కలో, ఆమాటకొస్తే కాసంత ఎక్కువే ఉండే తెలుగువాళ్లను అడిగుండాలి. తక్కువంటే నూరుమంది తెలుగువాళ్లను చట్ట మేనరులు (శాసనసభ్యులు)గా ఎన్నికచేసి, వాళ్లనడిగి పేరును మార్చి ఉండాలి. అడ్డదిడ్డపు ఎమక దిద్దెమక దొరతనాలు, పోటీ చేయడానికయినా తెలుగువాళ్లకు తావు ఇస్తే కదా!

ఏ ఎమక తట్టువం(పార్టీ) అయినా తలవరగా మట్టుకు తెలుగువాడు ఉంటాడు. ఆ తలవరకు అప్పటికే తమిళ తగులం (వ్యామోహం) బాగా తలకెక్కేసి ఉంటుంది. మిగిలిన మేనరులంతా తమిళులే ఉంటారు. వాళ్ల మెరమెచ్చుల కోసం, గద్దెనెక్కడం కోసం తెలుగుకు పాతర వేసేసినారు ఆ తలవరులు. చక్రవర్తుల రాజగోపాలాచారి (తెలుగు అయ్యంగారు), పెద్దాయన రామసామి నాయుడు (గాజుల బలిజ), కంజీవరం అన్నాదొర (బోగం బలిజ), ముువ్వ కరుణానిది (బోగం బలిజ), వైగో అనబడే పులిపాటి గోపాలసామి నాయుడు (కమ్మ), విజయకాంత్ (బలిజ)... ఈ తలవరులందరూ తెలుగును తొక్కేసిన తెలుగువాళ్లే.

తమిళం తమిళం అంటూ తమిళుల్ని రెచ్చగొట్టి గద్దెనెక్కిన తెలుగు పెద్దల మురిపెం కూడా మూడునాళ్ల ముచ్చటే అయింది.



స.వెం.రమేశ్ కథల మీద
నీలవేణి రాసిన
పరిశోధనా గ్రంథాన్ని
పేట శ్రీనివాసులురెడ్డి
రమేశ్‌కి అందజేసి
సత్కరించడం ఈ సభలో
చోటుచేసుకున్న
ఒక విశేషం

తెలుగుబడిని వదిలేసినా, తెలుగు రాతలను చెరిపేసుకొన్నా, ఇంటి పేరును విడిచేసినా, కూటం(గోత్రం)ను మరుగు చేసుకొన్నా, మెడలో తెలుగుతాళికి మారుగా తమిళ పుస్తెను కట్టుకొన్నా, చివరకు ఇంట్లో కూడా తెలుగును వదిలేసినా సరే, ఇప్పుడు కుదురును (కులం) వెతికి పట్టుకొని 'తెలుగు కుక్కా బయటకు పో' అంటున్నారు. గుప్పెడుమంది తెలుగు పెద్దలు చేసిన తప్పుడు పనికి కోట్లమంది ఇక్కట్ల పాలయినారు. ఆ తెలుగు పెద్దలు తెలుగుకు కీడు చేసినారు కానీ తమిళానికి మువ్వీసమయినా ముప్పును తలపెట్టలేదు. పైగా తమది కాని తమిళాన్ని పనిగట్టుకొని పెంచినారు.

ఓ ఇరవైయేళ్లుగా తెన్నాడులో తెలుగువారి మీద కొంగొత్త తెగబాటు(దౌర్జన్యం) మొదలయి కొనసాగుతున్నది. దీనిని మొదలు పెట్టింది 'తని తమిళ్ సేనై' అనే తట్టువం. కొనసాగిస్తున్నది 'నామ్ తమిళర్' అనే తట్టువం. పగలూ రేయీ తెలుగు వాళ్లను తిట్టడమూ తెగడడమే వీరి పని. క్రిష్ణదేవరాయల తరిలో వలసవచ్చిన తెలుగువాళ్లు, తమిళులకూ తమిళనుడికీ పెద్దకీడు తలపెట్టేసినారు, తమిళాన్ని రాచిరంపాన పెట్టేసినారు అన్నది వీరి పెనగువ. ఇందులో రెండు పెద్ద పొల్లు మాటలున్నాయి. తెన్నాటి తెలుగువారందరూ క్రిష్ణదేవరాయల తరిలో వలస వచ్చినారు అన్నది ఒక పొల్లుమాట. ఈ నేలమీద తమిళులెంత పాతవారో అంతే పాతవారు తెలుగువారు కూడా. ఈ మెలన(చరిత్ర)నంతా చెప్పాలంటే ఈ మున్నుడి చాలదు. రెండువేల ఏళ్లనాడే సాతవాహన తెలుగుదొరల ఏలుబడి కావేరి వరకూ సాగింది. పలనాడు నుండి వచ్చిన పల్లవ దొరలు పదిహేను వందలేళ్ల కిందట కంచి నగరాన్ని కట్టించినారు. రేనాడు తావు నుండి వచ్చిన చోళులు పదమూడు వందలేళ్ల కిందట దనంజయూరును కట్టించినారు. అదే ఇప్పటి తంజావూరు. అప్పటికే ఈ తావునున్న తెలుగువారినీ తమిళులనూ కలుపుకొని ఇక్కడ సాగునేలను పెంచినారు, సాగుబాటునూ పెంచినారు. తెలుగువాళ్లు తమిళాన్ని తొక్కేసినారన్న రెండో పొల్లుమాట అయితే పెద్ద తప్పుడు కూత. వేలయేళ్లుగా తెలుగుకంటే మిన్నగా తమిళాన్ని పెంచింది తెలుగువాళ్లే. ఇప్పుడు తమిళులు చేస్తున్న పెనగువను వింటుంటే అచ్చెరువు కలుగుతుంది. తెన్నాట తెలుగు సాగుబాటు అంతా తమిళం పేరుతో అలాగే ఉండాలి. తెలుగువాళ్లు మట్టుకు ఉండకూడదు. అంటే, దేవరాట ఉండాలి, దానిని ఆడే ఏకిలివారు ఉండకూడదు. తంజావూరు చోవులు ఉండాలి, వాటిని గీసే జీనుగార్లు ఉండ కూడదు. ఇదీ వారి పెనగువ. వందుకొన్న కూడూ, ఒంటిమీది గుడ్డా, కుండా చట్టీ, కొంపాగోడూ, పిల్లామేకా అన్నిటినీ చివరకు ఆటాపాటలను కూడా వాళ్లకే ఇచ్చేసి మొండిమొలతో ఎక్కడికో వెళ్లిపోవాలట తెలుగువాళ్లంతా.

1860-70ల వరకూ తెన్నాట గొప్పగా వెలిగింది తెలుగు. అప్పుడు ఈ చోటున ఏలుబడి నుడి తెలుగు, బడినుడి తెలుగు, ఎసనుడి తెలుగు, ఒక్క గుడినుడిగా మట్టుకు సంసుక్రుతం ఉండేది. తమిళులు వాళ్ల అమ్మనుడిని ఇంట్లో నుడువుకొని తెరువుకు వచ్చినపుడు తెలుగునే పలికేవాళ్లు. సరిగ్గా నూరేళ్లకు లోపల్నే ఈ నిలవరం(పరిస్తితి) తిరగబడింది. ఇప్పుడు బడీ గుడీ ఏలుబడీ అన్నిచోట్లా అరవమే. 'ఎంగుం తమిళ్ ఎదిలుం తమిళ్' (అంతా తమిళం, అన్నిటా తమిళం) అని చెలరేగిపోయింది. వడిగా వచ్చి ముంచెత్తిన ఈ వెల్లువలో ఊపిరి ఆడలేదు తెలుగువాళ్లకు. కడకు తల్లీబిడ్డా కూడా కడపను దాటి బయటకు వస్తే, తమిళాన్నేనుడువుకొనే నిలవరం వచ్చేసింది. సంసుక్రుత ఎదిరింపు, హిందీ ఎదిరింపు ఎసపు (ఉద్యమం)లలో తమిళం కాళ్లకింద నలిగిపోయింది తెలుగే.

1870 దాటినాక ముందుగా తెలుగు పారులు(బ్రాహ్మణులు) తమిళబడికి వెళ్లడం మొదలిడినారు. వారి వెనుక మెల్లమెల్లగా మిగిలిన కుదురులవారూ అడుగులు వేసినారు. చివరకు హోసూరు, డెంకణికోట, పల్లిపట్టు, గుమ్మడిపూడి తావుల్లో మట్టుకే ఆరువందల తెలుగుబడులు మిగిలినాయి. జయలలితమ్మ పోతూపోతూ వాటిని కూడా పొట్టన పెట్టుకొనిపోయింది.

ఇదీ మా వెత. కతలపొత్తానికి మున్నుడి రాస్తూ ఈ సోదంతా ఎందుకంటారా? కతలకు ముందో పాటలకు ముందో కాకుండా విడిగా చెపితే మీరు వినరేమో అని చిన్న బెరుకు, కతలమీది ముక్కువతో అయినా ఈ నాలుగు మాటల్ని వింటారు కదా అని చిన్న ఆబ.

ఇక ఈ నోయి(గ్రందం) గురించి కొంచెం ముచ్చటించుకొందాం. మొదలిడినప్పటి నుండీ ముగించేవరకూ మూడేళ్లు పట్టింది. ఈ పనికి, తెలుగు వ్రాతరు(రచయిత)లను గుర్తించడమే పెద్ద పని అయింది. గుర్తించినవారిలో బతికున్నవారిని ఒప్పించడం ఇంకా పెద్దపని అయింది. కొందరు, ఎలమితో గబుక్కున ఒప్పు కొన్నారు.

కొందరు, 'ఎందుకులెండి... పోనిద్దురూ...' అని నసిగి నసిగి ఒప్పు కొన్నారు. కొందరు, ఎంత బతిమాలినా ఒప్పుకోలేదు. కొందరు, ఎదురుతిరిగి తిట్టినారు.

వెతుకులాటలో రెండు వందల మంది వరకూ తెలుగు వ్రాతరులు దొరికినారు. తెలుగు వ్రాతరులు అంటే తెలుగులో రాసినవారు అని కాదు, తెలుగువారు అయ్యుండీ తెలుగు తెలియక తమిళంలో రాసినవారు అని. బతిమిలాటలూ బుజ్జగింతలూ వేడుకోళ్లు మొత్తుకోళ్లు అన్నీ అయినాక ఈ నలభై కతల్ని ఎంచుకొని తెలుగు చేసినాను. అదేపనిగా వెతికితే ఇంతకు పదింతలమంది దొరుకుతారు.

తెలుగు వ్రాతరుల ఇంటి పేర్లను ఇద్దామనుకొన్నాను, కుదురు (కులం)ను కూడా. 'కుదురూ కూటం (గోత్రం) లేనివాండు తెలుంగువాండు ఎట్ల అవ్వు?' అని మా పెద్దలు అంటుండేవాళ్లు. ఎందుకంటే తమిళులకు ఇంటి పేరూ కూటమూ రెండూ ఉండవు. కొందరు వ్రాతరులు వీటిని బయట పెట్టడానికి ఒప్పుకోలేదు. కుదురును చెప్పకపోవడం తప్పు అనను కానీ ఇంటి పేరును చెప్పడానికి ఏమయింది? సిగ్గా, వెరపా, పట్టనితనమా? ఏదో తెలియదు కానీ కొందరు ఒప్పు కోలేదు. వ్రాతరులను వెతకడానికి పాటుపడినంతగా వాళ్ల ఇంటి పేర్లను తెలుసు కోవడం కోసం కూడా పాటుపడవలసి వచ్చింది.

లోపల నలభై కతలున్నాయి. తమిళకత కళ్లు తెరచినప్పటి నుండి నిన్నమొన్నటి వరకూ వచ్చిన కతలివి. అన్నిటినీ తరివరుస (కాలక్రమం)లో ఇచ్చున్నాం. తమిళ కత గురించి పై పైన కొంత చెప్పుకోవాలి మనం.

అచ్చుమర వచ్చి ఆకిక(పత్రిక)లు వెలువడడం, ఇంగిలీసు నానుడి(సాహిత్యం)తో పొత్తు, వీటివలన మన బారతనాడులోని అన్ని నుడులలోనూ కత, కొత్తెన(నవల) వంటి కొంగొత్త నానుడి మొదలయింది. తెలుగులో తొలికత 1879లో వచ్చింది. అయితే నిండుగా కత ఆలుడి(లక్షణం)తో వచ్చిందిగా 1910లో వచ్చిన 'దిద్దుబాటు'ను ఎక్కువమంది గుర్తిస్తున్నారు.

అట్లాగే తమిళంలో తొలికత 1905లో వచ్చిన తులసీబాయి. రాసినవారు మహాకవి సుబ్రమణ్య బారతి. వీరే 1906లో 'ఆరిల్ ఒరు పంగు (ఆరులో ఒక వంతు)'ను రాసినారు. 1907లో వ.వే.సు. అయ్యర్ 'మంగయర్కరసి కాదల్' కతను రాసినారు. వీటి మూడింటినీ నిండు కతలుగా పేర్కొనరు తమిళులు. 1908లో అయ్యరుగారే రాసిన 'కుళత్తంగరై అరసమరం చెన్నకదై (గుంటకట్ట రావిమాను చెప్పిన కత)'ను తొలి నిండు కతగా పేరుకొంటారు.

1905 నుండి 1925 వరకూ ఉన్న తరిని తమిళకతకు బుడిబుడి నడకల తరిగా చెబుతారు. ఈ తరిలో కతను అడుగులు వేయించింది ముగ్గురు. సుబ్రమణ్య బారతి, వ.వే.సు. అయ్యర్, అ. మాదవయ్య. ఈ ముగ్గురిలో అయ్యరూ మాదవయ్యా తెలుగువాళ్లు. ఈ కూర్పు (సంకలనం)లో అయ్యరు కత ఉంది.

1930 నుండి 'మణికొడి' తరి మొదలయింది. మణికొడి అనేది ఒక ఆకిక పేరు ముప్పయ్యవ పదికంలో తమిళకత అడుగులు కుదురుగా పడడమే కాదు, వడిని నేర్చుకొన్నాయి కూడా. మణికొడి ముమ్మూర్తులుగా పేరు గడించినవారు; కు.ప. రాజగోపాలన్, న.పిచ్చమూర్తి, పుదుమైపిత్తన్‌లు. వీరిలో తొలి ఇద్దరూ తెలుగు వాళ్లు. వీళ్ల ముగ్గుర్నీ కూడా తమిళ కతకుల్లో మేటరులు(మాస్టర్స్)గా చెబుతారు. ఈ పదికం(దశకం)లో రాయడం మొదలు పెట్టినవారు ఇరవైమంది వరకూ ఉన్నారు. వాళ్లలో బాగా పేరు గడించినవారు పదిమందికి తగ్గరు. వీళ్లలో, మూడు వందలకు పైగా కతల్ని రాసిన బి.ఎస్. రామయ్య, క.న. సుబ్రమణ్యం, పి.జి. సుందరరాజన్, రాజాజీ, అన్నాదొరైలు తెలుగువాళ్లు. మిగిలినవాళ్లలో అందరూ తమిళులే అయుండకపోవచ్చు. వెతికితే ఇంకా కొందరు తెలుగువాళ్లు ఉండవచ్చు.

నలబయ్యవ పదికంలో కతలను మొదలిడి పేరు గడించిన వారిలో లా.సా. రామామృతం, కరిచ్చానకుంజు, ము. కరుణానిదిలు తెలుగువాళ్లు. లా.సా.రా. రాసిన 'అమ్ములు' కత తమిళ మేలిమి (క్లాసిక్) కతలలో ఒకటి. ఈ తరివారే అయిన టి. జానకిరామన్, ఆర్. వెంకటరామన్, సి. రగునాదన్‌లలో తెలుగువారు ఉన్నారేమో తెలియదు.

ఏబయ్యవ పదికం నుండి తమిళకత పరుగులు పెట్టింది. ఈ పదికంలో కతలను మొదలిడిన ఇద్దరికి ఆ తరువాత జ్ఞానపీఠ పోణిమి దొరికింది. అకిలన్, జెయకాంతన్‌లు వాళ్లు. ఈ ఇద్దరూ తమిళులే. ఈ తరికి చెందిన గొప్ప వ్రాతరులలో సుందర రామస్వామి, నా. పార్థసారది, ఇంద్రా పార్థసారది కూడా ఉన్నారు. వీరి నుడి ఏమిటో తెలియదు. ఈ తరిలోని మరొక మేటరి జి.అళగిరిసామి తెలుగు వారు. వీరి 'అన్బళిప్పు (అనుగొసగు)' కత తమిళ మేలిమి కతలలో ఒకటి. ఇది ఈ కూర్పులో ఉంది.

అరవయ్యక పదికం నుండి ఇప్పటివరకు నూరారుమంది తెలుగువాళ్లు వ్రాతరులు అయి ఉంటారు. ఈ తరి నుండి వెతకడం చిన్నపని కాదు. కరడుగట్టిన తమిళదనంలో ఇరుక్కుపోయిన తెలుగువాళ్లు, తమ నుడివునికికి పాతర వేసేసినారు. ఈ తరిలోనే 'నెలవునుడి తాత (మాండలిక పితామహుడు)' కి.రాజనారాయణన్ దూసుకొని వచ్చినారు. తెలుగువారయిన కీరా రాకతో తమిళ నానుడి లోకం, అదివరకు ఎన్నడూ ఎరుగని తెలుగు కలిసిన కొత్తనెత్తావి తమిళాన్ని చవిగొని పులకరించిపోయింది. కీరా అడుగుజాడల్లో నడచి నల్లరేగడి బతుకులను తమిళులకు అందించి పేరు గడించిన ప.జయప్రకాశం కూడా తెలుగువారే.

తమిళంలో తొలినుండీ మగవారికి తీసిపోకుండా ఆడవారు కూడా కతలను వెలువరించినారు. 1905-06లోనే రేవు తాయారమ్మ అనే తెలుగావిడ కొన్ని కతల్ని రాసినట్లు తెలుస్తున్నది. కానీ అవేవీ దొరకలేదు. ఇరవయ్యవ పదికంలో 'కోదై నాయకి అమ్మాళ్ (గోదానాయకి అమ్మ)' తమిళ నానుడి నింగిలో తళుక్కున మెరిసినారు. గోదానాయకమ్మ, గాందీగారి అడుగుజాడల్లో నడచి, ఆనిడి(స్వతంత్ర) పోరాటంలో చురుగ్గా పాలుగొని చెరసాలకు వెళ్లినారు. ఆడవారు చదువుకొని ఎదగాలనీ, అయితే పాటిడిగా వస్తున్న కుటుంబవిలువలను విడువరాదనీ వీరి కతలు చెబుతాయి.

తెలుగులో బండారు అచ్చమాంబా ఇంకా కొందరూ ఇటువంటి కతలను గోదానాయకమ్మ కంటే పదిహేను ఇరవయ్యేళ్లకు ముందే రాసున్నారు. గోదానాయకమ్మ తమ అత్తగారి దగ్గర నుండి తెలుగును రాయడం చదవడం కూడా నేర్చుకొనున్నారు.

ముప్పయ్యవ నలబయ్యవ పదికాలలో చెప్పుకోవలసినవారు ముగ్గురు. ఎం.ఎస్. కమల, కు.ప. సేతు అమ్మ, మువ్వలూరు రామామృతం అమ్మ. ఈ ముగ్గురూ తెలుగువారే. ఎం.ఎస్. కమలగారి గురించి దొరికిన మందల చాలా తక్కువ. వీరు ఆంధ్రతావులో పుట్టి పెరిగినవారు. పెళ్లయినాక చెన్నపట్నానికి వచ్చినారు. ఆ తరువాతనే తమిళం నేర్చుకొని వ్రాతరి అయినారు. ఇంతే వీరి గురించి తెలిసింది. వీరు జమీందారు కుటుంబంలో పుట్టినవారట. పారుల కుదురులో పుట్టినవారనీ, ఇంటి పేరు మంత్రిప్రెగడ అనీ చూచాయగా గురుతున్నట్లు చెన్నపట్నంలోని గురుస్వామిగారనే పెద్దాయన కుటుంబంలో చెప్పినారు. వారు కూడా, ఇది నూటికి నూరుపాళ్లు సరయిన మందలేనని గట్టిగా చెప్పలేకపోయినారు. ఆడన్నువ (స్త్రీవాదం) అనే తలపోత మొదలవడానికి ఎన్నో ఏళ్ల ముందే, ఆడువారి తన్నెనరును (స్వాభిమానాన్ని) తన కతలలో నిలువెత్తున నిలిపినవారు కు.ప. సేతు అమ్మ.

సేతమ్మ మీద ఆమె అన్నగారైన కు.ప. రాజగోపాలన్ వెలుగువ (ప్రబావం) ఉంది. ఆడవాళ్లకూ ఉల్లం ఉంటుందనీ, అందులో కోరికలు ఉంటాయనీ, వాటిని నెరవేర్చుకొనే విచ్చలు (స్వేచ్ఛ) వాళ్లకు ఉండాలనీ తన కతలలో చాటింపు వేసినారు కు.ప.రా. కతలు రాయడమే కాదు, తన ఇంటి ఆడవాళ్ల గురించి అట్లే పట్టించుకొన్నారు. సేతమ్మకు చిన్న ఈడులోనే పెళ్లయి, ఆ ఈడులోనే పెనిమిటి చనిపోయినాడు. సేతమ్మ పెద్దవారు అయినాక ఇంట్లోని పెద్దల్ని ఎదిరించి చెల్లెలికి మరుమనువు చేసినాడు రాజగోపాల్. ఆడామగా నడుమ పొంతును గురించి తెంపుగా రాసినవారు ఈయన. మన చలంతో అంతోయింతో పోల్చదగినవారు తమిళంలో కు.ప.రా. ఒక్కరే. పోల్చడం తప్పో ఒప్పో తెలియదు నాకు. చలంలోని లోతు, చలంలోని వడి, చలంలోని ఒడుపు, చలంలోని తెంపు రాజగోపాలన్‌లో కనబడవు. అరవాసి అయినా కనబడవు. చలం ఇంకా పుట్టలేదు తమిళంలో.

మణికొడి లాగానే 'కలామోహిని' అనే ఆకిక కూడా ఆ తరిలో తమిళంలో పేరు గడించినది. ఇందులో ఆడవారి రచనలు బాగా వచ్చేవి. ఈ ఆకికను నెలకొల్పడంలో సేతమ్మ చేయి ఎక్కువగా ఉంది. దీనిని నడిపే మోపిక(బాధ్యత)ను చాన్నాళ్లు మోసినారు సేతమ్మ. ముందే చెప్పినట్లు సేతమ్మ కతలలో ఆడువారి వెన్ను నిటారుగా ఉంటుంది, కాసంతయినా వంగదు.

మువ్వలూరు రామామృతం అమ్మ. ఈ పేరే ఒక ఎసపు (ఉద్యమం). కరుకయిన వ్రాతలు, పదునయిన పలుకులు. ద్రావిడ ఎసపుకు, రామామృతం రాని చేదోడయినారు. వాదాడి వాదోడయినారు. చేదోడువాదోడే కాదు, ఆ ఎసపుకు వెన్నుదన్నూ కూడా.

ఒక ఎసపు కోసం బతికినంత తరీ(కాలమూ) తన వ్రాతలను సాగించినవారు మువ్వలూరి రామామృతమమ్మ. ఈమెలాగా తను నమ్మిన చిక్కపట్టు(సిద్ధాంతం) కోసమే వ్రాసిన ఆవిడ తెలుగులో నాకు తెలిసి రంగనాయకమ్మ ఒక్కరే. రంగనాయకమ్మ కంటే రామామృతమమ్మ చాలా ఏళ్ల కిందటనే ఈ పనిని చేసినారు.

మగువలలో తెలుగువాళ్లను వెతకడం ఇంకా ఇక్కట్టు అయింది. చిన్నపాటి తోడుపాటు కూడా దొరకలేదు. చాలా చాలా పాటుపడితే, ఇందులో పదమూడుమంది మగువల కతలకు చోటు దొరికింది.

ఇక ఈ నేలన తెలుగు బదుగు(దళిత) వ్రాతరుల గురించి చెప్పడానికి ఏమీలేదు. తెలంగాణాంధ్రలలో లెక్కకు పెద్దగా ఉన్న బదుగులు రెండు గుంపులు; మాల, మాదిగ. ఇది అందరికీ తెలిసిందే. తెన్నాట మూడు గుంపులు; పళ్లర్, పరయర్(మాల), చెక్కిలియర్ (మాదిగ). పళ్లర్లు కావేటికి తెక్కణంగా మట్టుకే ఉంటారు, అందరూ తమిళులే. పరయర్లు వైగేటికి(మదురతావు) వక్కణంగా మట్టుకే ఉంటారు, నూటికి పదిమంది కూడా తెలుగువాళ్లు ఉండరు, తొంబైమందికి పైగా తమిళులే. మాదిగలు తెన్నాడు నాలుగు మూలలా పరచుకొని ఉన్నారు, అందరూ తెలుగువాళ్లే. లెక్కలో మూడుగుంపులూ దాదాపు ఒక్కటే.

పళ్లర్ల నుండీ పరయర్ల నుండీ తెన్నాట, కొమ్ములు తిరిగిన ఏలుబడి తలవరలున్నారు. తెరాట(సినిమా) పోటరు(హీరో)లున్నారు. పెద్ద పెద్ద కవరు(వ్యాపారస్తు)లూ కెలసరు(ఉద్యోగస్తు)లూ ఉన్నారు. వ్రాతరులయితే నూర్ల లెక్కే. తెలుగు వారయిన మాదిగ కుదురు నుండి ఒక్క పేరున్న తలవరలేడు. తెరాట పోటరి కాదు నటుడే లేడు. కవరీ కెలసరీ లేనే లేరు. దివ్వెను పెట్టుకొని... కాదుకాదు దివిటీని పట్టుకొని... లేదులేదు దేబెలుకు(సెర్చ్ లైట్)ను వేసుకొని వెతికితే ఇద్దరే ఇద్దరు వ్రాతరులు దొరికినారు. ఒకరేమో తన కుదురునూ ఇంటిపేరునూ బయట పెట్టకూడదు అని చెప్పి కతను ఇచ్చినారు. ఇంకొకరయితే కతనే ఇవ్వననేసినారు. ఇదీ తెన్నాట తెలుగు బదుగుల నిలవరం.

ఈ కూర్పులోని 'తెల్లారునా, ఎరుకపాలు, పాలవుల్లం, అనుగొసగు, ఎరిగిన మొకం, తలుపు, చెత్తతొట్టి, కమతంగారి ఇల్లు' కతలను తమిళంలో మేలిమి(క్లాసిక్) కతలుగా చెపుతారు.

ఈ కతలను తెలుగు చేయడంలో నేనొక దారిని ఎన్నుకొన్నాను. ఎక్కడా ఏసను వాడలేదు. దాదాపుగా ఆకిక నుడిలోనే చేసినాను. కడతరి అగవనిక(బూతకాల క్రియావాచకం)లను మట్టుకు, 'వచ్చాడు చేసాడు' అని కాకుండా 'వచ్చినాడు చేసినాడు' అని వాడినాను. ఇంగ్లీసు, పర్సో అరబిక్, సంసుక్రుతపు మాటలకు మారుగా, నూటికి తొంబైపాళ్లు తెలుగుమాటలనే వాడినాను. ఆ మాటల తెల్లాలను చివర 'అ,ఆ' వరుసలో ఇచ్చున్నాను.

చివరిమాట. ఇది చిరుపూనిక మట్టుకే. తెలంగాణాంధ్రల బయటి నుండి ఇటువంటివి ఎన్నో రావాలి. వచ్చి, విందెమలా వానమామలా పడమటి కనుమలూ వంగకడలీ నడుమ నుండే తెలుగునేల గురించీ, ఇరవైకోట్ల తెలుగు కందువ(జాతి) గురించీ గొప్పగా చాటాలి. అందుకు ఈ చిరుపూనిక దారిని వేస్తుందని కోరుకొందాం.

# డి.పి.అనురాధకు తాపీధర్మారావు పురస్కారం ఎప్పటికీ గుర్తుండే సభ, ప్రసంగాలు



తెలుగు మూలాలను వెదుకుతూ ఖండాంతరాలు అన్వేషించి, తెలుగు భాషాసంస్కృతులను ప్రపంచానికి తెలిపేందుకు కృషిచేసిన సీనియర్ జర్నలిస్ట్, 'జగమునేలిన తెలుగు' పుస్తక రచయిత్రి డి.పి. అనురాధకు ప్రతిష్ఠాత్మకమైన తాపీ ధర్మారావు పురస్కారం అందించడం అభినందించదగ్గ నిర్ణయమని తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ డా. జి రాధారాణి అన్నారు.

ప్రముఖ పత్రికాసంపాదకుడు సామాజికవేత్త, సంస్కర్త కవి, రచయిత తాపీ ధర్మారావు పేరిట నెలకొల్పిన తాపీ ధర్మారావు పురస్కారం-2021 ప్రదాన సభ డిసెంబర్ 12న హైద్రాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కామర్స్ కాలేజీలో తాపీ ధర్మారావు వేదిక, విజయవాడ వారి ఆధ్వర్యంలో గొప్పగా జరిగింది. సభికుల హర్షధ్వానాల మధ్య పురస్కార గ్రహీత అనురాధను దుశ్శాలువాతో సత్కరించిన అనంతరం, జస్టిస్ డా. జి రాధారాణి ఆమెకు పురస్కారాన్ని అందజేశారు.

కవి, రచయిత, పరిశోధకులు ఆచార్య జయధీర్ తిరుమల రావు అధ్యక్షత వహించిన యీ సభలో ముఖ్య అతిథిగా న్యాయమూర్తి రాధారాణి పాల్గొనగా, అనురాధ రాసిన 'జగమునేలిన తెలుగు గోదావరి నుంచి జావా దాకా'- అనే చారిత్రాత్మక పరిశోధనా నవలను ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఏ. రామలింగేశ్వరరావు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా డా॥ జయధీర్ తిరుమలరావు అధ్యక్షోపన్యాసంలో తమిళులు తమ ఉనికి గురించి, భాషా సంస్కృతుల గురించి, వారి భాషా సాహిత్య వైశిష్ట్యాన్ని గురించి ఇటీవల ఎక్కువగా చెప్పుకుంటున్నారన్నారు. అది తమ భాషా, సాహిత్యాల ప్రాచీనత గురించి గర్వంగా ముందు తరాలకి అందించే ప్రయత్నమే! ప్రపంచ వ్యాప్తంగా వారు చొచ్చుకొనిపోయి ఉండటంతో వారి భాషాసాహిత్యాలను శోధించే అవకాశం వారికి కలిగింది. అందుకే వారు ముందు తరాలకు ఆయా వివరాలు అందించే ప్రయత్నం ముమ్మరం చేశారు అని అన్నారు.

అయితే, ఈ గుణం తెలుగు వారికి 2, 3 శతాబ్దాల పూర్వం నుంచే ఉందని, శాతవాహనుల కాలంలో కూడా ఈ లక్షణాలు గుర్తించబడ్డాయన్నారు. క్రీ. శ 18వ శతాబ్దం వరకూ ఇక్కడి పండితులు, మత ప్రచారకులు భాషావేత్తలు, కవులు, శిల్పులు వంటి అనేక మంది విదేశాలకు తరలి వెళ్ళి, అక్కడ స్థిరపడి తమదైన ముద్రను వేసి మన సంస్కృతికి సంబంధించిన ఆనవాళ్ళు వదిలి వెళ్ళారని ఆయన అన్నారు.

ప్రస్తుత ఆధునిక కాలంలో వలసల వరుస మొదలైనా, విదేశాలకు కేవలం ఉద్యోగాలం, చదువుల కోసం మాత్రమేవెళ్తున్నారు. కానీ గతంలో అందుకు భిన్నంగా కొన్ని ప్రత్యేక పరిస్థితులలో అక్కడికి వలన వెళ్ళి, అక్కడి ప్రజలతోమమేకమై,



అక్కడి భాషను అధ్యయనం చేసి, ఇక్కడి సంస్కృతి సంప్రదాయాలని వారికి నేర్పి, అక్కడ నగరాలు నిర్మించి, తెలుగు భాషా, సంస్కృతులను కోల్పోకుండా అక్కడి భాషల్లోకి తర్జుమా చేసి, ఆ సమాచారం ఇప్పటివరకూ నిలిచి ఉండేలా తమదైన శైలిలో ఆనాటి తెలుగు వారు కృషి చేశారని ఆయన అభిప్రాయపడ్డారు. కానీ మన పరిశోధకులు వాటిని ఎక్కువగా పట్టించుకోలేదు. చరిత్ర పరిశోధనకు సంబంధించి, శాసనాలు, గ్రంథాలు చాలానే ఉన్నాయి. కానీ శాసనాల ఆధారంగా మాత్రమే చరిత్రను పరిశోధించారని, ఇతర మార్గాలను పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు.

అవార్డు గ్రహీత, రచయిత్రి అనురాధ గురించి మాట్లాడుతూ, అమె మరింత విస్తృతంగా, విషయం లోతుల్లోకి వెళ్ళి అక్కడి స్థితిగతులను, వారి భాషా వ్యవహారాలను శోధించి నవల రాసినట్లు స్పష్టంగా తెలుస్తుందన్న ఆయన ఒక జోలపాటకు సంబంధించి, అందులో ఎక్కడి పదాలు వాడారనే సూక్ష్మ పరిశీలన, కృష్ణ గోదావరి నదులు దాటి తెలంగాణా నుంచి తాము వచ్చి స్థిరపడ్డాము అని చెప్పి వారి ప్రాంతంలో ఆ పాట నేటికీ అక్కడ మనుగడలో ఉంది అని గుర్తించడం, వారు నేరుగా చెప్పగా విని, కని, వాళ్ళతో మాట్లాడి మూలాల అన్వేషణ చేయడం అసాధారణ పరిశోధనని తలపించిందన్నారు.

తెలుగు వారు ఏ ఏ ప్రాంతాలలో స్థిరపడ్డారు, తెలుగు భాషా సాహిత్యాలు ఏఏ రాష్ట్రాలలో విస్తరించిఉంది అనే విషయానికి సంబంధించి, లోతట్టు దక్షిణం వైపు ప్రాంతాలలో కూడా పరిశోధించాం కానీ, ఉత్తరం వైపు అదే స్థాయిలో పరిశోధనలు జరగలేదు. తెలంగాణా దాటి, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒరిస్సా వైపుగా పరిధిని తెలుగు పరిశోధకులు పెంచుకోవలసి ఉంది. కానీ ఎందుకో అలాంటి ప్రయత్నాలు తక్కువగానే జరిగాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ స్నేహితుడు, పి. లాల్ (పురుషోత్తం లాల్) అనే రచయిత సుమారు 50 ఏళ్ళ క్రితం, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆర్థిక సహకారంతో, సౌత్ ఏషియన్ కల్చర్స్, అనే పేరుతో, వివిధ దేశాలలోని భారతదేశ సంస్కృతి గురించి ఓ పుస్తక రూపంలో తెచ్చారు. ఆయన కూడా వస్తు సంస్కృతి గురించే ప్రధానంగా చర్చించారు. సాంఘికము, సంస్కృతి, సాహిత్యము , సంగీతము వంటి ఇతర అంశాల జోలికి పోకుండా ఒక సాధారణ చరిత్ర పరిశోధకుని లాగానే ఆయన పరిశోధన జరిగింది. ఎన్నో ఫోటోలు సేకరించి అందులో పొందుపరిచారు. ఆ ఫోటోలలో కూడా తెలుగు సంస్కృతికి సంబంధించి, ఊర్లు కావచ్చు, నగరాలు కావచ్చు, పీఠాలు కావచ్చు అనేకం ఉన్నాయి.

ఆయా ప్రాంతాలలో కూడా తెలుగు ప్రాంతాల తరహాలో నిర్మాణాలు, వందల ఏళ్ళకు పూర్వమే నిర్మించబడి ఉన్నాయి. ఇక్కడి నమూనాలనే అక్కడ నిర్మించారు. ఇక్కడి శిల్పులే అక్కడికి వెళ్ళి అవే నమూనాలను అక్కడి అవసరాలకు , పరిస్థితులకు అనుగుణంగా నిర్మించారు. తెలుగు వారి శిల్ప సంప్రదాయం ఎంతో అభివృద్ధి చెందింది. శిల్ప సంప్రదాయంలో మట్టి తవ్వడం, నిర్మాణం చేయడం కూడా అందులో ఉంది. అనేక హిందూ శిల్పరీతులున్నాయ్, బౌద్ధ శిల్ప రీతులున్నాయ్, హిందూ ధర్మ సంబంధిత ఆకృతులు, పెద్ద పెద్ద కట్టడాలు , నిర్మాణాలు కూడా ఉన్నాయ్. అలాంటి ఒక ఘనమైన చరిత్రే ఉంది. అయితే ఇదంతా భారతీయ సంస్కృతిలో భాగంగానే చెప్పబడింది. ఇవి ఇతమిద్ధంగా ఫలానా రాష్ట్రీయులకు సంబంధించినవి అని ఎక్కడా చెప్పబడలేదు. నార్త్ ఇండియాకి చెందిన కొందరు శిల్పుల గురించి పేర్కొన్నారు తప్ప, దక్షిణ భారతీయ రీతుల గురించి, శిల్పుల గురించి భారతీయ చరిత్రకారులు చెప్పలేదు. ఆ రకంగా తెలుగు వారికి అన్యాయం జరిగిందని జయధీర్ తిరుమలరావు అభిప్రాయపడ్డారు. అంతేగాక, కొంత తెలుగు ఆధారంగా పరిశోధన చేసినవారు కూడా అవి తమవి అని చెప్పుకునే పరిస్థితులు లేకపోవడాన్ని గమనించాలన్నారాయన.

అనురాధ రాసిన నవల చరిత్రలో అన్వేషణకు సంబంధించింది. ఆ అన్వేషణ దేనిలో అంటే, తెలుగుజాతి, సంస్కృతి, భాష, సాహిత్యాలు చూస్తూ, వింటూ, వాటి మూలాలు వెదకడం కోసమే ఎన్నో దేశాలు ఆమె తిరిగారు. ఆమె వ్యాసాలు అచ్చయ్యాయి. ఆ తర్వాత ఆ మూలాలకు సంబంధించిన వివరాలు పొందుపరచి, నవల రూపంలో తెలుగు వారి ముందుకు తీసుకువచ్చారని, ఆ నవల ఆవిష్కరించుకోవడం మంచి పరిణామమని , వారి కృషికి తగిన రీతిన తాపీ ధర్మారావు పురస్కారం కూడా అందజేయడం అభినందనీయమని జయధీర్ తిరుమలరావు అన్నారు.

**స.వెం. రమేశ్ ప్రసంగంలో వెల్లడైన ఎన్నో సంగతులు**

ఆత్మీయ అతిథి, తెలుగు భాషా పరిశోధకులు స.వెం. రమేశ్ మాటలు క్లుప్తంగా, తను, పురస్కార గ్రహీత అనురాధ ఇద్దరూ కవల పిల్లలుగా ప్రచారం జరగడం భాషా ప్రేమికుడిగా ఆనందం కలిగిస్తోందన్నారు. దానికి కారణాలనుచెబుతూ ఇద్దరం ఒక్క లాగానే కలుసుకున్నాం, ఆలోచించాం, ఇద్దం ఒక్కలాగనే వెదుకుతున్నాం. పెద్దవాడిగా తాను



పరుగు ఆపేసిన చోటునుంచే, చెల్లెలు అనురాధ అడుగులు వేయడం మొదలుపెట్టింది. అనురాధ చిన్న వయసులోనే తాపీ ధర్మారావు పురస్కారం అందుకోవడం గొప్ప విషయం. దాని వెనుక అవిరళ కృషి ఉంది. 2011 లో పరిచయమైనప్పుడు ఆమె టివి9లో పని చేసేవారు. తెలుగు వారి గురించి చెప్పడం మొదలు పెడితే, వింధ్య పర్వతాల నుండి తమిళనాడులోని కన్యాకుమారికి కాస్త ఎగువన ఉండే, వానమామల వరకూ తెలుగువారు విస్తరించి వున్నారు. కోస్తాంధ్రలో మాట్లాడే మర్యాద భాష తాలూకు ప్రతిభ తెలంగాణా, రాయలసీమ, తమిళనాడు ప్రాంతాల తెలుగులో ఉండదు. 'అన్నా' అనేస్తాం. 'గారు' ఉండదు. తెలంగాణా అమ్మాయి కదా, తనని పలకరించినపుడు మొదటి సారి 'అన్నా' అని పలకరించారామె. ఈమె మనమ్మాయి లాగా ఉందే అనిపించింది. "అన్నా! మీరు



తాపీ ధర్మారావు



డి. పి. అనురాధ

# మన్నన

శ్రీలంకకు వెళ్లిన తెలుగువాళ్లం ఎవరయినా ఏం చూడాలనుకొంటాం? ఏం చూసేసి వస్తాం? బౌద్ధారామాలనో, శాంకరి శక్తిపీఠాన్నో, ఇంకా కావాలంటే నూవర ఎలియా వేసవివిడిదినో, గాలె ప్రాంతపు కడలితీరాలనో చూసివస్తాం. అనురాధది ఆ చూపుకాదు, తనది తనకే చెందిన తెలుగు చూపు. మనం మరచిపోయిన తెలుగుతనాన్నంతా మనముందుంచే చూపు. ఆ చూపే, పాములీ్న కోతులీ్న ఆడిస్తూ, పొట్టపోసుకొని తిరుగుతున్న లంకమూలవాసులైన తెలుగువారిని మనకు చూపిస్తుంది. ఆ చూపే, కొలంబో నగరంలోని కోపియవత్త అనే బడుగువాడ తెలుగు బతుకుల్ని మన కనులకు కడుతుంది. ఆ చూపే, మయన్మార్ మన్ తెగవారి జోలపాటలోని 'తెలంగాణ' మాటను గుచ్చి వెలికితీస్తుంది. ఆ చూపే, ఇండోనేషియా చామదేవిని తెలుగురాణి అని ఎలుగెత్తి చాటుతుంది. ఆ చూపే, ఆగ్నేయాసియా దేశాలనిండా అల్లుకొనిపోయున్న తెలుగువెలుగును మనకు మిరుమిట్లుగొలిపిస్తుంది. అనురాధకు పర్యాటకప్రాంతాలతో పనిలేదు. బోరోబుదూరు స్తూపం కావచ్చు, దరదమాళిగ గుడి కావచ్చు, శీగిరి కొండ కావచ్చు, అంకోర్‌వాట్ ఆలయాలు కావచ్చు, బాలి రామాయణాలు కావచ్చు, మలేసియా పల్లెపేర్లు కావచ్చు, ఎక్కడకు వెళ్లినా లోతులకువెళ్లి అక్కడున్న తెలుగుదనాన్ని బయటవేయడం మట్టుకే అనురాధ పని. అనురాధ, పొట్టచేత పట్టుకొని విదేశాలకు వలసవెళ్లిన తెలుగుకుటుంబాల అమ్మాయికాదు. నుడులపేరుతో నాడులు వేరుపడినపుడు, పొరుగునాడులలో మిగిలిపోయిన అమ్మాయి కాదు. వాళ్లయితే వాళ్ల ఉనికికోసం చేసే పోరాటంలో తమ మూలాలను తవ్వుకోవడం సహజం. అనురాధ తెలంగాణ గడ్డపై పుట్టిపెరిగింది. తెలంగాణాంధ్రాలలో ఎవరికీ పట్టని, ఎక్కడో ఉన్న తెలుగు ఉనికినీ చరిత్రనీ వెలికితీసే పనిని పెద్దగా తలకెత్తుకొని చేయడం అనురాధ గొప్పదనం. అనురాధ తెలుగు మగువ కావడం తెలుగుజాతికే గర్వకారణం.

అనురాధ, తను చెప్పదలచుకున్న చారిత్రిక వాస్తవాలను ఇదివరకు అమ్మనుడితో సహా పలుపత్రికలలో వ్యాసాలుగా వ్రాసింది. వాటిని ఇంకా ఆసక్తిదాయకంగా చదివించడానికి, దీనిని కాల్పనికనవలలో చొప్పించి అందంగా చెప్పింది. అందువల్ల అన్ని తీరుల చదువరులూ ఇష్టంగా చదువగలుగుతారు. ఇదొక చారిత్రిక కాల్పనిక రచన. ఇతర రచయితలకొక కొత్తదారిని చూపిన రచన.

తెలుగుజాతి ట్రస్టు ప్రచురిస్తున్న 'అమ్మనుడి' పత్రికలో తొలుత ధారావాహికగా వెలువడిన ఈ రచన అందరి మన్ననలను పొందింది. అనురాధ, ట్రస్టు పాలకమండలి సభ్యురాలుగా సంస్థకు కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసింది.

ఇప్పటివరకు తాపీధర్మారావు పురస్కారాన్ని పొందినవారికంటే వయస్సులో చిన్నదైన అనురాధ, ప్రింట్ ఎలెక్ట్రానిక్ మీడియాలు రెండింటిలో పాతికేళ్ల అనుభవాన్ని సంపాదించింది. ఎల్‌ఎల్‌బి చేసినా జర్నలిస్టుగా స్థిరపడింది. దేశవిదేశాల్లో మరుగునపడిన తెలుగుజాతి అడుగుజాడలను పరిశోధించి, మూలాలను స్పృశించి చెప్పడమే తన ప్రత్యేక అభిరుచి అని వినయంగా వెల్లడించిన అనురాధకు తాపీధర్మారావు పురస్కారాన్ని అందించి గౌరవించగల అవకాశం మాకు కలిగినందుకు సంతోషిస్తున్నాము.

అనురాధ సొంత ఊరు మహబూబ్‌నగర్ అయినా, చదువూ ఎదుగుదలా అంతా రెండు తెలుగురాష్ట్రాలతోనూ ముడిపడివుంది. కనుక ఆమె మొత్తం తెలుగుజాతి వారసత్వాన్ని పుణికిపుచ్చుకొంది. పెద్దలు ఆశిస్తున్నట్లు, అనురాధ, ఇంతవరకూ తాను చేసిన కృషితో సంతృప్తిచెంది ఊరుకోకూడదు. మరింత లోతుగా, బలంగా, విస్తృతంగా తన పరిశోధనను కొనసాగించి తెలుగుజాతి మన్ననలను మరింతగా అందుకోగలదని ఆశిస్తూ ఈ మన్ననపత్రాన్నీ పురస్కారాన్నీ అందజేస్తున్నాము.

శ్రీలంకకు పోయి వస్తుంటారట కదా, నేనూ పోయి రావాలనుకుంటున్నాను, వివరాలు కావాలి" అని ఆమె అడగడంతో అక్కడి వివరాలనందించానని వారి పరిచయాన్ని గుర్తుచేసుకున్నారు. శ్రీలంక వెళ్ళారు. ఈ పుస్తకం రాశారు అని తెలిపారు. శ్రీలంక మూల వాసులు ఎవరు? అని అన్వేషణలో ఆమె తనకంటే ఒక్క అడుగు ఎక్కువ వేశారని తెలిపారు.

అక్కడ జాతుల మధ్య అంటే సింహళులకి, తమిళులకి మధ్య చాలా కాలంగా ఘర్షణలున్నాయి. వారిలో మూలవాసులెవరు అని అక్కడి ఆంత్రోపాలజిస్ట్‌లు వెదగడం మొదలు పెట్టారు. అలా వెదికి మూడు జాతులు మూలవాసులుగా గుర్తించారు. దానిలో రెండు జాతులు తెలుగు మాట్లాడుతున్నారు. ఇవి స్వంతంగా చెబుతున్నవి కాదు. అక్కడి ఆంత్రోపాలజీలో వచ్చిన పుస్తకాల ఆధారంగా చెబుతున్నవని రమేశ్ తెలిపారు.

"గతంలో మేము వెళ్తున్నప్పుడు పాములు వాళ్లని కలిశాం. కోతులు ఆడించే వాళ్ళనీ కలిశాం. ఈ రెండు తెగల వాళ్ళు 25,000 మందికి పైగా ఉంటారు. వీరితో సంబంధం లేకుండా, తమిళ ప్రాంతంలో అంటే ఉత్తర ప్రావిన్స్, తూర్పు ప్రావిన్సు, కొలంబో నగరం ప్రాంతాలలో తమిళులుగా ముద్రపడిన వారు 8.5 లక్షల మంది తెలుగు వారు ఉన్నారన్నది వాస్తవం. 'ఆల్ శ్రీలంక తెలుగు కాంగ్రెస్' అనే ఒక పార్టీ కూడా శ్రీలంకలో ఉంది. వాళ్ళని గతంలో కూడా కలిశాం. వాళ్ళలో మాణిక్యం అనే వ్యక్తి ఉన్నాడు, ఆటో తోలుతుంటాడు. అతని నుంచి అనేక వివరాలు సేకరించాం" అని రమేశ్ తన అనుభవాలను చెప్పుకొచ్చారు.

ఇవన్నీ కాకుండా, రమేశ్ కంటే అనూరాధ ఎక్కువ అడుగు ఎక్కడ వేశారంటే, అక్కడ 'నాపోర్' అనే ఒక సంచార జాతి ఉంది. వాళ్ళు తెలుగు మాట్లాడతారు. ఆ జాతి వారిని తాను 4 సార్లు శ్రీలంక వెళ్ళినా కూడా కలవలేకపోయానని చెప్పారు. దానికి కారణం వివరిస్తూ, శ్రీలంక వెళ్ళిన వెంటనే పాములు ఆడించే వాళ్ళ వద్దకు వెళ్ళే వాడినని, వారు 'నాపోర్ జాతి వద్దకు వెళ్ళనిచ్చేవారు కాదని తెలిపారు. పాములవారు, కోతులవారు చెప్పేదేమిటంటే, ఆ 'నాపోర్' అనే జాతి దొంగతనాలు చేసే తెగ అని చెప్పి భయపెట్టేవారు. కానీ అనురాధ వారిని కూడా కలిసి అన్న కంటే ఒక అడుగు ముందుకు వేశారని అనురాధని ఆయన కొనియాడారు. వాళ్ళు కూడా జాగ్రత్తగా అనురాధని చూసుకున్నారు. ఈ పుస్తక రచయిత ప్రత్యేకత ఏమిటంటే, ఆయా ప్రాంతాలకు సరదాగా వెళ్లడం కాదు, పైపైన తిరగడం కాదు, అక్కడి వారితో కలిసిపోవడం ఆమె ప్రత్యేకత, ఆమె ఎక్కడా రాజీపడలేదు. ఆడతనం ఆమె పరిశోధనకి ఎక్కడా అడ్డు రాలేదు. తనని వెళ్లనివ్వని వారు, అనూరాధని కూడా వెళ్లనివ్వలేదు. కానీ, ఆమె మాత్రం ఆ ప్రాంతానికి వెళ్లనని వారికి చెబుతూనే ఆ తెగ వారుండే 'పుత్తళం' అనే ప్రాంతం వెళ్ళిపోయి, అనేక వివరాలు బయటపెట్టారని రమేశ్ తెలిపారు.

వీరే కాకుండా ఇంకా రెండు తెగల వారున్నట్లు మాకు ఆధారాలు దొరికాయి. అనూరాధకు, తనకూ ఆ వివరాలు సేకరించాల్సిన బాకీ మిగిలి ఉందని చెబుతూ, జాఫ్నా ప్రాంతంలో 'అల్లంపల్లి' అనే ఊరులో ఒక తెగవారు ఉన్నారు. వారిని 'ఇసిరోళ్ళు' అంటారుట. 'నాపోర్'లు తెలియకుండ చాకచక్యంగా దొంగతనం చేస్తారు. కానీ 'ఇసిరోళ్ళు' కొట్టి లాక్కుంటారుట.

ఇక ఇంకా చెప్పాలంటే అనురాధ అన్వేషణ శ్రీలంకతో ఆగిపోలేదు. శ్రీలంక నుంచి మయన్మార్ దేశానికి వెళ్ళారు. అక్కడ తెలుగు వాళ్లకోసం వెదుకుతున్న సమయంలో ఈమెకు ఒక పాట వినిపించింది.

"కూన్ సమయా తిలంగాన దేసటోన్ మొన్ సమొన్ కౌ సా ఉన్ చకమున్ దౌం తరౌం దెహ్ పొబ్బ త్వై వాగెదోం టోం త్రిం పర్యా న్వా సువణ్ణ మించెలా సుద్ద పలతరె య్ కొ చొకలొం రూం" ఇది ఆదేశంలో ఒక భాషలోని ఓ జోలపాట. ఆ పాటకు తెలుగు అర్థం ఏమిటంటే,

" ఓ కొడుకా, మన నేల తెలంగాణ. మన రాజుకు అదృష్టం బాగాలేక యుద్ధంలో ఓడిపోతే మనం పడవల్లో ఎర్రరాళ్ళున్న ఈ సువర్ణ భూమికి వచ్చాం" అని తెలుగు అర్థం. అంటే వారంతా, శతాబ్దాలక్రితం తెలంగాణా నుంచి వలస వచ్చేశారట, ఆ చరిత్రని పాట రూపంలో ఒకామె పాడుతుంటే అనురాధ ఆ పాటను రికార్డు చేశారు. ఎప్పటి వాళ్లో, వందలు కాదు, వేల ఏళ్ల క్రితం జరిగి ఉంటుంది వారి యానం అని ఆ పాటను ఉటంకిస్తూ ఆయన అభిప్రాయపడారు.

ఆ జోల పాట విన్న తరువాత, అనురాధ వారితో మాట్లాడుతూ, తెలంగాణా అనేది ఒక ప్రాంతం అని, ఇప్పుడు కొత్త రాష్ట్రంగా ఏర్పడిందని చెబితే వాళ్ళు సంతోషం పట్టలేకపోయారుట. అక్కడ నుంచి ఆమె తెలుగు వారు ఆగ్నేసియా దేశాలు వెళ్ళి ఆయా రాజ్యాలను ఎవరు పరిపాలించారో, వారిలో తెలుగు ప్రాంతాల, పేర్ల ప్రస్థావన ఎందుకుంది అనే విషయాలను అక్కడి లోతులకు వెళ్ళి పరిశీలించారు అని రమేశ్ తెలిపారు.

థాయిలాండ్‌లో చామదేవి అనే రాణిది పెద్ద విగ్రహం ఉంటుంది. అక్కడికి కూడా వెళ్ళారు అనురాధ. చాలా చోట్లకు వెళ్లారీమె. నేరుగా వెళ్లారు. వెతికి వెతికి లోతులకివెళ్ళి, తెలుగును తెచ్చుకున్నారు. ఆ విషయ సమాచారం క్రోడీకరించి 'జగమునేలిన తెలుగు' అని ఒక నవల లాగా రాశారు. ఇది ధారావాహికగా అమ్మనుడి పత్రికలో ప్రచురితమైంది.

ఆ సమయంలో బావుందన్న వారు, వ్యాసాల్లా ఉందని నొసలు చిట్లించేవారూ నాకు ఫోన్ చేశారు. ఏది ఏమైనా ఆ ధారావాహిక అనేక మందిని చదివించింది, అంటే కదిలించిందని ఆయన అన్నారు.

తిరుమలరావు గారన్నట్లు, తెలుగు వాళ్ళు చాలా చాలా దూరం వలస వెళ్లారు, వారి వలసల్లో ఒక కోణాన్ని మాత్రమే చెప్పుకుంటుంటాం, దానినే పుస్తకాలలో రాసుకుంటున్నాం. కానీ నాణేనికి ఇంకోవైపు మనం తాకడానికి భయపడ్డాం. అసహ్యించుకుంటాం, ఏదేమైనా అటు వైపు మాత్రం చూడటానికి ఇష్టపడం. అదేమిటంటే, రాజ్యాలు పరిపాలించారు. రాజ్యాల నిర్మాణం చేశారు వంటి విషయాలు మనవాళ్ళు చెప్పుకున్నారు పాత రోజుల్లో. కానీ తెలుగు వాళ్ళు కోతులు, పాములు ఆడిస్తున్నారు, దొంగతనాలు చేస్తూ జీవిస్తున్నారు అని మనం చరిత్ర పుటల్లో చూడలేదు. అంతేగాక తెలుగు జాతి ప్రాచీనత్వం గురించి మాట్లాదేప్పుడు మన వారిలో కొంత వెనుకబాటుతనం తొంగిచూస్తుంటుంది. అప్పుడప్పుడూ రాజీ ధోరణిలా కూడా



అనిపిస్తుంటుంది అని ఆవేదన వ్యక్తం చేశారు.

చరిత్రకారులు 'నోటి కథ'లను పట్టించుకోలేదని, చరిత్రలో వాటి ప్రాముఖ్యత అధికమని, వాటిని చూసే చూపు నాకు ఇచ్చినది జయధీర్ తిరుమలరావు అని తెలిపారు. గతంలో నేను విస్తృతంగా తిరిగేవాడిని, ఏవేవో లల్లాయి పదాలు శోధించేవాడిని. కానీ నోటి కథలను పట్టించుకోవాలన్న చూపు ఇచ్చినవారు మాత్రం తిరుమలరావు గారే.

గతంలో తంజావూరు నగరాన్ని శుభ్రం చేసే వారి దగ్గర ఒక 'నోటి కథ' తనకు దొరికిందని. అది వారు చెప్పిన కథ. దానికి ఏ శాసనాలూ ఆధారాలుగా ఉండవు. ఆ కథ ప్రకారం రాజేంద్ర చోళుడు, రాజరాజ నరేంద్రుడు బావ బావమరుదులు. ఆయన రాజమండ్రి నుంచి తంజావూరు ఒక సారి రావడం తటస్థించింది. అలా వచ్చిన రాజరాజనరేంద్రుడు తంజావూరు నగరమంతా కలియతిరిగాడు. తర్వాత రాజేంద్ర చోళుడు, రాజరాజనరేంద్రుడు మధ్య పిచ్చాపాటి చర్చలో "బావా తంజావూరు నగరం ఎలా వుంది" అని అడిగాడట రాజేంద్ర చోళుడు. దానికి సమాధానంగా రాజరాజనరేంద్రుడు, "మీ నగరం అంతా బావుంది కానీ వీథులన్నీ మురికిగా ఉన్నాయి, వినోదానికి ఒక్కటి కూడా లేదు బావా" అని, పారిశుధ్య నిర్వహణ లోపం, కళలకు వేదిక లేకపోవడం కొరత అని చెప్పాడట.

"ఎంత చెప్పినా ఎవరూ శుభ్రంగా ఉండటం లేద"ని రాజేంద్ర చోళుడు చెబితే, "దానికి వ్యవస్థ ఒకటి ఉండాలి, తాను పంపిస్తాన"ని చెప్పి, తంజావూరు నగరం శుభ్రం చేయడానికి తమని, వినోదం కోసం దేవదాసీలను పంపించారు అని అక్కడి మురుగు శుభ్రం చేసే వాళ్ళు ఓ కథ చెప్పినప్పుడు తాను ఆశ్చర్యపోయానని రమేశ్ అన్నారు.

ఇలాంటి చరిత్ర విశేషాలు ఏ శాసనంలోనూ దొరకవు. అంటే చోళనాడులో అంటే పాత తంజావూరు, పాత తిరుచినాపల్లిలో ప్రాచీనకాలం నుంచి ఇప్పటివరకూ వీధులని శుభ్రం చేస్తునది 'పియ్యవడ్డెరలు' అనే తెలుగువారు. కొంగునాడు ప్రాంతాలలో అంటే పాత కోయంబత్తూర్ జిల్లాలో మురుగు కాలువలు శుభ్రం చేసేది 'దొమ్మరి'వాళ్లనే తెలుగువాళ్ళు. సేలం ప్రాంతాల్లో ఆపని చేసేవారు 'పన్నియాండి' అనే తెలుగువాళ్ళు. మదుర ప్రాంతాల్లో ఆ పనిచేసేది, 'కొట్టునాయకర్' అనే తెలుగువాళ్ళు. కర్ణాటకలో మైసూరు, బెంగుళూరు ప్రాంతాలలో ఆ పని చేసేది, 'మాదిగ'వారనే తెలుగువారు. హళేబీడు, బేలూరు, శ్రావణ బెళగొళల ప్రాంతాల్లో ఆ పనిచేసేది, జాడుమారు అనే తెలుగువాళ్ళు. ఢాకా నగరాన్ని తుడిచేది పదివేల మంది మాలవాళ్లనే తెలుగువాళ్ళు.

లాహోర్ నగరాన్ని శుభ్రం చేసేది తెలుగువారు. శ్రీలంకలోని కొలంబోని శుభ్రం చేసేది, జాఫ్నా నుంచి, బట్టికలోవ వరకూ ప్రతి ప్రాంతాన్ని శుభ్రం చేసేది వడ్డెరలు అనే తెలుగువాళ్ళు.

తెలుగుజాతి గొప్పతనం అనేక విషయాల్లో ఉంది. కేవలం రాజ్యం పరిపాలించారనడం ఒక్కటే కాదన్న విషయాన్ని మరుగున పెట్టేశారు చరిత్రకారులు. పాలించడం కాకుండా అవతల ఇంకొక కోణం ఉంది చూడండి అది చాలా గొప్పతనం. నగర నిర్మాణ వ్యవస్థ ఉండీ నగరం శుభ్రం చేసే వ్యవస్థ లేకపోతే ఉపయోగం ఏముందీ? అంటే నగర నిర్మాణాలప్పుడే నగరం శుభ్రం చేసేందుకు నాణ్యత కలిగిన పనివారుగా తెలుగు వారు పేరొందారన్న విషయం ఎంత మంది భారతీయులకు తెలుసు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడికి వెళ్ళినా, ఏ చోటకు వెళ్ళినాగానీ, తెలుగు వారే ఇప్పటికీ శుభ్రం చేస్తున్నారు.

అనురాధ ఆ చూపులోంచే, జనాలలోకి తొంగిచూడగలిగింది. అయితే అనూరాధ చేసింది కొంచెమే! ఇంకా చేయాల్సింది చాలా ఉంది. ముందు ముందు ఇంకా చేస్తుందని ఒక ఆశ అని ఆశాభావం వ్యక్తం చేసిన రమేశ్ ఈ పుస్తకం తెలుగు వారందరూ చదువ వలసిన, చాలా గొప్ప విషయాలు పొందుపరచిన పుస్తకం అని కొనియాడారు.

**సాహసోపేతం**

'జగమేలిన తెలుగు' నవలను ఆవిష్కరించిన అనంతరం ఆంధ్ర ప్రదేశ్ హైకోర్ట్ పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఏ.రామలింగేశ్వరరావు మాట్లాడుతూ, ఒక న్యాయశాస్త్రం చదివిన ఒక జర్నలిస్టు ఖండాలు దాటి భాష మూలాలపై పరిశోధించడం అంటే చాలా సాహసోపేతమైనచర్య అని, అందరూ రచయిత అనూరాధను అభినందించవలసిన విషయం అని అన్నారు. ఈ నవల రాయడంలో, శోధనలో అనూరాధకు సహకరించిన సవెం రమేశ్, ఈమని శివనాగిరెడ్డి లే కాకుండా పుస్తకాన్ని ముంద్రించేందుకు ఆర్థిక సహకారం అందించడానికి ముందుకొచ్చిన బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి అభినందనీయులు అన్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ విధానాలు తెలుగు భాష మొదలునే నరికేస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఇలాంటి పుస్తకాల వల్ల భాషను బ్రతికించుకోవడానికి పెద్దగా ఉపయోగపడకపోవచ్చు కాని తెలుగుజాతికి చెందిన వారంతా, తమకి ఇంత గొప్ప చరిత్ర ఉంది అని చెప్పుకోవడానికి మాత్రం కచ్చితంగా ఉపయోగపడుతుంది.

ఈ పరిశోధనాత్మక నవల అందుబాటులోకి తెచ్చిన తర్వాత తెలుగు వారిపై మరింత బాధ్యత పడిందని, ఇది మొదలు మాత్రమే కనుక ఒక్కో దేశంలో తెలుగు భాష, సంస్కృతి, జాతి వంటి విషయాలపై పరిశోధన విస్తృతంగా చేయాల్సిన అవసరం ఉన్నదని

ఆయన అభిప్రాయపడ్డారు.

తెలుగు రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాల తెలుగు శాఖలు కానీ, సామాజిక విభాగాలు కానీ, ఈ విషయాలపై పరిశోధన కొనసాగిస్తే, ఇంకా అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

భాష పరంగానే కాకుండా, సామాజికపరంగా ఎంతో మనకి కనువిప్పు కలిగిస్తుంది. మనం భాష గురించి ఆలోచించేటప్పుడు, అగ్రకులాలు మాట్లాడే తెలుగు, వేరే కులాల వారు మాట్లాడే తెలుగు అని ఏమీ వ్యత్యాసం ఉండదు. తెలుగంటే తెలుగే అని ఆయన అన్నారు. ఈ పుస్తకం అందరూ కొని, లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. విదేశాలకు వలస వెళ్లడమే కాకుండా, అక్కడి సంస్కృతితో మమేమకమై, తెలుగుభాషా మూలాల పై చర్చించి, శోధించి, వాటిని గ్రంథస్థం చేసి, అనురాధలా రానున్న తరాలకి అందిస్తే బావుంటుందని రామలింగేశ్వరరావు అన్నారు. అట్టహాసంగా తెలుగు మహాసభలను జరుపుకోవడం కన్నా, ఇటువంటి కార్యక్రమాలని చేపడితే చాల బావుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.



**ప్రోత్సాహకం మాత్రమే**

అమ్మనుడి సంపాదకులు, తాపీ ధర్మారావు వేదిక సమావేశకర్త డా. సామల రమేష్ బాబు సభనుద్దేశించి మాట్లాడుతూ, సవెం రమేశ్ తెలుగు భాషోద్యమంలో నాకు దొరికిన కొడుకయితే, అనురాధ కూతురు. వీరిద్దరూ నాకు రెండు కన్నులని, పురస్కార గ్రహీత అనురాధని కన్న తల్లిదండ్రులు, అత్తమామలు అదృష్టవంతులని అన్నారు. అనురాధకు తాము అందిస్తున్న పురస్కారం ఆమెపై భారం ఉంచడం కాదని, జర్నలిస్ట్‌గా అది ఆమె బాధ్యతను పెంచేందుకు ఒక ప్రోత్సాహకమని ఆయన అన్నారు.

అదే విషయాన్ని ఈ పుస్తకానికి అద్భుతంగా రాసిన ముందుమాటలో ఆంధ్రజ్యోతి ఎడిటర్, డా. శ్రీనివాస్ చాలా మృదువుగా చెప్పారని, అంతేకాక, ఆ ముందుమాటలో పూర్వాపరాలను సమీక్షించారన్నారు. తన పరిశోధనను ఇంతటితో ఆపకూడదని శ్రీనివాస్ హెచ్చరించిన విషయాన్ని ఉటంకించారు.

జర్నలిస్ట్‌గా తమ వృత్తిపరంగా వారు చేసిన విశేష కృషిని గుర్తించి, గౌరవించడంలో భాగమే తాపీధర్మారావు పురస్కారం అని పురస్కార ముఖ్య ఉద్దేశాన్ని రమేష్‌బాబు తెలిపారు. ఈ మొత్తానికి కారణమైన ఏటుకూరి ప్రసాద్, సభలో ఉండటం ఆనందాన్ని కలిగించే విషయం అని, వారు తాపీ ధర్మారావు మీద పరిశోధన చేసి, ధర్మారావు ఆలోచనా విధానాలను బహిర్గతం చేశారన్నారు. తెలుగు జర్నలిజంలో చాలా పెద్ద పేరున్న వారందరికీ తాపీ ధర్మారావు గురువు, ఆయనవద్ద వాక్యాలు రాయడం నేర్చుకున్నాను అని చెప్పిన పత్రికా సంపాదకుల్లో ఉద్దండులున్నారు. తాపీ వారు సినిమారంగాన్ని ఎంతో ప్రభావితం చేశారు. సమాజం పట్ల పూర్తి అవగాహన కలిగిన, సంస్కారం ఉన్న గొప్ప వ్యక్తి. సమాజంలోని రుగ్మతలని ఎత్తిచూపుతూ అనేక పుస్తకాలను తాపీ ధర్మారావు రచించారని, ఆయన గొప్ప సంఘసంస్కర్త అని రమేష్‌బాబు చెప్పారు.

ధర్మారావుగారి గురించి మొట్ట మొదటిసారి నడుస్తున్న చరిత్ర/అమ్మనుడిలో వ్యాసం రాసినవారు కత్తి పద్మారావు. దానికి స్పందించి, నాగసూరి వేణుగోపాల్ మరో వ్యాసం రాశారు. వీటివల్ల నాకు ధర్మారావుగారి గురించిన అవగాహన ఏర్పడింది. అప్పుడు పత్రికారంగానికి తాపీ ధర్మారావు చేసిన కృషికి గుర్తింపు ఉండాలనే సదుద్దేశంతో వారి పేరిట ఏదైనా పురస్కారాన్ని అందిస్తే బావుంటుందని నిర్ణయించుకున్నామన్నారు. ఆనాటి నుంచి ప్రతి ఏటా తాపీధర్మారావు పేరిట పురస్కారాలను అందిస్తున్నామని, ఇప్పుడు ఇచ్చింది పదవ పురస్కారమని తెలిపారు.

**హిస్టారికల్ ఫిక్షన్‌ను తలపించింది**

ముఖ్య అతిథి, తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి, డా॥ జస్టిస్ జి.రాధారాణి పురస్కారాన్ని అనురాధకు ప్రదానం చేసిన అనంతరం సభని ఉద్దేశించి మాట్లాడుతూ, “తాపీ ధర్మారావు పేరిట పురస్కారం అందించడం, అది కూడా తమ రంగంలో విశేష కృషి సల్పిన జర్నలిస్టులకి ఈ అవార్డు అందించడం అభినందనీయం’’ మన్నారు. ధర్మారావు రచనలన్నీ వర్గాలనూ ఆలోచింపజేసేవని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అనురాధ రాసిన నవల గురించి మాట్లాడుతూ ఆమె కృషిని కొనియాడారు. అనురాధ రచనా శైలిని, ఆమె పరిశోధనా తృష్ణను అభినందించారు. ఈ పుస్తకం చదువుతుంటే ఓ హిస్టారికల్ ఫిక్షన్‌ను తలపించింది అని చెప్పారు. అలా రాయడమే ఈ రచనకు తలమానికం అని, అందుకే జగమునేలిన తెలుగు పుస్తకం యావత్ తెలుగువారిని చదివించే పుస్తకం అవుతుందని అభిప్రాయపడ్డారు. చరిత్రని పాఠంలా కాకుండా ఒక నవల రూపంలో రాయడం వల్ల ఆ పుస్తకంలో నిక్షిప్తం చేసిన చరిత్రకు సార్థకత త్వరగా ఏర్పడుతుందని ఆమె అన్నారు. అలా చేయడం వల్ల అయా ఘటనలను చదువరులు గుర్తుంచుకునే అవకాశం అధికంగా ఉంటుందని, అలా అనురాధ మంచి ప్రయత్నం చేశారని అన్నారు.



ప్రపంచంలో ఏ మూలకు వెళ్ళినా మలయాళీలు ఉంటారని, వ్యాపారం చేసే వారిలో ప్రతి దేశంలో గుజరాతీయులు ఉంటారని నానుడి, కానీ వారి కన్నా ముందు నుంచే తెలుగు వారి వలసల గురించిన ఆనవాళ్ళు వాటి విశేషాలు సభలోని వక్తల ద్వారా

తెలుసుకుని ఆశ్చర్యానికి గురయ్యానని రాధారాణి అన్నారు. ఇప్పటి వరకూ తెలుగు వారు అమెరికా, యూరోపియన్ దేశాలకు మాత్రమే వెళ్లారని తెలుసు కానీ, సౌత్ ఈస్టర్న్ కంట్రీస్‌కి వలస వెళ్లారన్న విషయం చాలా మందికి తెలీదని, మలేషియా వంటి దేశాలకు వెళ్ళినా వర్కర్లుగా వెళ్ళిన వారి గురించి మాత్రమే చరిత్రలో ప్రస్తావించారని, అందువల్లే తెలుగువారికి, వారి వారి మూలాలపై అవగాహన తక్కువని ఆమె అభిప్రాయపడ్డారు.

ఇక అనురాధ రచనలో తెలుగువారు ఇతర దేశాలకు ఎలా పొట్ట చేతపట్టుకుని వెళ్ళారు? అక్కడ రాజులుగా, రాణులుగా ఎలా ఎదిగారు? ఎలా అక్కడి రాజ్యాలని ఏలారు? అక్కడి ప్రజలు వారి విగ్రహాలను ఇప్పటికీ ఎలా కొలుస్తున్నారు? అనే విషయాలను కూడా కళ్లకు కట్టినట్లు ఈ పుస్తకంలో వివరించారని చెప్పారు. అలాంటి విషయాలు తెలుసుకోవడం తెలుగు వారందరికీ స్ఫూర్తిదాయకం. దీనిలో ప్రస్తావించిన అనేక విషయాలపై, వస్తువులపై అందరికీ అవగాహన చాలా తక్కువగ ఉంటుందన్న రాధారాణి అద్భుతంగా సాగిన ఇలాంటి రచనలు అనురాధ నుంచి మరిన్ని రావాలని ఆకాంక్షించారు.

**అభినందనలతోపాటు సూచనలు, సలహాలు**

విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆంధ్రజ్యోతి సంపాదకులు డా. కె. శ్రీనివాస్ మాట్లాడుతూ తాపీ ధర్మారావు పురస్కారం అనూరాధకి అందించడం అభినందనీయమని, అలాంటి యువ జర్నలిస్టులకు పురస్కారం అందించడం ద్వారా తాపీ ధర్మారావు ఉద్దేశాలను



ముందుకు తీసుకెళ్ళ డానికి దోహద పడతాయన్నారు. ఇప్పుడు ఆ బరువు, బాధ్యత రెండు కూడా అనురాధ మీద ఉన్నాయని శ్రీనివాస్ అన్నారు. సహజంగా తెలుగు వారి వలసల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు అమెరికా యూరప్, కరేబియన్ దీవులు, మాల్దీవులు, మారిషస్, సౌత్‌ఆఫ్రికా వంటి దేశాలను గుర్తు చేసుకుంటాం, పశ్చిమాసియా దేశాలతో వర్తక వాణిజ్య సంబంధాలుండేవని ఇప్పటి వరకూ పూర్తిగా వెలుగు చూసింది లేదని అన్నారు. తెలుగు వారి పాత్ర వీటిలో ఉన్న విషయం పై పెద్దగా ప్రచారం జరగలేదని, అలాంటి విషయానికి ప్రచారం కల్పించడంలో భాగంగా అదనపు సమాచారం సేకరించి, మనకు కేవలం కార్మికుల గురించి మాత్రమే కాకుండా, రాజుల, విద్యావంతుల చరిత్ర కూడా ఉందన్న విషయాన్ని గుర్తించి కథలో చొప్పించి, నవల రాసిన తీరు చక్కగా ఉన్నదని అనురాధ రచనా శైలిని అభినందించారు. ఏ ఉద్యమమైనా భావావేశం నుంచే ప్రేరణ పొందుతుంది. గతంలో ఒకరకమైన చరిత్ర ఉంటే, జాతీయోద్యమం మరొక రకమైన చరిత్రను భారతీయుల ముందుంచింది. తెలంగాణా ఉద్యమం లాంటి ఏ ఉద్యమాన్ని గమనించినా, చరిత్ర మూలాలు అన్వేషించడానికి ప్రయత్నాలు జరుగుతాయి. భావావేశం అనేది చరిత్ర పరిశోధకులకు ప్రేరణ అని చరిత్రలోని వాస్తవాన్ని నిజాయితీగా పరిశోధించాల్సిన అవసరం ఉన్నదని, అందుబాటులో లేని సమాచారాన్ని చరిత్రకారులు తమ భావావేశంతో పూర్తిచేయాలని చూడకుండా జాగ్రత్తపడాలని ఈ సందర్భంగా సూచించారు. ఇటీవల కాలంలో తెలుగు వారిలో ఔత్సాహికులు చరిత్ర పరిశోధనకు కృషిచేస్తున్నారన్నారు. చరిత్రను సామాజిక వేత్త ఒకరకంగా చెబుతాడు. త్రవ్వకాలను పరిశీలించినవారు ఒకరకంగా చెబుతారు, నాణేలను చూసిన వారు ఒక రకంగా చెబుతారు. సాంస్కృతిక చరిత్రకారులు మరోరకంగా చెబుతుంటారు. వీటి అన్నింటినీ సమన్వయం చేయాల్సిన అవసరం ఉంది.

చరిత్రకారులకి అనుబంధ శాస్త్రీయత పట్ల కూడా అవగాహన ఉండాలని ఆయన అన్నారు. అమితవ్ ఘోష్ ఈ మధ్య ఒక చారిత్రక నవల రాశారు. ఇండియా నుంచి మారిషస్‌కి వెళ్ళిన వారి గురించి ఆయన వ్రాశారు. దానిని గమనిస్తే ఒక చారిత్రక నవల రాయడానికి ఎంత కష్టపడాలి అనే విషయం తెలుస్తుందన్నారు. అదే పుస్తకంలో భారత్‌కి చైనాకి వర్తకం వంటి విషయాలను కూడా స్పృశించారు. ఆ పుస్తకంలో బీహార్ నుండి ఎక్కువగా మారిషస్‌కి వలసలు ఎలా వెళ్ళారు? అనే విషయాలను ఆయన చక్కగా విశదీకరించాన్నారు. మారిషస్‌లో అత్యధికంగ మాట్లాడే భాష 'మోరిసెన్ అని, దాని తర్వాత అధికంగా మాట్లాడే భాష తెలుగని శ్రీనివాస్ తెలిపారు. ఆ వలసలు ఎక్కడి నుంచి, ఎలా జరిగాయనే విషయం పై అనేక డాక్యుమెంట్లను ఆ రచనలో ఆధారంగా చూపించారన్నారు. దానిని సూక్ష్మంగా పరిశీలిస్తే, మనకు తెలిసిన ఈ 150 -200 ఏళ్లూ వలస తెగల గురించి పరిశోధన చేయడానికి ఆస్కారం ఉంది. ఆధారాలు దొరికే అవకాశం ఉంది. ఆ వంశీకులు కూడా ఉన్నారు. నిజంగా అనేక చరిత్ర ఆధారాలు బయటపడే అవకాశం ఉంది. ఈ విషయాల మీద దృష్టి పెట్టమని, మనకు కొన్ని విషయాలు తెలిసినప్పుడు భావావేశంతో రాయకుండా, ఇతర అంశాలను కూడా బేరీజు వేసుకుని, అప్పుడు మాత్రమే వెల్లడించాలని చరిత్ర శోధకులకు సూచించారు.

**బాధ్యత యువతరానిదే**

ఆత్మీయ అతిథిగా పాల్గొన్న విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య గూడూరు మనోజ మాట్లాడుతూ, భాషా మూలాలు వెదికినప్పుడు భాష తమది కాని భాషల మధ్య ఇమిడి, మనుగడ సాధించడం చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఒక్కొక్క భాషకు ఎన్ని లిపిలు ఉంటాయి అని పరిశీలిస్తే, ఆయా పరిధిలో ఉన్న చిన్న చిన్న సమాజాలలో ఒక్కొక్క భాష మనుగడలో ఉన్న విషయం మనకు అవగతమవుతుంది. రామచరిత మానస్ ని తులసీదాస్ 'అవధి' భాషలో రాసినప్పుడు అతనిని సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. ఎందుకంటే అప్పుడు అవధి అనే భాష అలగా భాషగా ముద్రపడింది. షా అబ్దుల్ ఖాదిర్ అరబ్ లోని ఖురాన్‌ని, ఉర్దూలోకి అనువదించినప్పుడు కూడా అతడిని ఆ సమాజం బహిష్కరించింది. అవధికి గానీ ఉర్దూకి గానీ ఎందుకు అప్పట్లో అంత తక్కువ తనం ఎందుకు ఉన్నది అన్న అనుమానం ఎవరికైనా కలుగుతుంది.



ఒక్కొక్క వృత్తికి ఒక్కొక్క భాష ఉన్నదని గతంలో పరిశోధనల సమయంలో తాము గుర్తించడంజరిగిందని, అలా ఆయా వృత్తుల నుంచి వచ్చిన భాషలను తెలుగువారు పూర్తిగాపోగొట్టుకుంటున్నారన్నదివాస్తవం. వలసలుగా వెళ్లిన తెలుగు వారు, వేరే సామాజిక కట్టడిలో ఉన్న సమయంలో కూడా తమ తమ భాషలని తమ వద్దే భద్రపరచుకున్నారనే విషయం గర్వించదగ్గదని అన్నారామె. శతాబ్దాల కాలం నాడే వలస వెళ్ళిన తెలుగు వారి గురించి అనేక విషయాలు స్పృశించిన ఈ పుస్తకం నిజంగా మెచ్చుకోదగినదని కొనియాడారు. అలాగే రచయిత్రి నవలలో ఒక టైం మిషన్ ద్వారా చెప్పాలనుకున్న ప్రయత్నం అభినందించదగ్గదని అన్నారు. సహజంగా ఉన్నది అందిస్తే వ్యాసాలలా మామూలుగా ఉండవచ్చు లేదా అందరినీ చేరువకాలేక పోవచ్చు. కనుక అనురాధ ప్రయత్నం అభినందనీయం అన్నారు. దీనితో పాటూ ఈ నవలలో మనోవైజ్ఞానానికి సంబంధించిన అంశాలు, ప్రాంతీయ భాషలు, తెలుగు భాష పొలిమేరలు దాటి ముందుకెళ్ళి మనుగడ సాగించాల్సిన అవసరం, దక్షిణ భారతీయ భాషలు ఎలా మనుగడ సాగిస్తున్నాయన్న విషయాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయన్నారు. ఎలా వెళ్ళారన్నది చారిత్రక అంశం, కానీ ఎలా మనగలుగుతున్నాయి అన్నది మాత్రం పెద్ద పరిశోధనే అవుతుందని చెప్పగలన్నారు. దీనిని ముందుకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత కూడా యువత మీద ఉందని ఆమె అన్నారు.

**నిద్రావస్థ నుంచి జాతిని మేల్కొల్పే రచన**

ఈ సమావేశంలో మరొక ఆత్మీయ అతిథిగా పాల్గొన్న భారతీయ భాషల సంఘం జాతీయ అధ్యక్షుడు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రచయిత్రి అనురాధ ఒకరకంగా పద్మవ్యూహంలోకి ప్రవేశించి మన తెలుగు వారినందరిని సైనికులుగా అందులో ప్రవేశించమని సన్నద్ధం చేస్తున్నట్లుగా ఉందని అన్నారు. ఇంతవరకు తెలుగు వారి గురించి చారిత్రక నవల రాయడం గత తరంలో జరిగింది. కానీ గత 30 సంవత్సరాలలో అలాంటి చారిత్రక నవల రాలేదు. చరిత్ర పరిశోధనకు చారిత్రక నవలలు చాలా అవసరం. ఈ నవలలు మార్గనిర్దేశకత్వం చేస్తాయి. అనేక రకాల విషయాలను సమ్మిళితం చేసిన పెద్ద నవల జగమునేలిన తెలుగు. ఈ నవల సృష్టించడానికి చక్కటి తెలుగు శైలిని ఆమె అందించారు. ఇందులో సూర్యవర్మ అనే యువకుడు ఉంటాడు. యువకుడిని ఎందుకు సృష్టించారు అంటే కథానికకు కావలసిన కొత్త విషయాలు తెలుసుకోవడానికి ఈ కాలంలో మగవాళ్ళు అవసరం. సూర్యవర్మ కాల యంత్రంలో వెళ్లి గడిచిన కాలంలో ఎవరెవరు అయితే తెలుగు చరిత్రను నిక్షిప్తం చేశారో, ఆ చరిత్ర పాత్రలోకి వెళ్లి, వాళ్ల ద్వారా



చెప్పిస్తూ ఉంటాడు. చక్కని చారిత్రక నవలగా దీనిని రూపొందించారు. చదవడం మొదలు పెడితే వదలకుండా చదివే స్థాయి ఈ నవలకి ఉంది. అంత చక్కని నవల. ఈ ఆలోచన రావడానికి చాలా మంది కారణం అయ్యారు అని ఆమె కూడా చెబుతున్నారు. ఆయా ప్రాంతాలలోని చారిత్రక విషయాలు తెలుగువారికి ఇప్పటిదాకా తెలియవు అంటే అతిశయోక్తికాదని, అక్కడ చూచాయగా ఏదో హిందూ రాజ్యాలు ఉన్నాయి ఏనాడో వారు వెళ్లిపోయారు అని మాత్రమే తెలుసు. అయితే ఈ నవలలో ఆయా రాజ్యాలన్ని ఎక్కడి నుండి వెళ్లాయి భారతదేశం నుండి అక్కడ రాజ్యస్థాపన కోసం ఎందుకు వెళ్లాయి. ఏ రాజ్యానికి ఆ రాజ్యాన్ని తీసుకొని చాలా వివరణాత్మకంగా రాశారు. నాకు బాగా నచ్చిన విషయం ఏమిటంటే చంపా రాజ్యం గురించి. మీ అందరికీ కంపూచియా అది వియత్నాంగా మారిందని తెలుసు. అ ప్రాచీన హిందూ చంపా రాజ్యం నేటి వియత్నాంలో దక్షిణ తూర్పు తీరంలో ఉండి పై నుండి కిందదాకా ఉంటుంది. అక్కడ ప్రాచీన నగర రాజ్యాలని పరిశీలించినట్లయితే అక్కడ ఉన్న పేర్లు 'అమరావతి'. అమరావతికి మరో పేరు 'ఇంద్రపురం' ఆల్టర్నేట్ గా 'ఇంద్ర పుర'. ఆ తరువాత అక్కడితో ఆగలేదు. ఇంకొంచెం కిందకి వస్తే ఇంకో నగరం 'కౌతర'. 'కౌతరా అంటే కృష్ణాజిల్లాలో ఒక ప్రాచీన తీరపట్టణం. ఈనాడు 'కౌతరం' అని పంచాయతీ ఉంది. అక్కడ కౌతరం నగర రాజ్యం ఉంది. అలాగే కిందకి వస్తే 'పండ్రంగ' పండ్రంగ అంటే పాండురంగ అని అర్థం. కృష్ణాతీరంలో ప్రసిద్ధి చెందిన పాండురంగ ఆలయం ఉండే నగరం బందరు ఉంది . తర్వాత అక్కడి నగరం పేరు విజయ. విజయవాడ పేరు మీద నగరం. ఇలా 4 నగర రాజ్యాల పేర్లు కృష్ణ గుంటూరు తీర నగరాల పేర్లు అక్కడ పెట్టారు. ఇది ఎలా జరిగింది అంటే ఇక్కడ ఓడ ఎక్కిన వాళ్లు కృష్ణా,గోదావరి ఫోర్ట్ సిటీస్ నుండి వెళ్ళిన వాళ్ళు, పడవ దిగి అక్కడ వాళ్ల పట్టణాల పేర్లతో రాజ్యస్థాపన చేసి కొన్ని వందల సంవత్సరాలు పరిపాలన చేశారు. ఆ తర్వాత పై నుండి, జావా నుండి వచ్చిన కొంతమంది దండయాత్రలతో ఆ పట్టణాలలో కొన్నిటిని నాశనం చేశారు.

చెంఘీజ్ ఖాన్ సేనలు కూడా అప్పుడే 12వ శతాబ్దంలో బయలుదేరాయి. వాళ్ల తాకిడికి కొన్ని పట్టణాలు, ఆ తర్వాత చైనా నుండి దురాక్రమణకు గురై కొన్ని పట్టణాలు, అనేక రకాలుగా ఒత్తిడిలకు లొంగి కొన్ని నామరూపాలు లేకుండా పోయాయి. కానీ చరిత్రను వదిలి పెట్టి పోయారు. ఆనాటి కొన్ని శిలాలేఖనాలు గమనిస్తే, ఇక్కడ శిలా లేఖలలో కనబడే తెలుగులిపి అక్కడ శిలా లేఖనాలు కనబడే తెలుగు లిపి ఒకేలా ఉంటుంది. ఈనాటికి కొంత

దానిలో ప్రవేశం ఉన్నవాళ్ళు కనిపెట్టవచ్చు.

చంపాలో ఉన్న లిపి గాని, బర్మా లిపి, బంగిని లిపి గమనిస్తే, తెలుగు లిపి కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ప్రాచీన తెలుగు శాసనాలు చూస్తే ఈనాటికీ కొన్ని తెలుగు అక్షరాలు ఖ, ఘ, మ, య ఈ నాలుగు అక్షరాలు రెండు అక్షరాలు కలిపినట్లు ఉంటాయి. ఈ నాలుగు అక్షరాలు మన పాత ప్రాచీన థాయ్ లిపి, మన్ లిపి కానీ, బర్మా లిపి కానీ తీసుకుంటే ఘ, ఈ, ఎ, ని వెల్లకిలా తిప్పినట్లు ఉంటుంది.

ఖచ్చితంగా తెలుగు, కన్నడలిపిలలో ప్రాచీన అవశేషాలు ఉన్నాయి. అవి పల్లవులు అందిపుచ్చుకుని, పల్లవుల నుండి ఆ ప్రాంతాలకు తీసుకు వెళ్లారు. అంటే ఆంధ్ర ప్రాంతంలో ప్రారంభమై అక్కడి నుండి తమిళనాడు మీదుగా అక్కడికి చేరుకున్నాయి. వీళ్ళందరూ అక్కడికి చేరుకోకముందే శాతవాహన సామ్రాజ్యంలో కృష్ణ గుంటూరు గోదావరి పట్టణాల నుండి ఆంధ్ర శాతవాహనులు ఓడల మీదుగా తూర్పు తీరాలకు, దేశాలకు వెళ్లి రాజ్యస్థాపన చేసినట్లు అక్కడ కొన్ని ఆధారాలు ఉన్నాయి.

ఆంధ్ర శాతవాహనుల నాణేల మీద ఓడల బొమ్మలు ఉండడం, పట్టణాలకు అమరావతి ఊళ్ల పేర్లు ఉండడం ఇవన్నీ చూస్తుంటే మన చరిత్ర ఎక్కడో ఆగింది. వారు ఎందుకు వెళ్లారు, ఏం చేశారు, ఎలా వెళ్లారు, ఎలా సాగింది వారి ప్రయాణం గురించి మనం తెలుసుకోవలసిన అవసరం ఉంది. దీనికి సరైన మార్గనిర్దేశం చేసేందుకు అనురాధ చక్కగా రాసిన నవల ఇది. ఇక్కడి నుంచి ప్రారంభించి చరిత్రకారులు, భాషాశాస్త్రజ్ఞులు అక్కడ ఉన్న శాసనాలను, లిపులను పరిశీలించి ఎక్కడ నుండి తెలుగు వాళ్ళు వెళ్ళవలసి వచ్చింది, ఏమి సాధించారు, మిగిలిన వాళ్ళు ఏమయ్యారు, ఇట్లా ముందుకు సాగడం అనేది ఈ నవలలో కనిపిస్తుంది, ఆలోచింపజేస్తుంది అని అభిప్రాయపడ్డారు.

ఆనాటి తెలుగు వారిని గురించి చెప్పుకోవాలంటే కడలి తరంగాల మీద ఇతర దేశాలకు పోయి అక్కడ చరిత్ర సృష్టించారు. మరి ఈనాడు వారు ఏమి చేస్తున్నారు? కొంతమంది ఇతర దేశాలకు అమెరికా ఆస్ట్రేలియా వెళ్తున్నారు. కానీ ఎలాంటి చరిత్ర సృష్టిస్తున్నాం? ఏం చేస్తున్నాం? చాలా నిద్రావస్థలో, సుషుప్తావస్థలో అసలు ఏం జరుగుతుంది అనేది వంటపట్టడం లేదు. విద్యార్థులు పూర్తి నిద్రావస్థలో ఉన్నారు. చదువు ఉన్నవారు అంతకన్నా నిద్రావస్థలోకి వెళ్లారు. ఇక రాజకీయ నాయకులదే రాజ్యం. మళ్లీ మనందరం మేల్కోవాలి. ఈ మేలుకోవడానికి ఈ పుస్తకం ఉపయుక్తమవుతుంది. ఈరోజు యువకులందరూ ఏదో ఒక స్కిల్ నేర్చుకుంటున్నారు. ఒక డిగ్రీ వస్తుంది. స్కిల్ నేర్చుకుని డబ్బు సంపాదిస్తున్నారు. కానీ సమాజం ఏమవుతోంది? సమాజం ఎందుకు ముందుకు పోవడం లేదు. ముందుకు పోవడం అంటే ఏమిటి? మనందరం మన గురించి ఎందుకు ఆలోచించడం లేదు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**అవార్డు గ్రహీత స్పందన**

అవార్డు గ్రహీత, పుస్తక రచయిత్రి డి.పి.అనురాధ తన స్పందనలో ఇలా అన్నారు: 'జగమునేలిన తెలుగు- గోదావరి నుంచి జావా దాకా' నవల రాయడానికి కారణాన్ని వివరిస్తూ, శ్రీలంకలో క్యాండి నగరం అనే నగరం ఉంది, అది పర్యాటక కేంద్రం. అక్కడి క్వీన్స్ హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ ఉన్నాను. ఎదురుగా రెండు పెయింటింగ్స్ కనిపించాయి. 'ది లాస్ట్ రూలర్స్ ఆఫ్ కాండీ' అని ఉంది. ఆ రాజు

డి.పి.అనురాధకు తాపీ ధర్మారావు పురస్కారాన్ని ఇచ్చే సందర్భంలో తెలుగుజాతి(ట్రస్టు) ట్రస్టీ డా॥ వెన్నిసెట్టి సింగారావు మన్నన పత్రాన్ని చదివి సత్కార గ్రహీతకు అందజేశారు.



రాణి పెయింటింగ్స్‌లో రాజు పేరు విక్రమరాజ సింఘే, రాణీ పేరు గమనిస్తే, ఆవిడ పేరు 'వెంకట రంగమ్మ' అని ఉంది.

మన తాతమ్మ, జేజమ్మల పేరు శ్రీలంక మహారాణి పేరుగా ఉండటం చూసి ఆశ్చర్యపోయాను. అక్కడి వాళ్లని అడిగితే, ఈ కోటంతా వాళ్లదే, 150 ఏళ్ళు పరిపాలించారు. వాళ్ళంతా తెలుగు వాళ్ళు అని చెప్పారు. ఈ విషయం మనకి ఇక్కడ ఏ పుస్తకంలో కూడా ఉండదు. మనకి శ్రీలంక అనగానే తమిళులే గుర్తొస్తారు. మన తెలుగువాళ్ళు అక్కడ పరిపాలించారు. శ్రీలంక మొదటి పాలకుడు విజయుడు, శ్రీకాకుళం నుంచి వచ్చిన వాడైనప్పటికీ, అక్కడి వాళ్ళు కళింగదేశం నుంచి వచ్చినట్లు చెబుతారు. కానీ మన చరిత్రలో ఎక్కడా దాని వివరాలుండవు. కళింగ అనగానే ఒరిస్సా వాళ్ళు తమ వారని చెబుతారు. కానీ శ్రీకాకుళం వారని, మన పరిశోధకులు ఆధారాలతో రాశారు. అయితే సామాన్యులకు మాత్రం ఆ విషయం అసలు తెలియకపోవడం శోచనీయం. అలాగే మయన్మార్‌లోని యాంగాన్ (అప్పటి రంగూన్) నగరంలో 'ష్వీడగాన్ పగోడా' అనే పేరుతో 362 అడుగుల ఎత్తు స్థూపం ఉంది. ఆకాశానికి చొచ్చుకొని పోతున్నట్లుగా ఉండే ఆ స్థూపం టన్నుల బంగారంతో తాపడం చేసిన ఒక అద్భుత కట్టడం. ఏ దేశాధ్యక్షులు ఆ దేశం వెళ్ళినా కచ్చితంగా సందర్శనీయ స్థలంలో అది మొదటే ఉంటుంది. దాని గురించి వివరాల కోసం అక్కడి సావనీర్ చూస్తే, దానిని క్రీశ 5 వ శతాబ్దంలో 'ఒక్కలప్ప' అనే రాజు నిర్మించినట్లు తెలిసిందని అనురాధ చెప్పారు. ఆ స్థూపం నిర్మించిన కొండ పేరు 'తంబగుట్ట'. అలాగే 13వ శతాబ్దంలో 'మగాడు' అనే రాజు పరిపాలించినట్లు తెలిసిందన్నారు. వీరంతా 'మన్' జాతీయులు. దక్షిణ బర్మాలో తొలి రాజ్య పాలకులు వీరు అని ఆమె తన పరిశోధనా విశేషాలు వివరించారు.

ఈ 'మన్' జాతికి చెందిన రాణీనే 'చామదేవి'. ఈవిడ థాయ్‌లాండ్‌కు చెందిన రాణి. ఉత్తర థాయ్‌లాండ్‌లో మొదటి పాలకురాలు చామదేవి. ఆమె ఇంకొక పేరు చిన్నమదేవి. చెన్నదేవి అని కూడా అనేవారు. మయన్మార్‌లో ఒక పరిశోధకులు చెప్పిన విషయం ఏమిటంటే, ఆమె పేరు మీదనే 'చింగ్మయి' అనే ఒక నగరం ఉన్నది. బ్యాంకాక్ తర్వాత ఆ దేశంలో అతి పెద్ద నగరం అది అని అనురాధ సభికులకు తెలిపారు. చింగ్మయి కాస్త చిగ్మయి అయ్యింది అని స్థానికులు తెలిపినట్లు రచయిత్రి చెప్పారు.

చింగ్మయికి సమీపంలోని లంపూ నగరం కేంద్రంగా రాణి చామదేవి పరిపాలించారు. ఆమె క్రీ.శ 7 వ శతాబ్ది రాణి. అక్కడ

ఆమె సమాధి కూడా ఉంది. అక్కడ ఒక మ్యూజియం ఉంది. ఆమె కాలం నాటి శాసనాల కోసం వెదికాను. ఆ మ్యూజియం వారు ఒక బ్రోచర్ ఇచ్చారు. ఆ బ్రోచర్‌లోని వివరాల ప్రకారం చామాదేవి రెండు నదుల మధ్య ప్రాంతాన్ని పరిపాలించింది. ఆ రెండు నదుల మధ్య ప్రాంతాన్ని ఆనాడు ' సమాంధ్రప్రదేశ్ ' అనే వారని తెలుసుకుని ఆ ప్రాంతంలో మన 'ఆంధ్రా' పదం విని ఆశ్చర్యపోయానని ఆమె చెప్పారు.

అక్కడి నుంచి, వియత్నాంకు తను వెళ్లారని, అక్కడి ఆర్కిలాజికల్ అధికారులు చెప్పిన విషయం ఆధారంగా, వియత్నాంలో మొదటి ఆలయం 'భద్రేశ్వరస్వామి' దేవాలయం అని, దానిని వియత్నాంలోని చంపా రాజ్యాన్ని పరిపాలించిన హిందూ రాజులు నిర్మించినదనే విషయాన్ని ఆమె సభికుల ముందుంచారు. ఈ దేవాలయం ప్రస్తుత సెంట్రల్ వియత్నాంలో మైసన్ సిటి అనే నగరంలో ఉంటుంది.

ఇక ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వాళ్ళు ఏమి చెబుతారంటే, భారత దేశంలో ఇటుకలతో నిర్మించిన అతి పురాతన దేవాలయాలు మూడు ఉన్నాయి. అందులో ఒకటి నాగార్జున కొండ ప్రాంతంలోని 'పుష్ప భద్రేశ్వరస్వామి' ఆలయం. ఇక్కడి భద్రేశ్వర స్వామి దేవాలయం క్రీశ 2వ శతాబ్దానికి చెందినదైతే, అక్కడి భద్రేశ్వరస్వామి దేవాలయం 5 వ శతాబ్దానికి చెందినది. ఇక రెంటి గోపురాలు ఒకే విధంగా ఉండటం విశేషం అని అనురాధ తెలిపారు.

వియత్నాంలోని హోచిమిన్ సిటీలో, నేషనల్ హిస్టరీ మ్యూజియం అని ఉన్నది. అక్కడికి వెళితే ఎదురుగా చంపా రాజ్యానికి చెందిన డాంగ్ డాంగ్ బుద్ధ శిల్పం చూసి ఆశ్చర్య పోయానన్నారు. కారణం వివరిస్తూ, అలాంటి బుద్ధ విగ్రహమే నాగార్జున కొండకి వెళితే కనిపిస్తుందని చెప్పి సభికులని ఆశ్చర్యానికి గురిచేశారు. కాకపోతే అక్కడి శిల్పం 7వ శతాబ్దికి చెందినది. అది కంచు విగ్రహం. తమ మొదటి శిల్పానికి ప్రేరణ 'అమరావతి' అని వియత్నాం వాసులు చెబుతున్నారని అనురాధ తెలిపారు. అలాగే మయన్మార్ లో 'మన్' భాష, థాయ్‌లాండ్‌లో 'లాన్న', 'థాయ్' భాషలు, వియత్నాంలోని 'చామ్' భాషల లిపులకి మూలం 'పల్లవ గ్రంథి' లిపి అని అనురాధ తెలిపారు.

ఇంకా ఆమె మాట్లాడుతూ '1921లో భావరాజు వెంకట కృష్ణారావు ప్రాచీనాంధ్ర నౌకాజీవనం' అనే గ్రంథం రచించారు. అందులో ఇండోనేషియాలోని జావా దీవుల్లో, జాంబి అనే కొండ మీద పూర్ణవర్మ అనే రాజు పాదముద్రలున్న పెద్ద శిలాశాసనం దొరికిందని రాశారు. ఆ శాసనం భాష సంస్కృతం అని, లిపి మాత్రం వేంగి లిపి లాగా ఉందని ఆయన రాశారు. నేను ఇండోనేషియా రాజధాని జకార్తాలో నేషనల్ మ్యూజియంకి వెళితే, రెండవ అంతస్తులో పూర్ణవర్మ పాదముద్రలున్న పెద్ద బండరాయి ఏసి గదుల్లో భద్రంగా దాచిపెట్టబడి ఉన్న విషయం గుర్తించాను." అని చెప్పారు.

శ్రీలంక, మయన్మార్, థాయ్‌లాండ్, వియత్నాం, ఇండోనేషియా అలా వెళ్ళే కొలదీ తెలుగుజాతికి సంబంధించిన ఎన్నో మూలాలు దొరికాయని, అలా చూసిన అద్భుతాలన్నీ తనలోనే ఉంచుకోకూడదని, ప్రపంచానికి చెప్పాలని, వ్యాసరూపంలో చెబితే అందరికీ చేరువవ్వదని ఒక కథ రూపంలో నవలగా తెలుగు వారి ముందుకు తెచ్చానన్నారు అనురాధ.

వాస్తవానికి ముందు వ్యాసరూపంలో కూడా రాయడం జరిగిందని ఆమె తెలిపారు. అనేక విశేషాల సమాహారమే తన పుస్తకమని అనురాధ చెప్పారు. 1975లో మొదటి తెలుగు మహాసభలు జరిగాయి. ఆ సందర్భంగా విడుదలైన ఒక ప్రత్యేక సంచికలో విశ్వనాథ సత్యనారాయణ ఒక వ్యాసంలో "ఫిలిప్పీన్స్ లో 'తెగలాగ్' అనే భాష ఉన్నదని, అది తెలుగు భాషకు దగ్గరగా ఉన్నదని, వారికి తెలుగువారికి సంబంధాలు ఏవిటో చూడాలి అని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ విషయాన్ని రచయిత్రి ఈ సందర్భంగా సభికులకు గుర్తుచేస్తూ, దాని గురించి ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 'తెగలాగ్ భాషని ఫిలిప్పీన్స్ వారు తమ అధికార భాషగా ప్రకటించుకున్నారు. ఫిలిప్పీన్స్ లో 'పలావాన్' అనే పెద్ద దీవి ఉంటుంది. పలావాన్ అనే జాతి అక్కడ ఇంకా మనుగడ సాగిస్తోందని ఆమె తెలిపారు. కానీ వాళ్ళ గురించి మనం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు.

టర్కీలో ఏన్షియంట్ ఆర్కిలాజికల్ సైట్, 'గొబెక్లి తెపె' 12 వేల ఏళ్ళ క్రితంది. అతి పురాతనమైనది. దానిలో తెపె అనే పదం తిప్ప అనే తెలుగు పదం నుంచి వచ్చిందని భాషా శాస్త్రవేత్త ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు అభిప్రాయపడ్డారని అనురాధ సభికులకు తెలిపారు.

ఈ పరిశోధన చేయడానికి ముఖ్య కారణం, టివి9 అప్పటి మాజీ సిఈవో రవిప్రకాష్ అని, ఆయన పదేళ్ల క్రితం ఇచ్చిన ప్రాజెక్ట్ అది అని గుర్తుచేసుకున్నారు. ఆయన సలహాతో శ్రీలంకలోని కాండీతో మొదలైన తన శోధన ఇతర ప్రాంతాలలో కూడా నిరాటంకంగా సాగిందని అన్నారు. కాగా ప్రముఖ ఆర్కియాలజిస్ట్ వి.వి. కృష్ణశాస్త్రి గారిని తాను కలిసినప్పుడు టర్కీలోని ఇస్తాంబుల్‌లో పురాతనమైన సుల్తాన్ మెట్ అనే ప్రాంతం ఉందని అది తెలుగులోని మెట్ట అనే పదం నుంచే ఏర్పడ్డదని కృష్ణశాస్త్రిని ఉటంకిస్తూ ఆమె తెలిపారు. తెలుగుజాతి వలసల గురించి, వారి మూలాలపై విస్తృతమైన అవగాహన కలిగేలా చేసిన స.వెం.రమేశ్, శాసనాల గురించిన అనుమానాల్ని నివృత్తి చేసి తన పదేళ్ల ప్రయాణంలో వెన్నంటి ఉన్న ప్రముఖ పురాతత్వ శాస్త్రవేత్త ఈమని శివనాగిరెడ్డి, ఏ దేశంలో తెలుగువాళ్ళ ప్రాచీన ఆనవాళ్ళ గురించి తెలిసినా తనకి ఆయా వివరాలు అందించిన ఈనాడు జర్నలిజం స్కూల్‌లో పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు దివంగత తల్లాప్రగడ సత్యనారాయణ, నవల ప్రచురణకు ఆర్థిక సహాయం అందించిన బొమ్మిదాల శ్రీకృష్ణమూర్తి, అడిగిన వెంటనే ముందుమాట అద్భుతంగా రాసిచ్చిన డా॥ కె. శ్రీనివాస్, అమ్మనుడిలో సీరియల్ గా ప్రచురించిన డా॥ సామల రమేష్, ఎప్పుడూ కాదనకుండా తనకు అండగా నిలిచిన తన కుటుంబ సభ్యుల సహకారం ఎనలేనిదని ఆమె భావోద్వేగానికి లోనయ్యారు.

ఇంకా తన జాబితాలో జపాన్ ఉందని, క్రి.శ 7వ శతాబ్దంలో నాగయ అనే రాజు అక్కడ పరిపాలించాడని ఆమె తెలిపారు. అతని సమాధి కూడా ఉన్నదని తెలుస్తోంది. తరువాత కొరియాలో తన పరిశోధనని కొనసాగించాల్సి ఉంటుందని తెలిపారు.

సమావేశకర్త డా॥ సామల రమేష్‌బాబు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

డా॥ మధురాంతకం నరేంద్ర
98662 43659

# తొండనాడు భారతం మిట్టలు

మహాభారతాన్ని కేవలం సాహిత్య గ్రంథమని అంటే భక్తులు మండిపడతారు. కాదు, అది పుక్కిట పురాణం మాత్రమే అంటే సాహిత్యకారులు వొప్పుకోరు. మహాభారతపు వైశిష్ట్యాన్ని వర్ణిస్తూ, ఆ రచన మొదట్లోనే నన్నయ దాన్ని ధర్మశాస్త్రమనీ, వేదాంతమనీ, నీతిశాస్త్రమనీ, మహాకావ్యమనీ, సర్వలక్ష్యసంగ్రహమనీ, యితిహాసమనీ, అన్ని పురాణాల సముచ్చయమనీ నొక్కి చెప్పేశాడు. అయితే మహాభారతమనేది తొండనాడు ప్రజలకు మాత్రం జీవితంలో విడదీయరాని భాగమైపోయింది.ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో కొంత భాగమూ, తమిళనాడులోని తిరువళ్ళూరు,కటారు,తిరవణ్ణామలై,విల్లుపురం, కదలూరు జిల్లాలో,కేంద్రపాలిత ప్రాంతమైన పాండుచ్చేరి కలిసిన ప్రతిగ్రామంలోనూ ధర్మరాజుగుడి వుండి తీరుతుంది. అలాగే అనేక గ్రామాల్లో 'భారతం మిట్ట' అనే ప్రాంతం వొకటి వుంటుంది. యిప్పటికీ తొండనాడుకు చెందిన చాలా గ్రామాల్లో ప్రతీ సంవత్సరమూ 'భారతయజ్ఞం' అనే 18 రోజుల వుత్సవం జరుగుతుంది.

సమశీతోష్ణ ప్రాంతమైన తొండనాడులో వేసవి యెప్పుడూ కఠినంగానే వుంటుంది. 40 డిగ్రీలను దాటేసే వేసవిలో, నీటి యెద్దడి నుంచీ తప్పించుకోవాలంటే 'నలచరిత్ర'నూ, 'విరాట పర్వాన్నీ' చదవడమో, హరికథగా వినడమో చేయాలని యీప్రాంతపు వాళ్ళు నమ్ముతారు. భారతయజ్ఞాన్ని నిర్వహించటమన్నది యీ నమ్మకానికున్న మరో పార్శ్వంగా భావించాలి. 18 రోజుల పాటూ జరిగిన కురుక్షేత్ర యుద్ధాన్ని గుర్తు చేస్తూ, 18 పర్వాలున్న మహాభారతానికనుగుణంగా తొండనాడులో భారతయజ్ఞం 18 రోజులపాటు జరుగుతుంది.

వూరికి బయట. పెద్ద చింతచెట్లు మాత్రమే వుండే ఆరుబయలలో, చిన్నదో పెద్దదో అయిన ధర్మరాజు గుడిముందు కొబ్బరాకుల పందిళ్ళువేసి యజ్ఞానికి సన్నద్ధమవతారు. పగలు మధ్యాహ్నం రెండు గంటల నుంచీ సాయంత్రం వరకూ దాదాపు మూడు గంటలసేపు మహాభారతాన్ని హరికథగా పండితుడూ, గాయకుడూ అయిన హరిదాసు గానం చేస్తాడు. పందిరి కటువైపునుండే మట్టివేదికపైన, రాత్రి తొమ్మిది గంటల నుంచీ తెల్లవారుజాము వరకూ పగలు జరిగిన కథకు సమాంతరంగా భారతాన్ని జనపదుల నాటకంగా ప్రదర్శిస్తారు.

తొండనాడులో వొకప్పుడు గొప్ప హరికథకులు చాలా మంది వుండేవాళ్ళు. మైకులూ, విద్యుద్దీపాలూ లేని రోజుల్లో గూడా పగలు కథా, రాత్రి ఆటా వైభవంగా జరిగేవి. మా చిన్నతనంలో దాదాపు నాలుగైదు దశాబ్దాల క్రితం యీ ప్రాంతంలోని చాలా గ్రామాల్లో ప్రతీ సంవత్సరమూ భారతయజ్ఞం జరిగేది. భాతరయజ్ఞాం జరగడానికి కొద్ది రోజుల ముందుగా పోతురాజు విగ్రహాన్ని సమీప గ్రామాల్లోనంతా వూరేగింపుగా తీసుకెళ్తారు. వో జానపద గాథ ప్రకారం పోతురాజు పాండవుల బావమరిది.

భారతయజ్ఞం కోసం భారతం మిట్టలో చలువపందిళ్ళు వేస్తారు. యిప్పుడు తొండనాడు నుంచీ మాత్రమే గాకుండా కోస్తా, నెల్లూరు ప్రాంతాల నుంచీ పేరున్న హరికథకుల్ని తీసుకొస్తారు. పట్టుపంచను కట్టుకుని, నడుముకు రంగుల అంగవస్త్రాన్ని చుట్టుకుని, మెడలో పూల మాలవేసుకుని, చేతిలో చిడతలు పట్టుకుని, కాళ్ళకున్న మంజీరాలు గల్లుగల్లుమంటూండగా హరికథకులు గుడిముందున్న చిన్నవేదిక పైకి చేరతాడు. మృదంగం, వయిలెను, హార్మోనియం వంటి వాయిద్యాలు వాయించే విద్వాంసులు వేదికపైన కూర్చుంటారు.

పగలు కథ ప్రారంభించే ముందు గుడిలో వుండే (గుడి అంటే గోపురంలాండిది వుండాలని లేదు. నాలుగు గోడల పైన కప్పువుండే చిన్న యిల్లే గుడిగా వుంటుంది) పాండవులూ, శ్రీకృష్ణుడూ,



ధర్మరాజు గుడి

పోతురాజుల చెక్క బొమ్మలకు పూజ జరుగుతుంది. పోతురాజు విగ్రహాన్ని మాత్రం హరికథ జరిగే వేదికపైకి తెచ్చి కొలువుచేస్తారు. మహాభారతంలోని ముఖ్యమైన ఘట్టాలు కనీసం దినానికొకటి వచ్చేలా హరికథకుడు తన కథనాన్ని కొనసాగిస్తాడు. దాదాపుగా ఆఘట్టాలన్నీ తొండనాడు జానపదులకు బాగా తెలుసు. భారతప్రశస్తి, భారతుడి జననం, భీష్మ ప్రతిజ్ఞ, పాండవ జననం, లక్కయిల్లు, బకాసుర కథ, రాజసూయం, రాయబారం, అభిమన్యుడి వధ, కర్ణుడి చావు, దుర్యోధన సంహారం.... యిలా ప్రతిరోజు వొ ముఖ్యమైన ఘట్టాన్ని వినడం కోసం చుట్టూవున్న పల్లెల నుంచీ జనం వచ్చి పందిరి కింద చేరుకుంటారు.

జనరంజకంగావుండడం కోసం హరికథకులు మధ్యలో పాటలూ, పద్యాలూ, వీలయితే నృత్యాలూ గూడా చేరుస్తారు. కథ మధ్యలో దేవుడికిచ్చిన హారతి పళ్లెం జనాల దగ్గరకి తీసుకొస్తారు. వచ్చిన వాళ్ళంతా హరిదాసుకోసమని పళ్లెంలో తమకున్న డబ్బేదో సమర్పించుకుంటారు. భారతంలో జరిగే ముఖ్యఘట్టాలను పండుగల్లాగా జరుపుకుంటారు. బకాసుర సంహారమప్పుడు భీముడి వేషధారి యెద్దుల బండెక్కి వూళ్లంతా తిరుగుతారు. జనం ఆ బండిలో తాము వండిన ఆహారమంతా చేరుస్తారు. బకాసురవధను నాటకంలా ప్రదర్శించాక బండిలోని ఆహారాన్ని జనాలకు ప్రసాదంగా పంచుతారు.

"తపసుమాను" అనేది మరో వుత్సవం. పెద్దతాటి చెట్టును కొట్టుకొచ్చి దాని బోదెను నాటిక, దానికి కొమ్మల్లా కొన్ని కొయ్యల్ని అమరుస్తారు. అర్జునుడు పాసుపతం కోసం శివుణ్ణి మెప్పించే ఘట్టమది. అర్జునడి వేషధారి పెద్దజోలెలో నిమ్మకాయలు, పూలు, విబూతీ నింపుకుని తపసు మానుకొమ్మలపైన యెక్కుతాడు. కొమ్మకొమ్మకూ పద్యాలు పాడుతూ చివరికి తాటి బోదెపై నుండే చిన్న వేరికపైకి చేరుతాడు. పైనుంచి నిమ్మకాయలూ, విబూతి పండ్లూ, పూలూ కిందకి విసరుతాడు. వాటికెంతో మహిముందని నమ్మి

జనాలు వాటినంతా యేరుకోడానికి పోటీపడతారు. పిల్లల కోసం వరపడే ఆవడాళ్ళు, తలస్నానం చేసి తడిబట్టలతోనే తపసుమాను ముందు సాగిలపడతారు. పైనుంచి యేదైనా తమపైకి పడితే తమ కోరిక తీరుతుందని నమ్ముతారు.

'గో(గ్రహణం' రోజున చుట్టూవున్న పల్లెల్లోని గోవులనంతా భారతం మిట్టవరకూ తోలుకొస్తారు. ఆ రోజున గోవులకు స్నానాలు చేయించి, కొమ్ములకు రంగులు వేసి, చెమ్కీకాగితాలతో అలంకరిస్తారు. 'దుర్యోధనవధ' రోజున భారతంమిట్టలో మట్టితో ముప్పయి నలభై అడుగుల పొడుగుండే దుర్యోధనుడి బొమ్మను పడుకున్న రీతిలో తీరస్తారు. దుర్యోధనుడు, భీముడు, శ్రీకృష్ణుడి వేషాలేసుకున్న నటులు ఆ బొమ్మచుట్టూ నిలబడి పద్యాలు పాడతూ నటిస్తారు. దుర్యోధనుడి చావు తర్వాత అక్కడికొచ్చిన జనాలంతా దుర్యోధునుడు, భీముడు, మట్టిని కాస్తయినా తీసుకోవాలని పోటీ పడతారు. దుర్యోధునిడికుడిచేతిలో ధనరేఖ జెర్రిపోతులా వుంటుందనీ, ఆ మట్టిని తీసుకెళ్తే తమ యిల్లు కూడా ధనధాన్యాలతో వృద్ధి కొస్తుందనీ వాళ్ళునమ్ముతారు. దుర్యోధనుడి చావు తర్వాత దేశమంతా వల్లకాడయిపోయిందనీ, ధర్మరాజు పాలనతో పోలిస్తే దుర్యోధనుడి పాలనలోనే ప్రజలు ధనవంతులుగా వుండేవారనీ చాలా మంది భావిస్తారు.

భారతమిట్టలో రాత్రిఆట తొమ్మిదిగంటలకు ఆరంభమవుతుంది. యిళ్లల్లో భోజనాలు చేశాక చుట్టూవున్న గ్రామాల్లోని ముసలీ ముతకా, పిల్లాజెల్లా అందరూ చాపలతో శాలువాలతో ఆటకొస్తారు. వేదిక ముందు చాపలు పరుచుకుని తాంబూలం తింటూ కావాలంటే పడుకునే ఆటను చూస్తారు. కుప్పం దగ్గరి 'కంగుది' గ్రామం ఆట ఆడే నటుల తావరం. ఆవూరినుంచీ నటులు కుటుంబాలు కుటుంబాలుగా ఆటఆడడం కోసం వస్తారు. ముఖాలకు అద్దలం పూసుకుని, వీపుకు పొడుగ్గా శాలువాలు కట్టుకుని, అట్టముక్కలతో చేసిన కిరీటాలు తొడుక్కుని, మరింత ఆకర్షణీయంగా కనబడడం కోసం నల్ల కళ్లద్దాలు కూడా తొడుక్కుని, గడియారాలు చేతికికట్టుకుని, వేదికపైన దుమ్మురేగేలా వాళ్ళు కదంతొక్కేస్తారు. వాళ్ళకు గుర్తున్నరీతిలో పద్యాలూ,వచనాలూ,పాటలూ కలిపి పాడేసి, తమదైన చిత్రమైన పద్ధతిలోవాళ్ళు తెల్లవారేవరకూనాటకం వేస్తారు. సూత్రధారికి జానపదరూపమైన సోపుదారుడూ,నవ్వించడంకోసం విదూషకులూచొచ్చుకొచ్చేస్తారు. విషాదఘట్టాల్లోనయితే ప్రేక్షకులు వొళ్ళుమరిచిపోయి యేడుపుల్లో మూగిపోయేలా సన్నివేశాల్ని సాగదీస్తారు.

ప్రతిరోజూ నాటక ప్రదర్శనకు ముందు గుడి నుంచీ పోతురాజు విగ్రహాన్ని తీసుకొచ్చి రాళ్ళతో కట్టిన వేదికపై పెట్టి పూజచేస్తారు. కర్పూరం వెలిగించి ప్రార్థన పాడతారు. వొక హార్మోనియమూ, తబలా మాత్రమే వాళ్ళపాటకూ, పద్యాలకూ సంగీతాన్ని సమకూరుస్తాయి. నాటకం ముందుగా నటీనటులందరూ వేషాలతోనూ, వేషాలు లేకపోయినా వచ్చి వేదికపైన నిలబడి "శుక్లాంబరధరం విష్ణుం" అని వినాయకుడిని స్తుతించాక "పరబ్రహ్మ పరమేశ్వర...." ని నటరాజును వేడుకుంటారు. ద్రౌపదీ వస్త్రాపహరణం ప్రదర్శించే ముందు ద్రౌపది పాత్ర ధరించే వ్యక్తితో బాటూ దుర్యోధన దుశ్శాసన పాత్రల్ని వేసేవాళ్ళూ వేషాలతోనే వేదికపైకి వస్తారు. వాళ్ళకు హారాల్ని వేశాక, కర్పూరపుహారతులిచ్చి కొబ్బరి కాయల్ని పగలగొట్టి నైవేద్యమిస్తారు. కొంతమంది భక్తులు ద్రౌపదికి కుంకుమ, చీరలు, జాకెట్టు ముక్కలు సమర్పిస్తారు. ద్రౌపది పాత్ర ధారుడు/ ధారిణి ఆరేడు చీరల్ని వొకదానిపైనొకటి కట్టుకుని వుంటుంది. వాటిని వొకదాని వెంట వొకటి లాగుతూ దుశ్శాసనుడు నటిస్తాడు.

18 రోజుల యజ్ఞం ముగిశాక పాండవుల విగ్రహాల్ని, శ్రీకృష్ణుడు, పోతురాజుల విగ్రహాల్ని గుడిలో పూజిస్తారు. సాధారణంగా గుడిలో రోజూ పూజలు చేసే పురోహితుడు బ్రాహ్మణుడై వుండడు.

కౌరవ పాండవ సంగ్రామంలో ఆంధ్రులు కౌరవుల పక్షంలోవుండి యుద్ధం చేశారని మహాభారతం చెప్తోంది. అందుకే యిప్పటికీ ఆంధ్రుల్లో కౌరవ పక్షపాతం స్పష్టంగానే కనబడుతుంది. మహాభారతం ఆధారంగా వచ్చిన చాలా తెలుగు సినిమాల్లో దుర్యోధనుడిదే పైచేయిగావడం మనందరికీ తెలుసు. అయితే తొండనాడు జనం మాత్రం పాండవ పూజ చేస్తారు. తొండనాడు గ్రామాల్లో ధర్ముడు, భీముడు, అర్జునుడు అనే పేర్లు మాత్రమే గాకుండా కుంతి, ద్రౌపది, నకులుడు, సహదేవుడు పేర్లు గూడా జనం పెట్టుకుంటారు. మిగిలిన తెలుగువారికి భిన్నమైన తొండనాడు సంప్రదాయానికి మూలాలేమిటో తెలుసుకోవలసివుంది. కురుక్షేత్ర యుద్ధం తరువాత పాండవ పక్షపు సైనికులు కొందరు తొండనాడు కొచ్చి స్థిరపడ్డారనీ, అందుకే వాళ్ళు పాండవ పూజను చేస్తారనీ కొందరు వూహిస్తున్నారు. అయితే దీన్ని శాస్త్రీయంగా నిరూపించవలసివుంది.

సాధారణంగా హరికథల్లో కథకుడు కవిత్రయ మహాభారతంలోని పద్యాలనే పాడుతూవుంటాడు. ప్రస్తుతపు ఆంధ్రప్రదేశపు సరిహద్దుల కవతల వేలూరు, తిరువళ్లూరు జిల్లాల్లోని సరిహద్దు ప్రాంతాల్లో జరిగే భారతయజ్ఞంలోనూ తెలుగు పద్యాలూ, తెలుగు హరికథలే జరుగుతున్నాయి. కానీ వాటికవతల తొండనాడులోని భారతయజ్ఞపు ప్రస్తుత పరిణామమేమిటో వాళ్ళు చెబుతున్న భారతపు భాష, పద్యాలూ యేమిటో తెలుసుకోవలసివుంది.

చిత్తూరు జిల్లాలోనూ, దాని సరిహద్దు ప్రాంతాల్లోనూ జరుగుతున్న మహాభారతయజ్ఞంలో గూడా చాలా మార్పులొచ్చేశాయి. యిప్పుడు ఆ పజ్జెనిమిది రోజుల్లోనూ భారతంమిట్ట పెద్ద యెగ్జిబిషన్‌గానూ, అమ్యూజ్‌మెంట్ పార్కుగానూ మారిపోయింది. ముందుగా కార్యనిర్వాహకులు అక్కడ పెట్టబోయే రకరకాల అంగళ్ళకు వేలంపాట పెడతారు. పెద్దమొత్తంలో పెట్టుబడిపెట్టి అంగళ్ళను అనుమతి తెచ్చుకున్న వ్యాపారులు రకరకాల సామానులు, బట్టలూ అమ్మకంసాగిస్తారు. అయితే వాటన్నింటికంటే బాగా జనాల్ని ఆకర్షించేవీ, డబ్బుల వరదల్ని తయారు చేసేవీ రకరకాల జూదగృహాలే! చింతగింజలాట, లంగరు, లోపలా బయటా వంటి గ్రామాల జూదాలతో బాటూ పేకాట, మట్కాలవంటి ఆధునిక జూదాలూ ఆ పజ్జెనిమదిరోజుల పాటూ భారతంమిట్టలో మోహరిస్తాయి. అలా అంగళ్ళను వేలాలు లేకపోతే బాగా ఖర్చుతో గూడిన భారత యజ్ఞాన్ని నిర్వహించడమెలా అని నిర్వాహకులు నిలదీస్తారు. చీకటి మాటున సాగే అన్ని రకాల అరాచకపు వ్యాపారాలకు చాలా భారతం మిట్టలు నిలయాలుగా గూడా మారిపోయాయి.

పాచికలనే జూదం వ్యసన మవడంతో రాజ్యాన్నీ, భార్యనూ, సోదరులనూ పోగొట్టుకున్న ధర్మరాజు కథను గానం చేసే మహాభారతం దుర్వసనాల పర్యవసాన మేమిటో స్పష్టంగానే వెల్లడిచేస్తుంది. అయితే అదే మహాభారతాన్ని యజ్ఞంగా మార్చిన తొండనాడు ఆధునిక మహాభారతాలు జూదాలవేలంలో వచ్చేడబ్బుతో నిర్వహించబడడమే పెద్ద విపత్కరం.

బి. లలితానంద ప్రసాద్
92474 99715

# రచనా, రచయితా– ఏది ముఖ్యం?

ప్రక్రియ ఏదైనా రచన అంటే చెప్పడం. ఏమి ఇవ్వాలన్నా ఇచ్చే వారి దగ్గర అది ఉండాలి. అలాగే చెప్పటానికి ఏమైనా ఉండాలి. ఉండాల్సినది ఏదీ దానంతట అదే ఎవరిలోనూ జొరబడదు. అందుకు అనేకం కావాలి. వాటితో సరిపోదు. ప్రతిదానికి విషయం, అభివ్యక్తీ కీలకం. వాటి స్థాయి రచయిత శక్తిసామర్థ్యాలతోపాటు అంశము లోతులు, విస్తృతి, భిన్న పార్శ్వాలు స్పృశించటం అవసరం. ఇందుకు మిగతా అన్నింటితోపాటు నిజాయితీ, అంశం తాలూకు మనిషిపట్ల నిమగ్నత, విశాలత్వం అవసరం. రచయితల స్థాయినిబట్టి రచనస్థాయి ఉంటుంది. ఏ స్థాయి రచనలకు ఆ స్థాయి పాఠకుల ఆదరణ లభిస్తూనే ఉంటుంది. అయితే కొందరు ఏ రచనలోనైనా రచయిత తాలూకు దృక్పథం ప్రస్ఫుటం కావాలని ప్రబోధిస్తూ ఉంటారు. ఇది ఎంతవరకు సబబు అనే విషయాన్ని పరిశీలిద్దాం. దీనితోపాటు అసలు మనిషి– సమాజం ఎట్లా ఉన్నాడు? ఉన్నది? ఎట్లా ఉండాలి? అంతరాలు ఏమిటి? ఎందుకు? వాటిని ఎట్లా పూడ్చాలి? తెలియని, తెలుపని సాహిత్యం, కళలు ఎవరికోసం? ఎందుకోసం? అనేది కూడా గమనంలో ఉంచుకోవాలి.

ప్రతి రచనా అక్షరాల్లో రచయిత అంతరంగ నిశ్శబ్ద ఘోషే. వాటిలో తనని తాను వివిధ రూపాలలో ఆవిష్కరించుకుంటాడు. అతని ప్రమేయం, అప్రమేయాలతో తీసుకున్న వస్తువులకు సంబంధించిన అధ్యయనం, అవగాహన, ఆలోచన, అనుభవాలు, అంచనాలు, అనుభూతులు అంతర్లీనంగా అంతటా ప్రవహిస్తుంటాయి. రచయితకు లేని వికాసం అతని రచనల్లో ఉండదు. అలాగే ఉన్నది లేకుండానూ పోదు. తీసుకున్న అంశానికి సంబంధించిన పూర్వాపరాలు, అన్ని కోణాలు, శాస్త్రీయంగా, చారిత్రికంగా, వైజ్ఞానికంగా, సహేతుక పరిణామాల్ని పరిగణనలోకి తీసుకుని పరిణిత రీతిలో కళాత్మకంగా అభివ్యక్తిలో ప్రదర్శిస్తాడు. ఎక్కడా వాస్తవాతీతంగా నేల విడిచి సాము చేయడు. ఇక్కడ తనకన్నా తన రచన ముఖ్యంగా భావిస్తాడు. తన రచనల్లో వాటికి సాహితీ, కళారూపాలను ఇస్తాడు. దీనిలో ఎక్కడా రాజీపడడు. రాజీపడితే ఆ మేరకు ఆ సృజనకు హాని జరిగినట్లే. దానితోపాటు సహృదయ పాఠకునికి అతని ఆస్వాదన ప్రమాణాలకి ద్రోహం చేసినట్లే. కాబట్టి ఇక్కడ రచయితకు అతని ధోరణి, దృక్పథాల కన్నా రచనే ముఖ్యం. సమాజంతో చదువరితో అతని అనుసంధానం రచనతోనే కాబట్టి, మానవత్వాన్ని, కారుణ్యాన్ని మించిన ఏ సృజనాత్మక, విశ్లేషణాత్మక విలువలూ ఉండవు.

అయితే కొందరు విమర్శకులు సదుద్దేశ్యంతోనే కావచ్చు– రచనలో రచయిత దృక్పథం ముఖ్యం అంటారు. బహుశా మనిషి పట్ల వారి అపార నిరంతర తపన అలా అనిపిస్తూ ఉండవచ్చు. ఇది అసంబద్ధం. ఎంతటి మహోన్నత దృక్పథాలు ఉన్నా వీరి రచనలలో సంవిధానంలో అంతర్లీనంగా అవి ప్రతిఫలించనప్పుడు అవన్నీ నిరర్థకం. అసలు నిజమైన ఆసక్తి గల పాఠకులకు రచనకు మించినవి పట్టించుకోవాల్సిన అవసరం ఏమాత్రం ఉండదు. పైగా వీటి పేరుతో ఏర్పడిన లేక ఏర్పరుచుకున్న చట్రాలతో, వాటి పరిధిలో, పరిమితులతో రచనా స్వేచ్ఛకు సంకెళ్లు పడతాయి. పంట చేనునీ కంచెలా ఆక్రమిస్తాయి. చెంగున గంతులు వేయవలసిన లేగదూడలకు గుదిబండలవుతాయి. స్వేచ్ఛగా విప్పారి ఎగరాల్సిన రెక్కల్ని కత్తిరించినట్లు అవుతుంది. రంగులు, గీతలు, గోడలు విశ్వ మానవుల శరీరాన్ని బీటలు గావిస్తాయి. ఎవరి చట్రంలో వారు 'గుడుగుడు గుంచం' చందం అవుతుంది. సంకెళ్ళతో స్వీయ జైల్లో మగ్గిపోతారు. జీవన పరిపూర్ణ పరిమళ ఆస్వాదనకి అవరోధంగా ప్రహరీ పంజర ప్రక్రియ ఏర్పరచుకుంటారు. ఇతరులకి ఏర్పరుస్తారు. మనిషి అయినా మానైనా కలుగుల్లో నుంచి వెలుగుల్లోకి వస్తేనే వికసించి, విస్తరించి, పరిమళించి, ఫలభరితం అయ్యేది. లేకుంటే గ్రహాంతరాలలోకి వెళ్లినా గుహాంతరంలోకి మరలినట్లే. తానో అగ్నిగుండమై ఎగసి సూర్యగోళంగా నింగి నుండి నేలంతా కాంతిపుంజాలు విరజిమ్మాలి. అతడే అసలు సిసలు సృజనకారుడుగా మిగిలేది.

పాఠకులు ఎవరూ రచయితలకు తీసిపోరు. వారిని ఏమాత్రం తక్కువ చేయరాదు. ఆ మాటకొస్తే చాలామంది **సీరియస్ చదువరులు అనేక మంది రచయితలకన్నా పరిపరి విధాల మెరుగ్గా ఉంటారు. నిజమైన మంచి రచయితలంతా మంచి చదువరులే.** వారందరికీ తెలిసిందే అనాదిగా మానవాళితోపాటు సృజనకారులు కూడా భావ, భౌతికవాదులుగా విడిపోవటం. నిజానికి రెండూ అవిభాజ్యం, అనంతంగా. భౌతికం లేనిదే భావానికి అస్తిత్వం ఉండదు. భావం లేకుండా ఏ సృజనా ఉండదు. భూగోళాన్ని కలిపి ఉంచే ధ్రువాలలాగా, ప్రాణి, ప్రాణంలాంటిది ఒకదానికొకటి. ప్రకృతిలో ప్రతి ప్రాణి జీవన సమస్తం ద్వంద్వాల సమ్మిశ్రమం లాగానే ఇవి రెండూను. వీటిని విడదీసి ముక్కలుగా ప్రదర్శించటం అంటే అది ఏదోరకంగా పాక్షికతను, వివక్షతను, సంకుచితత్వాన్ని ప్రోది చేసి ప్రచారం గావించడమే. రెండింటిలో ఏ ఒకటి లేకుండా మరొకటి లేనప్పుడు ఏదో ఒక దాన్ని పట్టుకుని పాకులాడటం నిలువ నీరు కావడమే. అది పాచిపోవడమే గాక రకరకాల రుగ్మతలకు కారణమవుతోంది.

మనిషి దైనందిన జీవితంలో బాహ్య అంతరాలనీ అత్యధికంగా ప్రభావితం చేసే అనేక అంశాలు ఉంటాయి. వివిధ రంగాల వ్యక్తుల గమ్యం గమనాన్ని అవి నిర్దేశిస్తాయి. వాటిలో రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలు ముఖ్యమైనవి. వాటిని గంపగుత్తగా విస్మరించి వాటన్నింటిని, ఏదో నెపంతో కార్పొరేట్ సంస్కృతి అన్నట్లుగా పేర్కొని దూరం పెట్టడం సృజనకారుడు వాస్తవాలను తృణీకరించడమే. వ్యవస్థల పట్ల వైముఖ్యంతో ఏరకపు సృజనకారుడు అవుతాడు? తాను వాటిని వద్దనుకున్నా అవి ఏ ఒక్కరిని వదలవు

అనే స్పృహ నిజమైన సృజనకారునికి ఉండితీరాలి. వాటి తీరుతెన్నులు అందరితో పాటు తనని వదలవనే మెలకువ కలిగి తగు పరిశీలనతో వెలుగులోకి తేవాలి. ప్రతి మనిషికి జీవధాతువులయిన విద్య, వైద్యం కార్పొరేట్ రంగంపాలై సమాజం ఎందుకూ కొరకాకుండాపోతుంటే వాటిపట్ల స్తబ్దత క్రాంతదర్శిగా చెప్పుకునే వారికి బాధ్యతారాహిత్యం కాదా? అట్లే అందరికీ చెందిన వాటిని కొందరికి కట్టబెట్టడం, విశ్వవ్యాపితంగా ఒక శాతం వృద్ధి కోసం 99 శాతం మంది ప్రజలు జీవించటం పట్ల కనీస పరిజ్ఞానరాహిత్య రచనలు ఎవరి ఉద్ధరణకు? మరి ఎవరి ఆనందం కోసం? ఆత్మపరిశీలన చేసుకోవాలి. జ్ఞానశూన్యతని పైపై మెరుగులతో ప్రచార ఆర్భాటాలతో కప్పిపుచ్చలేరని గుర్తుంచుకోవాలి. దానికి ఏదీ ప్రత్యామ్నాయం కాదని గ్రహించాలి.

అనాదిగా ఉండి, ఇప్పుడు ఇక ముందూ ఉండే విశ్వవ్యాపిత వివిధ రూపాల దుఃఖం, బాధ, వేదన, కన్నీళ్లు, మౌనరోదన, అంతరంగ ఆర్తి ఎక్కడ ఎప్పుడు ఎవరికైనా ఒకటే. వాటిని సమిష్టిగా మానవాళికి ముగింపు పలకగలిగినప్పుడే సమస్త శోకాలకీ విముక్తి. చరమగీతం పలికేది. వీటికీ వివక్షతా రంగులు పులిమి హద్దులు ఏర్పరిచి ముక్కలు ముక్కలుగా ముద్రలు వేసి మురిసిపోవటం అంటే ఎవరి గొయ్యి వారు తవ్వుకున్నట్లే. మనిషి మనిషికి సౌఖ్యాల్లో తేడా ఉండొచ్చేమో గాని ఇవి ఎవరివైనా ఒకటే. అందరివి అన్నీ తొలగిపోవాలని కోరుకోవాలి. అన్ని విధాల ప్రయత్నించాలి. వర్గీకరించుకుని విముక్తి పొందటం ఎన్నటికీ జరుగదు. పైగా అందుకు జరిగే ప్రయత్నాలకి అవరోధాలు అవుతాయి. కాంతి రేఖలతో కలవాల్సిన వారే కారుచీకట్లో ఏకాకులే మిగిలిపోతే ఎలా? ఇలాంటివి వాచ్యం చేయనవసరం లేదు. కానీ వాటి బహుముఖీనత పట్ల ఎరుక అవసరం. అవి రచనల్లో ప్రతిఫలించినపుడు రచయిత తనదైన ముద్ర పాఠకునిలో స్థిరంగా వేయగలుగుతారు.

'వసుధైకకుటుంబం'లో విశ్వవ్యాపిత మనిషి- జాషువా, సంజీవదేవులు అన్నట్లు విశ్వనరుడు, విశ్వమానవుడు కాగలిగినప్పుడే రచనలలో ఉదాత్తత ద్యోతకం అవుతుంది. లేకుంటే గాలిబ్ మాటల్లో 'నరుడు నరుడౌట దుష్కరము' అవుతుంది. ఆర్వెల్ పేర్కొన్నట్లు 'సృష్టిలో సిగ్గుపడే, సిగ్గు పడాల్సిన జంతువు మనిషి ఒక్కడే' అనేది నిరూపితమవుతుంది. వీరు, ఇలాంటి వారు అనేకులు ఎవరూ తమ దృక్పథాలను రచనల్లో కావాలని చొప్పించలేదు. అలా అని పాఠకులకు వారు ఏమిటో తెలియనిది కాదు.అంతిమంగా రచనలోనే రచయితగా కలకాలం జీవిస్తాడు.

ఉదాత్తత ఊపిరిగా ఉండాల్సిన సృజనలో సంకుచితత్వం శ్వాస అయితే అక్షరం క్షరం కాక తప్పదు. ఏ ఛందో పరిష్వంగం నిరోధకం అన్నారో మరో పేరుతో దాన్ని ఆశ్రయించటం స్వేచ్ఛను హరించడమే అవుతుంది. నిరంకుశ రచయిత ఏదో రూపంలో బందీ రచయితగా దాస్యం చేయాల్సి వస్తుంది. పరిణత ఆవిష్కరణలకు ప్రతిబంధకం అయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది. ఏ కొందరినో సంతృప్తి పరిచే ప్రయత్నం అందరికీ దూరం చేస్తుంది. న్యాయానికి అన్యాయం జరుగుతుంది. పాక్షికతని ప్రోత్సహించినట్లు అవుతుంది. ఎవరికోసం ఇదంతానో వారికి అందకుండా పోతుంది.

ఉన్న వ్యవస్థలో ప్రయోజనం పొందేవారు ఎవరూ మార్పుని ఆశించరు. దాన్ని మరింతగా కలిసికట్టుగా స్వప్రయోజనాలకై ఉపయోగించుకుంటారు. దీనికి ప్రతిగా నిజప్రజలైన అట్టడుగు ప్రతి ఒక్కరి కొరకు అపరిమిత త్యాగాలు చేయు వారంతా రకరకాల పేర్లతో చీలికలు పేలికలు అయిపోయి అంతర్ధాన దిశగా పయనిస్తున్నారు. ఆలోచించేవారిని అపరిమిత పరితాపానికి గురిచేస్తున్నారు. హీనులను, దీనులను దిక్కులేని వారిగా చేస్తున్నారు. వీరి అసంఘటితం అవతలివారి సంఘటితంతో సామాన్యుడి పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. అందరి లక్ష్యం గమ్యం, ధ్యేయం, ఆశయం ఒక్కటే అయినప్పుడు ఈ చీలికలకు వాటి తాలూకు పీలికలు కేకలకు అర్థం ఉందా? ఆత్మహత్యా సదృశ్యం తప్ప.

తరచూ అపార విషయ పరిజ్ఞానం గలవారికి తగు స్థాయిలో వాటిని సృజన గావించు నైపుణ్యం లేకపోవచ్చు. మరోపక్క ఆ నైపుణ్యం అధికంగా గలవారికి మొదటిది లోపించవచ్చు. వీరిరువురూ ఏకమై చెదురుగా అయినా రెండూ ఉన్న వారిని వీలైనంత దూరంగా ఉంచటంలో సఫలీకృతులవుతారు. వీటి పర్యవసానం యావత్తు సమాజం దీర్ఘకాలంగా బహురూపాల అనుభవిస్తూనే ఉంది. వీటన్నింటికీ దూరంగా ఉండి ఆసక్తితో గమనించేవారికి కలవరంతో పాటు కంపరం పుట్టిస్తూ ఉంటాయి.

ఏ విషయంలోనైనా ఒకే దృక్పథంతో చూడాలనుకోవడం ఒంటికంటి పక్షుల్లా ఉంటుంది. దేనినైనా భిన్న దృక్పథాల నుంచి పరిశీలించటం పరిపక్వ మనస్థితి ప్రతీకగా నాగరిక సమాజం అభిప్రాయం. ఒకవైపు చూసేందుకు రెండోవైపు అసలు చూపే మానేస్తే వారిని విజ్ఞులు ఎవరూ వివేకవంతులుగా పరిగణించరు. భిన్న దృక్పథాల సంయమన సమన్వయంలోనే క్రియాశీల ఫలితాల సౌరభాలు వెదజల్ల గలిగేది. వెలుగురేఖలకై అన్వేషణలో అందివచ్చిన ప్రతి పరికరాన్ని తోసిపుచ్చక సహేతుకంగా సర్వజనుల శ్రేయస్సుకై వినియోగించుకోవడానికి సంశయింపరాదు.

**మనిషన్నాక ప్రాణం ఉన్నట్లే ఏదో ఒక దృక్పథమూ, ధోరణీ లేకుండా ఉండరు. అయితే అది తన సృజనలో హారంలో దారం లాగానే ఉండాలి. సహజ సిద్ధంగా ఇమడాలి. పువ్వు- పరిమళంలా. ప్రయత్నపూర్వకంగా ప్రదర్శిస్తే కృతకంగా వుంటుంది. మేధో నిజాయితీని శంకింప చేస్తోంది. నిజమైన ఆస్వాదనను దూరం చేసే ప్రమాదం ఉంది. అసలుకే ఎసరు వస్తుంది. ఓ చెరగని ముద్ర ఆ సృజనకారునిపై ఏర్పడి అతని ద్వారా వచ్చే, రాగల అనేకాలకు పాఠకులను దూరం చేయవచ్చు. ఇలాంటప్పుడే అన్ని విధాలా అత్యంత జాగరూకతతో సృజనకారుడు ఉండాలి. అది అతనికీ అతని సృజనకీ శాశ్వతత్వం ఇస్తుంది. తాత్కాలిక గుర్తింపులు, కీర్తింపులు ఎలా ఉన్నా. అవే ముఖ్యం అనుకునే వారి స్థాయి వాటికి అనుగుణంగానే ఉంటుందనేది జగమెరిగిన సత్యం. అసలే రకరకాల భయాలతో బతుకులీడుస్తున్న వారిని అదనపు బంధనాలు బిగించి అక్షర ప్రపంచానికి దూరం చేయకండి. అది అందరిది. అందరికీ అన్ని వేళలా అన్ని విధాలా అనంతంగా అద్వితీయంగా అపురూపంగా క్షరంకాని అక్షరం.**

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# తాపీ ధర్మారావు పురస్కారం- 2021

## హైదరాబాదు- 12 డిసెంబరు 2021 ఉ॥ 10.30గం.


తాపీ ధర్మారావు గారి చిత్రపటానికి
పూలమాల, జ్యోతి ప్రజ్వలన



సభాధ్యక్షుడు ఆచార్య జయధీర్ తిరుమలరావు తొలిపలుకులు


ముఖ్య అతిథి
డా॥ జస్టిస్ జి. రాధారాణి


పుస్తకావిష్కర్త
జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు


విశిష్ట అతిథి
డాక్టర్ కె.శ్రీనివాస్ ప్రసంగం


పురస్కార గ్రహీతను, పుస్తకాన్ని
పరిచయం చేస్తున్న స.వెం.రమేశ్


డి.పి.అనురాధకు పురస్కార ప్రదాన దృశ్యం


'జగమునేలిన తెలుగు... గోదావరి నుండి జావాదాకా' పుస్తక విడుదల


గా.ఉమామహేశ్వరరావు
ఆత్మీయ అతిథి


గూడూరు మనోజ
ఆత్మీయ అతిథి


అనురాధతో ఈనాడు జర్నలిజం స్కూలు
సహాధ్యాయులు


అనురాధని సత్కరిస్తున్న మయన్మార్
తెలుగువారు లండా సుబ్రమణి, ప్రభావతి




సభలో పాల్గొన్న పెద్దలతో కొందరు...

వార్త వివరాలు : పుట 37 నుండి...

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
JANUARY 2022 Vol :7, Issue 8
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23

Bommidala
International




బొమ్మిడాల
ఇంటర్నేషనల్ ప్రై.లిమిటెడ్

బి.టి.సి.హౌస్, ఐదవ వీధి
చంద్రమౌళినగర్, గుంటూరు-522 007

Tel :91-863-2357615, 2357616
Fax : 91-863-2351343
E mail : murtybsk@bommidalainternational.com
bskmurty@yahoo.co.in
Website : www.bommidalainternational.com

If not delivered, please return to : "The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244